20 . 2. 2026

# వెలుతురు

VELTHURU TELUGU DAILY

శుక్రవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 256 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

- తొలిరోజు వర్నర్ ప్రసంగంతో ప్రారంభం
- 28న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి



**హైదరాబాద్,ఫిబ్రవరి 19 వెలుతురు:** తెలంగాణ అసెంబ్లీ బ్జడెట్ సమావేశాల తేదీ ఖరారైంది. ఈనెల 26 నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్



## ఉచిత పథకాలపై మరోమారు సుప్రీం సీరియస్

- ప్రజల సొమ్మును దుబారా చేయడంపై ఆగ్రహం
- పేదలకు విద్య తదితర కనీస అవసరాలు కల్పించాల్సిందే
- చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 19 వెలుతురు:** దేశంలో రాజకీయ పార్టీలు అందిస్తున్న ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్రస్థాయిలో స్పందించింది. తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్

## ప్రజల తెలంగాణ లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణ

- సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, ప్రతి పౌరుడికి న్యాయం
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై సిఎం, మంత్రులకు అభినందన
- తెలంగాణ కాంగ్రెస్ నేతల సమావేశంపై ఎక్స్ వేదికగా ఖర్గే వెల్లడి
- కాంగ్రెస్ అగ్రనేతలతో రెండుగంటలపాటు సిఎం, మంత్రుల భేటీ
- మేడారం జాతర నిర్వహించినందుకు మంత్రి సీతక్కకు ప్రత్యేక అభినందనలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి19 వెలుతురు:** సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, 'ప్రజల తెలంగాణ' లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణను రూపొందించినట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, ప్రతి పౌరుడికి న్యాయం అందించడం తమ ప్రధాన సంకల్పమని ఆయన వెల్లడించారు. ఢిల్లీలోని మల్లికార్జున ఖర్గే నివాసంలో తెలంగాణ



కాంగ్రెస్‌కు సంబంధించిన కీలక సమీక్ష సమావేశం జరిగింది. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, దామోదర రాజనర్సింహా, అడ్లూరి లక్ష్మణ్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు.

## మన ఆలోచనలకు అందనంతగా ఎఐ

- మానవ అభివృద్ధిలో ఎఐది కీలక భూమిక
- భారత్‌లో ఎఐ పురోభివృద్ధి చరిత్రగా నిలుస్తుంది
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి19 వెలుతురు:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యం మన ఆలోచనలకు అందనంత దూరంలో ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ వినియోగం చట్టబద్ధంగా, పునఃసమీక్షించేలా ఉండాలని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' లో గురువారం ప్రధాని ప్రసంగించారు. మానవ అభివృద్ధిలో ఏఐ కీలక భూమిక పోషిస్తోందని ప్రధాని తెలిపారు. మేకిన్ ఇండియా, భారత

## డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు

- కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటు
- ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో టెక్ దిగ్గజాల వెల్లడి
- విశాఖ మీదుగా ఐఐటి ఖరగ్‌పూర్‌కు వెళ్లేవాడిని
- అదే విశాకలో ఇప్పుడు గూగుల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం
- ఎఐ సదస్సులో గూగుల్ సిఇవో సుందర్ పిచాయ్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి19 వెలుతురు:** డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోందని, ఏఐ కేంద్రంగా మారుతోందని పలుదేశాల ప్రతినిధులు ప్రశంసించారు. ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ సదస్సుకు భారత్ వేదికైంది. దిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో 118 దేశాలు పాల్గొన్నాయి. గురువారం జరిగిన సదస్సు అధికారిక ప్రారంభ కార్యక్రమంలో పలువురు దేశాధినేతలు, టెక్ దిగ్గజాలు పాల్గొని కీలక ప్రసంగం చేశారు. కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థను వృద్ధి

## రాష్ట్ర మంత్రుల అవినీతిపై ఆధారాలు సేకరిస్తున్నాం

- కొందరు ఐఏఎస్ అధికారులు మంత్రుల అవినీతికి సహకరిస్తున్నారు
- టీపీసీసీ కరప్షన్- కమీషన్- కలెక్షన్ - కాంగ్రెస్ గా మారింది
- ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు మూటలు అప్పగించడానికే పరిమితమవుతున్నారే తప్ప తెలంగాణకు చేసిందేమిటో చెప్పాలి?
- ఒవైసీ కళ్లల్లో ఆనందం కోసమే హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారు
- 70 లక్షల జనాభాలో 30 లక్షలకుపైగా ముస్లింలే ఉన్నారు
- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను మూసీ నదిలో వదేయడం ఖాయం
- రేవంత్ రెడ్డి సర్కార్ పై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన కరీంనగర్ కార్పొరేటర్ సొగాని కొమరయ్య



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 19:** రాష్ట్రంలో కొందరు మంత్రులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కొందరు ఐఏఎస్ అధికారులే మధ్యవర్తులుగా ఉంటూ ఆయా మంత్రులకు కమీషన్లు ముట్టజెబుతున్నారని మండిపడ్డారు. మంత్రుల అవినీతితోపాటు ఆయా ఐఏఎస్ ల భాగోతంపై ఆధారాలను సేకరిస్తున్నామని చెప్పారు. త్వరలోనే వారి బండారాన్ని

## ఆరు గ్యారెంటీలు సహా హామీలపై స్పష్టత ఇవ్వాలి

- ఇచ్చిన హామీ మేరకు కేటాయింపులు చేపట్టాలి
- ఈ బడ్జెట్‌లో కేటాయింపులతో నిజాయితీ చాటాలి
- సిఎం రేవంత్‌కు కెటిఆర్ లేఖ



**హైదరాబాద్,ఫిబ్రవరి19 వెలుతురు:** ఆరు గ్యారెంటీల పేర్లు చెప్పి అధికారంలోకి వచ్చి వాటి అమలను పక్కన పెట్టారని, ఇప్పటి వరకు ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆరు గ్యారెంటీలో హామీ ఇచ్చిన మహిళలు, వృద్ధులు, విద్యార్థి, యువత, రైతన్నల కోసం భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చిన మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలని కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగలేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు సగం కాలం పూర్తవుతున్నా ,ఇప్పటికీ హామీల్లో 95 శాతం పెండింగ్‌లోనే

## రేవంత్ రెడ్డి క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ



**హైదరాబాద్,ఫిబ్రవరి19( వెలుతురు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. భూపాలపల్లి, మొగులపల్లి పోలీస్‌స్టేషన్లలో 2023లో రేవంత్‌రెడ్డిపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి భూపాలపల్లి కోర్టులో హాజరునుంచి హైకోర్టు మినహాయింపు నిచ్చింది. బహిరంగ సభల్లో తనపై తీవ్ర ఆరోపణలు చేశారంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు రేవంత్‌పై 2 కేసులు నమోదయ్యాయి. ఈ

## వచ్చే మేలో పార్టీని ప్రకటిస్తా

- ప్రధాన ప్రతిపక్షంగా ఎదుగుతాం
- అధికారంలోకి రావడం ఖాయం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



## అధికవడ్డీ రుణాలపై వడ్డీ తగ్గింపు



- మైనింగ్ శాఖలో 33 శాతం ఆదాయం మెరుగు
- ఎక్సైజ్ శాఖలో 24 శాతం ఆదాయం పెరుగుదల
- ఒక్క ఓటుతో ఎన్నో అభివృద్ధి, సంక్షేమాలను చేపట్టాం
- వైసీపీ నెవర్ ఎగైన్.. కూటమి వన్స్ ఎగైన్'
- జగన్ రాష్ట్రానికి అతి ప్రమాదకరమని ప్రచారం జరగాలి
- అసెంబ్లీలో బడ్జెట్ సమాధానంలో మంత్రి పయ్యావుల కేశవ్

**అమరావతి,ఫిబ్రవరి19 వెలుతురు:** అధిక వడ్డీలతో తెచ్చిన రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించేలా సంప్రదింపులు జరుపుతున్నామని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. సుమారు రూ.2 వేల కోట్ల మేర వడ్డీలు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏడాదికి రూ.2 వేల కోట్లు ఆదా అయితే.. చాలా పథకాలు సమర్థవంతంగా అమలు చేయవచ్చన్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే మైనింగ్ శాఖలో 33 శాతం, ఎక్సైజ్ శాఖలో 24 శాతం ఆదాయం పెరిగిందని వివరించారు. గత ప్రభుత్వంలో గనులు, ఎక్సైజ్ ఆదాయం తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లిందని వైసీపీపై పయ్యావుల విమర్శలు గుప్పించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై జరిగిన చర్చల్లో భాగంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో

## తెలంగాణ ఇంటర్ హాల్ టిక్కెట్లు విడుదల

మార్చిలో జరుగనున్న పరీక్షలకు ఏర్పాట్లు

## అప్పుల లెక్కలోనూ బాబు అసత్యాల ప్రచారం

- నా హయాంలో రాష్ట్ర అప్పు రూ.7లక్షల 21 వేల 918 కోట్లు
- రూ.9లక్షల 74 వేల కోట్లు అని చంద్రబాబు తప్పుడు ప్రచారం
- వైకాపా అధినేత, మాజీ సిఎం జగన్ మండిపాటు



**అమరావతి,ఫిబ్రవరి19 వెలుతురు:** అప్పుల లెక్కల్లో కూడా చంద్రబాబు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని వైకాపా అధినేత, మాజీ సిఎం జగన్ మండిపడ్డారు. 2014 కల్లా అప్పులు రూ.లక్షా 47 వేల 717 కోట్లని.. బాబు దిగిపోయే నాటికి రూ.3లక్షల 90 వేల 247 కోట్ల అప్పులు చేశారని మాజీ సీఎం జగన్ అన్నారు. తాము దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ.7లక్షల 21 వేల 918 కోట్లని.. కానీ.. రూ.9లక్షల 74

## ఉచిత పథకాలపై మరోమారు సుప్రీం సీరియస్

ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశ మయ్యాయి. ఉచిత పథకాల వల్ల దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుందని కోర్టు హెచ్చరించింది. తమిళనాడులో ఉచిత విద్యుత్ సరఫరా, ఆర్థిక స్థితిగతులపై విచారణ చేపట్టిన కోర్టు, విద్యుత్ పంపిణీ సంస్థకు నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయో వివరించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. పేదలకు విద్య, కనీస అవసరాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కోర్టు అంగీకరించింది. అయితే, పెద్ద పెద్ద భూస్వాములకు కూడా ఉచిత విద్యుత్ అందించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. 'సౌకర్యం కావాలనుకున్నప్పుడు డబ్బులు చెల్లించాలి కదా! పెద్ద భూస్వాములు ఉచితం అని అనవసరంగా లైట్లు, మెషీన్లు వాడుతున్నారు' అని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందే ఉచిత పథకాలను ప్రకటించే సంస్కృతిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు, సామాజికవేత్తలు తమ సిద్ధాంతాలను పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికింది. ప్రభుత్వం ఇచ్చే ఉచితాల వెనుక ఉన్నది ప్రజల కష్టార్జితమైన పన్నుల సొమ్ము అని కోర్టు గుర్తు చేసింది. రాష్ట్రాలు అప్పుల్లో ఉన్నప్పటికీ ఉచిత పథకాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. రాష్ట్రాలు వసూలు చేసే ఆదాయంలో కనీసం 25 శాతాన్ని రాష్ట్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఎందుకు ఉపయోగించకూడదని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, 'ఉచితాలు ఎన్నాళ్లు కొనసాగుతాయి?' అన్న సుప్రీంకోర్టు ప్రశ్న ఇప్పుడు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారింది. సంక్షేమం పేరుతో ఆర్థిక క్రమశిక్షణను విస్మరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని అత్యున్నత న్యాయస్థానం పరోక్షంగా హెచ్చరించింది.

## 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

వర్మ ప్రసంగించనున్నారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఫిబ్రవరి 28న అసెంబ్లీలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. సారి సభను 10 నుంచి 15 రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ రూపకల్పనపై సర్కార్ కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా ప్రీ బడ్జెట్ సమావేశాలను పూర్తి చేశారు. అన్ని శాఖల మంత్రులు, అధికారులతో మంత్రి భట్టి విక్రమార్క సమీక్షలు నిర్వహించారు. ఈసారి బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. రైతు సంక్షేమం, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. కొత్త సంక్షేమ పథకాలు, నీటిపారుదల, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి వంటి అంశాలపైనా ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో పెన్షన్ల విషయంలో కీలక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఇక, ఈనెల 23న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరుగనుంది. ఈ కేబినెట్‌లో బడ్జెట్ సమావేశాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## వచ్చే మేలో పార్టీని ప్రకటిస్తా

**హైదరాబాద్,ఫిబ్రవరి 19 వెలుతురు:**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ ప్రకటనకు ముహూర్తం ఖరారు చేశారు. మే నెల మొదటి వారంలో మంచి రోజు చూసుకుని పార్టీని అధికారికంగా ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. పార్టీ పేరులో 'తెలంగాణ' అనే పదం తప్పనిసరిగా ఉంటుందని కవిత స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తన మొదటి ఛాయిస్ సిద్దిపేట అని, రెండో ఛాయిస్ బోధన్ అని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ఉండదని, ప్రధాన ప్రతిపక్షంగా తామే అవుతామని కవిత ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తామే వస్తామని, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలతో పాటు జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తోందని, కొత్త తరహా రాజకీయం చేయడం లేదని విమర్శించారు. తన పార్టీ వ్యక్తుల మీద కాకుండా వ్యవస్థల మీద నడవాలన్నారు. ప్రాంతీయ పార్టీలు లీడర్ సెంట్రిక్‌గా ఉంటాయని.. కానీ వ్యవస్థ నిర్మాణం జరగాలని,సైద్ధాంతిక పునాది ఉండాలని అన్నారు. మహిళలను అవమానించవద్దన్నారు కవిత. వైఎస్ షర్మిలా రెడ్డి నేడు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారని.. కానీ, షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ప్రజలకు నచ్చలేదని తెలిపారు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా అని ప్రశ్నించారు. 'నా లైన్‌లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది' అని అన్నారు. తెలంగాణ వాదమే తమ పార్టీ మొదటి లైన్ అని తేల్చిచెప్పారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చినవారు కేంద్ర మంత్రులు అయ్యారని చెప్పుకొచ్చారు. కొత్త తరానికి తాను పెట్టబోయే పార్టీలో అవకాశాలు ఉంటాయని కవిత పేర్కొన్నారు.

## డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు

పథంలో నడిపిస్తాయి. ఏఐ నిర్మాణం అందరికీ చాలా ఉపయోగంగా ఉంటుంది. భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ మార్పుల వేగం చూసి ఆశ్చర్యపోతున్నా. విద్యార్థిగా ఉన్నప్పుడు ఐఐటీ ఖరగ్‌పూర్‌కు విశాఖ మీదుగా వెళ్లేవాడిని. అదే విశాఖ తీరంలో ఇప్పుడు గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటవుతోంది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు. డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోంది. గతంలో భారత్‌లో బ్యాంకు ఖాతా తెరవాలంటే సమస్యగా ఉండేది. ప్రస్తుతం ఎలాంటి పత్రాలు లేకుండానే బ్యాంకు ఖాతా తెరవగలుగుతున్నారు. ఫోన్‌లోనే బ్యాంకు ఖాతా తెరిచే సౌలభ్యం వచ్చింది. 140 కోట్ల మంది ప్రజలకు భారత్ డిజిటల్ ఐడెంటిటీ తీసుకొచ్చింది. ఆవిష్కరణల పథంలో అందరూ కలిసి ముందుకు సాగాలి. ప్రతినెలా 20 బిలియన్ల డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. 500 మిలియన్ల మందికి డిజిటల్ హెల్త్ ఐడీలు ఇచ్చారని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ ప్రశంసించారు. ఏఐ కృత్రిమమైనది కాదు.. వాస్తవమైనదని టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. ఏఐ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోంది. 140 కోట్ల మంది ప్రజలతో అతిపెద్ద డిజిటల్ ఐడెంటిటీ వ్యవస్థ కలిగిఉంది. ప్రపంచంలో జరిగే వాటిలో భారత్ నుంచే సగం డిజిటల్ లావాదేవీలు ఉన్నాయి. భారత్‌ను ఏఐ కేంద్రంగా ప్రధాని తీర్చిదిద్దుతున్నారు. సెమీకాన్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా సాంకేతికత అభివృద్ధి జరుగుతోంది. ఏఐ నైపుణ్య శిక్షణలో భారత్ పురోభివృద్ధి సాధిస్తోందన్నారు. గత దశాబ్దకాలంగా ఏఐ వేగంగా ముందుకెళ్తోంది. అతి త్వరలోనే మనుషులు చేసే అత్యంత క్లిష్టమైన పనులను ఏఐ మోడళ్లు సులువుగా పూర్తి చేసే రోజులు రానున్నాయి. ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి. ఆ సవాళ్లను పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొన్నారు.

## మన ఆలోచనలకు అందనంతగా ఏఐ

ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ సదస్సు చాటుతోందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఆరోవంతు జనాభా భారత్‌లోనే ఉందని, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటోందని చెప్పారు. కృత్రిమ మేధను ఉపయోగించుకోవడంలో దేశ యువత ఆసక్తి కనబరుస్తోందని తెలిపారు. భారత్‌లో ఏఐ పురోభివృద్ధి ఒక చరిత్రగా నిలుస్తుందన్నారు. కృత్రిమ మేధకు పరివర్తన శక్తి ఉందని ప్రధాని చెప్పారు. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుందని, అదే సద్వినియోగం చేసుకుంటే పరిష్కారాలు చూపుతుందని అన్నారు. మనుషులు, సాంకేతికత కలిసి అభివృద్ధి పయనం సాగించే శకంలో మనం ఉన్నామని తెలిపారు. భవిష్యత్తులో ఏఐ ఏం చేయగలదో కాదు.. ప్రస్తుతం కృత్రిమ మేధను ఉపయోగించి మనం ఏం చేయగలమనేదే అసలు ప్రశ్న అని అన్నారు. ప్రజా సంక్షేమం, శ్రేయస్సే ఏఐకి మన బెంచ్‌మార్క్‌లు అని, మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం అవ్వాలని ప్రధాని అన్నారు. కృత్రిమ మేధ మనలను శాసించకూడదని, మనమే ఏఐని శాసించాలని మోదీ చెప్పారు. కృత్రిమ మేధ వినియోగంలో 'మానవ్ విజన్' ఉండాలని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్ అని ఆయన వివరించారు.

## రేవంత్ రెడ్డి క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ



రెండు కేసులను కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. కోర్టులో హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలుకు గండ్ర తరఫు న్యాయవాది సమయం కోరడంతో తదుపరి విచారణను న్యాయస్థానం 3 వారాలకు వాయిదా వేసింది.

# ప్రజల తెలంగాణ లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణ

సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్ట్, పార్టీ ప్రస్తుత పరిస్థితులు, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది.సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందించారు. ముఖ్యంగా తెలంగాణ మున్సిపల్ ,స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘనవిజయం నేపథ్యంలో ఈ సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మల్లికార్జున ఖర్గే తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించిందని, రాష్ట్ర నాయకులు, మంత్రులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా తదుపరి కార్యాచరణపై చర్చించామని, సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం అనే లక్ష్యాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి ఆకాంక్షలను సాకారం చేస్తూ సమగ్ర తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. సుమారు 2 గంటలపాటు భేటీ కొనసాగింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. సీఎం, మంత్రులు, నాయకులతో సమగ్ర సమీక్ష నిర్వహించాం. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం చేయడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం అని ఖర్గే పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేడారం జాతరను ఘనంగా నిర్వహించినందుకు మంత్రి సీతక్కను కాంగ్రెస్ అగ్రనేతలు అభినందించారు. ఆదివాసీల అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరపై సుమారు పది నిమిషాల పాటు చర్చ జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ.. మేడారం జాతర చరిత్ర, ప్రాశస్త్యం గురించి మంత్రి సీతక్కను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క-సారలమ్మల పోరాట గాథను ఖర్గే, రాహుల్ ఆసక్తిగా విన్నారు. సమ్మక్క ? సారలమ్మల చరిత్రను దేశవ్యాప్తంగా చాటేందుకు సినిమా తీయాలని రాహుల్ గాంధీ సూచించారు. పార్టీ సమావేశంలో మంత్రి సీతక్క, రాహుల్ గాంధీ మధ్య సరదా సంభాషణ జరిగింది. మేడారం జాతరకు ఆహ్వానిస్తే తాము తప్పకుండా హాజరయ్యేవారమని రాహుల్ గాంధీ అన్నారు. 'ఆహ్వానిస్తే తాను కూడా తల్లుల దర్శనానికి వచ్చే వాడిని' అని మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. అయితే సమయాభావం వల్ల వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోయినట్లు మంత్రి సీతక్క వివరించారు. వచ్చే జాతరకు తప్పకుండా అధికారిక ఆహ్వానం అందిస్తామని సీతక్క అన్నారు. 'ఆహ్వానం అందితే తప్పకుండా వస్తాము' అని రాహుల్ గాంధీ, ఖర్గే హామీ ఇచ్చారు.

# అధికవడ్డీ రుణాలపై వడ్డీ తగ్గింపు

సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూనే.. వైసీపీ గత పాలనపై మంత్రి మండిపడ్డారు. 'వైసీపీ నెవర్ ఎగైన్.. కూటమి వన్స్ ఎగైన్' అంటూ పయ్యావుల వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి వైసీపీ హానికరం అనే స్టాట్యూటరీ వార్నింగ్ నిరంతరం ఇస్తూనే ఉండాలని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ దేశస్థుల తరహాలో ప్రజలు కూడా మన రాష్ట్రం అనే భావనను పెంపొందించుకోవాలని సూచించారు. కూటమి జరిపిన భూ కేటాయింపుల వల్ల కలిగిన లాభాలను.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిపిన భూ కేటాయింపుల వల్ల కలిగిన నష్టాలను మంత్రి సభలో ఏకరువు పెట్టారు. సీఎం చంద్రబాబు హయాంలో భూములు కేటాయిస్తే... కియా, హెచ్‌సీఎల్, అశోక్ లేలాండ్, హీరో కంపెనీ, టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ ఏఐ డేటా సెంటర్ వంటి సంస్థలు వచ్చాయని తెలిపారు. వైసీపీ హయాంలో ఇచ్చిన భూముల్లో ఒక్క కంపెనీ కూడా రాలేదని గుర్తుచేశారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్, వ్యాన్ పిక్, బ్రాహ్మణి స్టీల్స్‌కు భూములిచ్చినా.. ఒక్క ఎంఎస్ఎంఈ కూడా రాలేదని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్ అంశంపై సభలో పయ్యావుల ఆసక్తికర కామెంట్లు చేశారు. సీఎం చంద్రబాబు తీసుకున్న చొరవతో పరిశ్రమల్లోనే కాదు.. పొలాల్లో కూడా పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పొలాలను కొంటున్నారని, దానిమ్మ పండిస్తున్నారని వెల్లడించారు. చంద్రబాబు చొరవతో రాయలసీమ ఉత్పత్తులకు అరకు తరహాలో అంతర్జాతీయ బ్రాండింగ్ రాబోతోందం టూ సంతోషం వ్యక్తం చేశారు.

అలాగే, రాయలసీమ ప్రాజెక్టులకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన ద్రోహాన్ని మంత్రి పయ్యావుల వివరించారు. 102 రాయలసీమ ప్రాజెక్టులను ఒక్క సంతకంతో రద్దు చేశారని జగన్‌పై ్ర÷ర్ అయ్యారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించడం లేదని నాడు కేంద్రానికి అప్పటి ఇరిగేషన్ స్పెషల్ సీఎస్‌గా ఉన్న ఆదిత్యనాథ్ దాస్ స్పష్టం చేశారంటూ డాక్యుమెంట్లను మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టారు. తన బడ్జెట్ రిప్లైలో 'ఒక్క ఓటు.. వంద లాభాలు' అంటూ కూటమి ప్రభుత్వం చేసిన పనులను మంత్రి పయ్యావుల ప్రస్తావించారు. అమరావతికి రూ.12 వేల కోట్లు, పోలవరానికి రూ.15 వేల కోట్లు, విశాఖ స్టీల్ ప్లాంట్ పునరద్ధరణకు రూ.11 వేల కోట్లు,విశాఖకు గూగుల్ డేటా సెంటర్, విశాఖకు రైల్వే జోన్,పూర్వోదయ స్కీం,రాయలసీమ హార్టికల్చర్ హబ్,అమరావతికి క్వాంటమ్ వ్యాలీ,విద్యుత్ ఛార్జీల తగ్గింపు, వేలాది కోట్ల నేషనల్ హైవే ప్రాజెక్టులు, రైల్వే లైన్లు ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ఎ÷-లాంట్,ఒక్క ఓటు టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు, కేవలం మూడు రోజుల్లో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులకు 610 ఎంఓయూలు, ఆడబిడ్డలకు భద్రత, రాయలసీమకు హంద్రీ - నీవా కాల్వల ద్వారా కృష్ణా జలాలు,అమరావతికి రాజధానిగా చట్టబద్ధత,రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలు.. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, టీచర్ రిక్రూట్‌మెంట్, పోలీస్ కానిస్టేబుళ్ల నియామకం లక్షల కోట్ల సంక్షేమం,20 లక్షల ఉద్యోగాల కల్పనకు రోడ్ మ్యాప్, లక్షల కోట్ల అభివృద్ధి,పోర్టులు, ఎయిర్ పోర్టులు,ఇంటింటికి తాగు నీటి కనెక్షన్లు,గుంతల్లేని రోడ్లు వంటివన్నీ చేయగలిగామని వివరించారు. పయ్యావుల సమాధానం ఇస్తుండగా అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు.

# ఆరు గ్యారెంటీలు సహా హామీలపై స్పష్టత ఇవ్వాలి

ఉన్నాయని ఆరోపించారు. ఈ సారైన బడ్జెట్ లో కేటాయింపులు చేయాలని లేనిపక్షంలో తెలంగాణ సమాజం ఇంకా ఓపికపట్టే ప్రసక్తే లేదని గుర్తుచేశారు. ఆయా వర్గాలకు రెండు సంవత్సరాలుగా ఎగ్గొట్టిన హామీలను, కాంగ్రెస్ ఇస్తామని చెప్పిన నిధుల బకాయిలకు ఈ బడ్జెట్లో కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దాని నిలబెట్టుకోవాలన్నారు. ఈసారి కూడా హామీల అమలకు నిధులు కేటాయించకుంటే ప్రజల తరఫున ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొస్తామని , మోసకారి కాంగ్రెస్‌ను ప్రజలపక్షాన నిలదీస్తామని హెచ్చరించారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఈ తరుణంలో 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మీరిచ్చిన హామీల గురించి తెలంగాణ ప్రజల పక్షాన గుర్తుచేసేందుకే ఈ లేఖ రాస్తున్నానని వెల్లడించారు. తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరిట మభ్యపెట్టి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ అమలుకు నోచుకోని నేపథ్యంలో, కనీసం ఈ సారి బడ్జెట్ లోనైనా అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ నాలుగు కోట్ల ప్రజల పక్షాన మిమ్మల్ని కోరుతున్నానని అన్నారు. వృద్ధులు, వితంతువులకు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్‌ను నాలుగు వేలకు పెంచడానికి ఎన్ని నిధులు కావాలో లెక్కగట్టి ప్రతి పైసాను ఈ సారి బడ్జెట్‌లో కేటాయించాల్సిన బాధ్యత మీపై ఉంది. అలాగే రాష్ట్ర జనాభాలో సగభాగంగా ఉన్న ప్రతి ఒక్క మహిళకు మహాలక్ష్మి కింద నెలకు రూ. 2500లు అందజేస్తామని హామీ ఇచ్చి 25 నెలలు గడిచినా ఇప్పటికీ ఒక్క లబ్దిదారుకు ఒక్క పైసా దక్కలేదు. అందుకే ఈసారి బడ్జెట్ కేటాయింపుల్లో ఈ గ్యారెంటీ అమలుకు అడుగులు పడకపోతే ఆడబిడ్డలు ఊరుకునే ప్రసక్తే లేదనే విషయాన్ని గుర్తుచేస్తున్నాను. అలాగే కేసీఆర్ గారి హయాంలో తెలంగాణను పంజాబ్ నే తలదన్నేలా, దేశానికే ధాన్యాగారంగా తీర్చిదిద్దిన రైతులకు అందిన రైతుబంధును 15 వేలకు పెంచుతామని మాటిచ్చి మోసం చేసినందుకు ముందు క్షమాపణలు చెప్పి, ఆ మొత్తాన్ని బడ్జెట్ లో కేటాయించాలని అన్నదాతల పక్షాన కోరుతున్నాను. అలాగే ఇప్పటికే మూడుసార్లు పెండింగ్‌లో పెట్టిన రైతుబంధు పాత బకాయిలను కూడా చెల్లించాలన్న రైతుల డిమాండ్‌ను మీ ముందు ఉంచుతున్నాను. అలాగే కౌలు రైతులకు, రైతు కూలీలకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వారి ఖాతాల్లో నిధులు జమ చేయాలని కోరుతున్నాను. కేవలం రైతులు, మహిళలకే కాదు, నిరుద్యోగులకిచ్చిన ప్రతి హామీ కూడా రెండేళ్ల నుంచి పెండింగ్ లోనే ఉంది. తొలి ఏడాదే రెండులక్షల ఉద్యోగాల భర్తీతోపాటు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుకు కూడా బడ్జెట్ లో కేటాయింపులు చేయాలని తెలంగాణ యువతీ యువకుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. అలాగే ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లకు ఇస్తానన్న ఆర్థిక సహాయం అందజేయడానికి 2026-2027 బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కోరుతూ బీఆర్ఎస్ పక్షాన కోరుతున్నాను.ప్రజాపాలన పేరిట మరొక్కసారి ప్రజలను మభ్యపెట్టడానికి, నిట్టనిలువునా మోసగించడానికే సన్నాహాలు చేస్తున్నట్లు కనబడుతోంది. అలాగే పనికిరాని అంశాలను తెరపైకి తెచ్చి ప్రతిసారి అటెన్షన్ డైవర్ట్ చేయాలని మీరు చేస్తున్న కుట్రలు తెలంగాణ సమాజానికి అర్థమైపోయాయన్నారు. మొదటి క్యాబినెట్ లోనే 6 గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని





నాడు పీసీసీ అధ్యక్షుడిగా మీరు హామీ ఇచ్చిన విషయాన్ని మీరు మరిచిపోయినట్టు నటించినా, ప్రజలకు మాత్రం అన్నీ గుర్తున్నాయనే విషయాన్ని స్పష్టంచేస్తున్నాను. నాటి గ్యారంటీ కార్డులే ఇవాళ బాకీ కార్డులై మీ పాపాలను ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తున్నాయి.. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద ఈ రెండేళ్లలో పెళ్లి చేసుకున్న ఆడిబిడ్డల తల్లులందరికీ తులం బంగారం బాకీ పడ్డారు. యువ వికాసం కింద రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు ఇవ్వనే లేదు. విద్యార్థినులకు స్కూటీలు రానేలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా వేల కోట్లు బాకీ పేరుకుపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడే ప్రమాదం పొంచి ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే 42 పేజీల అభయహస్తం మేనిఫెస్టోలోని 420 హామీల్లో 5 శాతం కూడా అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను దగా చేసిన ఘనచరిత్ర కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని మాట మార్చి ఐదేళ్లలో భర్తీ చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొనడం నిరుద్యోగ యువత గొంతుకోయడమే . అంతేకాదు నిరుద్యోగులకు ప్రతి నెలా రూ. 4 వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్న వాగ్దానాన్ని పూర్తిగా గంగలో కలిపి ఇప్పటివరకు నయా పైసా కూడా చెల్లించకుండా యువతను మోసగించారు. అభయహస్తంలో పొందుపరిచిన గ్యారెంటీలు, 420 హామీల అమలుకు ఎన్ని నిధులు అవసరమో ప్రకటించి బడ్జెట్‌లో ప్రతి పైసాకు లెక్క కట్టాలని తెలంగాణలోని సకల జనుల తరపున డిమాండ్ చేస్తున్నాను. అని లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు.

# అప్పుల లెక్కలోనూ బాబు అసత్యాల ప్రచారం

వేల కోట్లు అని చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉంటూ ఇలా తప్పుడు ప్రచారాలు చేయవచ్చా అని ప్రశ్నించారు. తాజాగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ సీఎం జగన్ మాట్లాడుతూ.. 50 ఏళ్లకే పెన్షన్ అని మరొక హామీ ఇచ్చారని.. రాష్ట్రంలో 50 నుంచి 59 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 20 లక్షల మంది ఉన్నారన్నారు.. ఈ మూడు బడ్జెట్లలో మూడు ప్రధాన హామీలకు అతీగతీ లేదన్నారు.. సూపర్ ఎ÷-లాప్ అయిన సినిమా చూపించి సూపర్ హిట్ అని ఎలా అంటారని ప్రశ్నించారు.. ప్రతీ నెల పబ్లిక్ మీటింగ్ పెట్టి ప్రతీ మీటింగ్‌కి 25 వేల పెన్షన్లు కట్ చేస్తున్నారు.. 2024 మార్చి నాటికి రాష్ట్రంలో పెన్షన్లు 66,34,372.. ఈనెల చంద్రబాబు ఇచ్చిన పెన్షన్లు 60, 96,108.. ఐదు లక్షలకు పైగా పెన్షన్లు కట్ చేశారు.. ఈనెల ఇచ్చిన మొత్తం 2,632 కోట్లు.. ఏడాదికి కావాల్సింది 31,584 కోట్లు.. ఈ ఏడాది బడ్జెట్ పెన్షన్ కోసం చేస్తున్న ఖర్చు 27, 719 కోట్లు.. ఈ డబ్బు మొత్తం 53, 50, 115 పెన్షన్లకు మాత్రమే సరిపోతుంది.. మరి మిగతావాళ్ళవి ఏం చేస్తారు.. దాదాపు ఏడు లక్షల పెన్షన్లకు కేటాయింపులు ఎలా చేస్తారు.. తల్లికి వందనం పేరిట మరో మోసం.. రాష్ట్రంలో జఆఎ÷ూఇ డేటా ప్రకారం మా హయాంలో బడికి పోయే పిల్లలు 87, 41,885 పిల్లలు.. ఒక్కొక్కరికీ 15 వేల చొప్పున ఇస్తే 13, 112 కోట్లు ఖర్చు అవుతుంది.. ఇప్పటివరకు ఇచ్చింది కేవలం 8,456 కోట్లు.. దాదాపు 20 లక్షల మంది పిల్లలకు ఎగగొట్టారు.. ఉచిత బస్సు పథకం ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడకు అయినా వెళ్లవచ్చు అని చెప్పారు.. ఏపీఎస్ఆర్టీసీలో 16 రకాల సర్వీసులు ఉంటే 5 సర్వీసులకు పరిమితం చేశారు.. ఉచిత గ్యాస్ అని మరో మోసం.. రాష్ట్రంలో మొత్తం గ్యాస్ కనెక్షన్స్ 1.59 కోట్లు.. ఒక్కొక్కరికి మూడు సిలిండర్లు ఇస్తామన్నారు.. ఏడాదికి మొత్తం నాలుగు వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా బడ్జెట్‌లో కేటాయించింది 2600 కోట్లు.. గ్యాస్‌లో కూడా బాకీ పెట్టారు.. వ్యవసాయ రంగానికి అన్నదాత సుఖీభవ అన్నారు.. మా హయాంలో చెప్పిన దాని కన్నా పెంచి ఇచ్చాం.. కేంద్రం ఇచ్చేది కాకుండా మేము 20 వేలు ఇస్తామని చెప్పారు.. 10,717 కోట్లు ఏడాదికి రైతులకు అన్నదాత సుఖీభవ పథకానికి ఇవ్వాలి.. మొత్తం రెండేళ్లకు ఒక్కొక్కరికీ 40 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 10 వేలు ఇచ్చారు.. చాలా మందికి పథకం ఎగరగొట్టారు.. వ్యవసాయ మంత్రి 6300 కోట్లు ఇచ్చామని అబద్దాలు చెప్తున్నారు.. 21 వేలు ఇవ్వాల్సి ఉంటే నాలుగు వేల కోట్లు ఇచ్చారు.. వరుసగా మూడవ బడ్జెట్ లో కూడా కౌలు రైతుకు సున్నా.. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక 17 సార్లు విపత్తులు సంభవించాయి.. చంద్రబాబు పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ పథకం అందుబాటులో లేకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.. వైసీపీ హయంలో క్రమం తప్పకుండా ప్రీమియం చెల్లించడం వల్ల 54.55 లక్షల మంది రైతులకు జరిగిన మేలు 7802 కోట్లు.. గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.. ఏ పంటకు ధర లేకపోయినా ప్రభుత్వం చేసింది శూన్యం.. మా హయంలో 3000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి తెచ్చాం.. ప్రతీ పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించాం..'అని మాజీ సీఎం జగన్ అన్నారు.

# రాష్ట్ర మంత్రుల అవినీతిపై ఆధారాలు సేకరిస్తున్నాం

బయటపెడతామని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా, అఖిల పక్ష సమావేశం లేకుండా, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఒవైసీ కళ్లల్లో ఆనందం చూసేందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీహెచ్ఎంసీని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్ గిరి కార్పొరేషన్లుగా ముక్కలు చేసిందన్నారు. అందులో హైదరాబాద్ జనాభా 7 లక్షలైతే అందులో 30 లక్షలకుపైగా జనాభా ముస్లింలే ఉన్నారని చెప్పారు. భాగ్యనగర్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నయాపైసా ఇవ్వలేదని, కనీసం తట్టెడు మొరం కూడా పోయలేదని అన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మూసీలో పడేయడం ఖాయమని అన్నారు.

గురువారం రోజున సాయంత్రం హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో కరీంనగర్ కార్పొరేషన్ లోని 10వ డివిజన్ కార్పొరేటర్ సొగాని కొమరయ్య బీజేపీలో చేరారు. కొమరయ్యకు కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే...

ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న 10వ డివిజన్ కార్పొరేటర్ కొమరయ్య బీజేపీలో చేరడం సంతోషంగా ఉంది.

కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ గెలవడంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు సహకారం మరువలేనిది. ప్రజలు ఆశీర్వదించి మెజారిటీ సీట్లు ఇస్తే... మేయర్ పదవి రాకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు చేసిన కుట్రలకు ధీటుగా చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు రామచంద్రరావు సలహాలు, సూచనలిచ్చారు.

బీఆర్ఎస్ అగ్రనాయకత్వం కాంగ్రెస్ తో కలిసి వెళ్లాలని, మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికే ఓటేయాలని చెప్పినా...ప్రజాతీర్పును గౌరవిస్తూ అగ్రనాయకత్వాన్ని ధిక్కరించిన బీఆర్ఎస్ కార్పొరేటర్లకు అభినందనలు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందా? లేదా? ఆ పార్టీ నేతలకు అర్థం కావడం లేదు. ఏ పార్టీ మద్దతు లేకుండా స్వయంగా మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను బీజేపీ కైవసం చేసుకుంది. ఇదే స్ఫూర్తితో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాషాయ జెండాను ఎగరేస్తాం. 70 లక్షల



జనాభాలో 30 లక్షలకుపైగా జనాభా ముస్లింలే ఉన్నారు. ఒవైసీ కళ్లల్లో ఆనందం కోసమే హైదరాబాద్ ను మూడు ముక్కలు చేశారు ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా, అఖిలపక్షం మీటింగ్ లేకుండా, ప్రజాప్రతినిధుల అభిప్రాయం లేకుండా ఏకపక్షంగా జీహెచ్ఎంసీని విభజించడం సిగ్గుచేటు. రేవంత్ రెడ్డి... జీహెచ్ఎంసీని మూడు ముక్కలు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలి.

జీహెచ్ఎంసీలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉంది. బీజేపీకి భయపడి హిందూ సమాజ ఓట్లను చీల్చడానికే జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేశారు. కోటిన్నర జనాభా, 40 వేల కోట్ల బడ్జెట్ కలిగిన ముంబై కార్పొరేషన్ ను విభజించలేదు. రెండు కోట్ల జనాభా కలిగిన ఢిల్లీని విభజించలేదు. చెన్నై కార్పొరేషన్ ను చీల్చలేదు... మరి జీహెచ్ఎంసీని ఎందుకు ముక్కలు చేశారు? మొద్దు శ్రీను బావ కళ్లలో ఆనందం చూసేందుకు హత్య చేసినట్లుగా... ఒవైసీ కళ్లల్లో ఆనందం చూడటం కోసం జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేశారు. రెండేళ్ల పాలనలో జీహెచ్ఎంసీ పరిధిలో తట్ట మొరం పోసిన దాఖలాల్లేవ్. భాగ్యనగర్ ప్రజలంతా తిరగబడే రోజులు రాబోతున్నయ్...

తెలంగాణ రైజింగ్ పేరుతో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు కదా?.... ఆ డబ్బులన్నీ ఎటుపోయాయి? ఎంత మందికి ఉద్యోగాలిచ్చారు? ఎన్ని యూనిట్లు ప్రారంభించారు? సమాధానం చెప్పాలి. దావోస్ కు రెండు సార్లు వెళ్లి రూ.2.15 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు.. ఇప్పటి వరకు ఎన్ని పెట్టుబడులు వచ్చాయి? ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయి?

టీపీసీసీ కాదు.... టీ4సీ... తెలంగాణ కరప్షన్, కమీషన్, కలెక్షన్, కాంగ్రెస్. భాగ్యనగర్ లో కాంగ్రెస్ ను మూసీ నదిలో పడేయడం ఖాయం. దిమ్మతిరిగే విధంగా కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పబోతున్నారు. భాగ్యనగర్ ప్రజలారా....ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను రెండేళ్లలో చేసిందేమిటో చెప్పాలని నిలదీయండి. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు మూటలు అప్పగించడానికే పరిమితమవుతున్నారే తప్ప తెలంగాణకు చేసిందేమిటో చెప్పాలి?. రిటైర్డ్ ఉద్యోగుల బెన్ ఫిట్స్ ఇవ్వకుండా వారి ఉసురు తీసుకుంటున్నరు. ఇదేమిటని ప్రశ్నిస్తున్న వృద్ధులను గుంజుకుపోయి జైల్లో వేయడానికి సిగ్గు లేదా?

రాష్ట్రంలో కొందరు మంత్రులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారు. వారి అవినీతిపై ఆరా తీస్తున్నాం. ఆధారాలను సేకరిస్తున్నాం. ఆయా మంత్రుల అవినీతికి కొందరు ఐఏఎస్ అధికారులే మధ్యవర్తులుగా ఉన్నారు. అతి త్వరలో మంత్రుల కమీషన్ల చిట్టా, ఐఏఎస్ అధికారుల దందాలన్నీ బయటపెడతాం. ఐఏఎస్ అధికారులారా....2047 వికసిత్ భారత్ లక్ష్యాలు నెరవేరేదాకా బీజేపీ ప్రభుత్వమే కొనసాగుతోంది. 2029 నాటికి దేశంలోని ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పాలన ఉండదు. మంత్రి పదవులను అడ్డుపెట్టుకుని బరితెగించి బీజేపీని అడ్డుకోవాలనుకుంటే... మీ సంగతి చూస్తాం. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నేతలను మంత్రులు ఇబ్బంది పెట్టారు. ఆయా మంత్రుల మెడలు వంచుతాం...6 గ్యారంటీలు అమలయ్యేలా చేస్తాం

భాగ్యనగర్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లు, సిద్దిపేట మున్సిపాలిటీ అభివృద్ధి కావాలంటే...మోదీ ప్రభుత్వ నిధులే శరణ్యం. రాబోయే ఎన్నికల్లో ఆయా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కాషాయ జెండాను ఎగరేయబోతున్నాం.

# తెలంగాణ ఇంటర్ హాల్ టిక్కెట్లు విడుదల

**హైదరాబాద్,ఫిబ్రవరి19( వెలుతురు):**

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హాల్ టికెట్ల ప్రక్రియ పూర్తయింది. మార్చిలో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల హాల్ టికెట్లను బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ తాజాగా విడుదల చేసింది. ఈ ఏడాది దాదాపు 9.9 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండటంతో, బోర్డు అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. షెడ్యూల్ ప్రకారం, ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. అయితే, విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయంతో పాటు, వారి సంబంధిత కళాశాల ప్రిన్సిపాళ్ల నుండి ధ్రువీకరించిన హాల్ టికెట్లను తీసుకోవాలని బోర్డు సూచించింది. విద్యార్థుల సౌకర్యార్థం వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే లింక్‌ను కూడా పంపుతున్నారు. ఈసారి సాంకేతికతను జోడిస్తూ బోర్డు కీలక మార్పులు చేసింది. విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను సులభంగా , ఖచ్చితంగా గుర్తించడానికి వీలుగా హాల్ టికెట్లపై కోడ్ ను ముద్రించారు. దీనిని స్కాన్ చేయడం ద్వారా సెంటర్ లొకేషన్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఒకవేళ హాల్ టికెట్‌లో పేరు, ఫోటో, సంతకం లేదా సబ్జెక్టులకు సంబంధించి ఏవైనా తప్పులు ఉంటే, వెంటనే కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా బోర్డు దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు హెచ్చరించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. హాల్ టికెట్లు అందిన వెంటనే అన్ని వివరాలు సరిచూసుకోవడం, పరీక్షా కేంద్రాన్ని ఒక రోజు ముందే సందర్శించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని బోర్డు అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు నుంచే ప్రారంభం కానున్న ఈ వార్షిక పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా వందలాది కేంద్రాలను సిద్ధం చేశారు.

# గద్దర్ జ్యూరీ కమిటీలో మార్పు

**- స్పెషల్ అవార్డ్స్' విభాగం జ్యూరీ చైర్మన్‌గా తమ్మారెడ్డి**




**హైదరాబాద్,ఫిబ్రవరి19 ( వెలుతురు):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సినిమా రంగానికి ఇచ్చే అత్యున్నత పురస్కారాలైన గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ క్రమంలో జ్యూరీ కమిటీలో కీలకమైన మార్పు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌లో భాగంగా ఇచ్చే 'స్పెషల్ అవార్డ్స్' విభాగం జ్యూరీ చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత, విశ్లేషకుడు తమ్మారెడ్డి భరద్వాజను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఈ బాధ్యతల్లో ఉన్న లెజెండరీ దర్శకుడు కె. రాఘవేంద్రరావు స్థానంలో ఇప్పుడు తమ్మారెడ్డి భరద్వాజ బాధ్యతలు స్వీకరించనున్నారు. చలనచిత్ర పరిశ్రమలో తమ్మారెడ్డికి ఉన్న సుదీర్ఘ అనుభవం, సామాజిక అంశాలపై ఆయనకున్న అవగాహనను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజా గాయకుడు గద్దర్ స్మారకార్థం తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డులను ప్రవేశపెట్టింది. గద్దర్ పేరుతో ఇస్తున్న ఈ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమలో నూతన ఉత్తేజాన్ని నింపనున్నాయి. ముఖ్యంగా తెలంగాణ సంస్కృతి, కళలను ప్రతిబింబించే చిత్రాలకు ఈ అవార్డులలో ప్రాధాన్యత దక్కే అవకాశం ఉంది. గతంలో ఉన్న నంది అవార్డుల స్థానంలో ఈ నూతన అవార్డులను ప్రతి ఏడాదీ అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. 2024 – 25 సంవత్సరంలో విడుదలైన సినిమాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

# ఏప్రిల్ నుంచి పలు రాష్ట్రాల్లో ఎన్నికల సవరణ

**- సర్ ప్రక్రియపై ఆయా రాష్ట్రాలకు ఇసి ఆదేశం**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి19( వెలుతురు):**

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు పలు రాష్ట్రాలప్రధాన ఎన్నికల అధికారులకు అత్యవసరంగా లేఖలు రాసింది. ఏప్రిల్ నుంచి ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ పక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదును అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మొత్తం 20కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ ఆదేశాలు జారీ చేసింది. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ / కాశ్మీర్, లడఖ్, కర్ణాటక, ఒడిశా, జార్ఖండ్, సిక్కిం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర, మహారాష్ట్ర, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ ఉన్నాయి. సర్ కార్యక్రమానికి సంబంధించి సన్నాహక పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఆయా రాష్ట్రాల అధికారులు చర్యలు చేపట్టాలని సూచించింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో అధికారులు వీలైనంత త్వరగా సన్నాహకాలను పూర్తి చేసి, ఏప్రిల్ 2026 నుంచి ప్రారంభమయ్యే ÷ూఎఖీని సజావుగా జరిగేలా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశం చేసింది.

# కృత్రిమ మేధ ఆవిష్కరణలకు వేదికగా తెలంగాణ

**- ఏఐ యూనివర్సిటీ, ఏఐ హబ్‌ల ఏర్పాటుకు బడ్జెట్ కేటాయింపులు**

**- ఇంపాక్ట్ సమ్మిట్ రౌండ్ టేబుల్ సమావేశంలో శ్రీధర్ బాబు**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి19 వెలుతురు:**

కృత్రిమ మేధకు సంబంధించిన నూతన ఆవిష్కరణల వేదికగా నిలుస్తున్న తెలంగాణా రాష్ట్రం అమెరికా పెట్టుబడిదారులకు అనేక అవకాశాలను కల్పిస్తోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రతిష్టాత్మక 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్–2026' లో భాగంగా దేశ రాజధానిలో అమెరికా– ఇండియా వాణిజ్య మండలి ప్రతినిధులతో జరిగిన రౌండ్ టేబుల్ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేసారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యున్నత టెక్నాలజీ ఎకోసిస్టం రాష్ట్రంలో



నూతన అవకాశాలను సృష్టించిందని శ్రీధర్ బాబు తెలిపారు. అమెరికా టెక్ దిగ్గజాలతో పబ్లిక్ ప్రేవేట్ భాగస్వామ్యాన్ని ఇప్పటికే తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ముందు చూపుతో కూడిన స్థిరమైన విధానాలు ఏఐ పరిశోధనలకు ఆలంబనగా మారాయని శ్రీధర్ బాబు వివరించారు. ప్రజా సేవలపై రియల్ టైం పర్యవేక్షణతో కృత్రిమ మేథ వినియోగాన్ని పెంచిన విషయాన్ని ఆయన వెల్లడించారు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, పట్టణాభివృద్ధి వంటి రంగాలపై దృష్టి సారించిన ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను ౦ఎ రంగంలో అగ్రగామిగా నిలబెట్టింది. కృత్రమ మేథ ఆవిష్కరణలకు ప్రపంచంలోనే ఒక ముఖ్య కేంద్రంగా నిలబడేలా తెలంగాణాను తీర్చుదిద్దుతున్నామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రధర్ బాబు వెల్లడించారు. వేగంగా దూసుకుపోతున్న టెక్నాలజి ప్రపంచంతో పోటీ పడాలన్నదే తమ సంకల్పం అని ఆయన అన్నారు. ఏఐ యూనివర్సిటీ, ఏఐ హబ్ ల ఏర్పాటు, ప్రతిభావంతులతో కూడిన స్కిల్ ఫోర్స్ ను అందుబాటులోకి తెచ్చేందుకు త్వరలో ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్ లో అత్యంత ప్రాధాన్యతనిస్తాం అని వెల్లడించారు.

# పంజాగుట్ట చట్నీస్ మెట్ల వ్యవహారం

**- హైడ్రా జోక్యంతో పరిష్కారం**

**హైదరాబాద్,ఫిబ్రవరి19( వెలుతురు):**

హైదరాబాద్‌లోని చట్నీస్ పంజాగుట్ట బ్రాంచ్‌లో దశాబ్ద కాలంగా నెలకొన్న వివాదానికి హైడ్రా అధికారులు తెరదించారు. చట్నీస్ హోటల్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా మూసివేసిన మెట్ల మార్గాన్ని హైడ్రా అధికారులు గురువారం తెరిపించారు. పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యపై హైడ్రా తీసుకున్న నిర్ణయం స్థానికంగా పెద్ద చర్చకు దారితీసింది. పంజాగుట్టలోని చట్నీస్ హోటల్ నిర్వాహకులు భవనంలోని పై అంతస్తులకు వెళ్లే మెట్ల మార్గాన్ని






నిబంధనలకు విరుద్ధంగా మూసివేసి అడ్డంకులు సృష్టించారని బాధితులు ఆరోపించారు. ముఖ్యంగా కరోనా లాక్‌డౌన్ సమయం నుంచి పైఅంతస్తుల్లోని ఇతర యజమానులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, పూర్తిగా తమ గుప్పిట్లోకి తీసుకున్నారని తెలిపారు. గత పదేళ్లుగా భవనంలోని ఇతర యజమానులు తమ వ్యాపారాలకు, రాకపోకలకు ఆటంకం కలుగుతోందని జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపారు. అయితే ఈ సమస్యపై బాధితులు ఇటీవల హైడ్రా అధికారులను ఆశ్రయించారు. ఫిర్యాదును స్వీకరించిన హైడ్రా బృందం ఇవాళ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, వెంటనే ఆ మెట్ల మార్గాన్ని తెరిపించారు. హైడ్రా రాకతో తమ సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయిందంటూ బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బాలిక అదృశ్యంలో ఘోరం

**- అత్యాచారానికి గురైన బాలిక**


**- గంజాయి సేవించి ముగ్గురు గ్యాంగ్ రేప్**

**హైదరాబాద్,ఫిబ్రవరి19( వెలుతురు):**

హైదరాబాద్ శివార్లలోని నార్సింగి ప్రాంతంలో అదృశ్యమైన మైనర్ బాలిక కేసు సంచలన మలుపు తిరిగింది. మూడు రోజుల క్రితం పుప్పాలగూడా పాషా కాలనీలోని తన ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. తమ కూతురు కనిపించడం లేదంటూ వారు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ప్రారంభించారు. దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో బాలిక అదృశ్యం వెనుక దారుణ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం.. సోహెల్ అనే యువకుడు బాలికను నమ్మించి తనతో పాటు బయటకు తీసుకెళ్లాడు. అనంతరం ఘట్‌కేసర్ సమీపంలోని రాంపూర్ ప్రాంతానికి తీసుకెళ్లి, తన స్నేహితులు అర్బాజ్, ఇమ్రాన్‌తో కలిసి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. నిందితులు గంజాయి సేవించిన అనంతరం బాలికపై ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. బాలికను మోసం చేసి తీసుకెళ్లి, పథకం ప్రకారం ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన వెలుగులోకి రావడంతో పోలీసులు వెంటనే చర్యలు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# సంపాదకీయం..

# దూసుకు వస్తున్న ఎఐ..అప్రమత్తతే ముఖ్యం !



ఎఐ దుష్ఫలితాలను చర్చించడం ద్వారా యువత భవిష్యత్ గురించి ఇప్పుడు ప్రపంచం ఆలోచించాలి. ఎఐతో పెనుముప్పు తప్పదని ప్రఖ్యాత కంపెనీలు, నిపుణులు హెచ్చరిస్తున్న వేళ దీనిపై ప్రధానంగా చర్చించాలి. ఎందుకంటే నిరుద్యోగాన్ఇన ఇది పెంచి పోషించడం ఖాయమని అంటున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా-ఎ.ఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' సందర్భంగా ప్రధానంగా దుష్ఫలితాలను చర్చించాలి. ఉద్యోగావకాశాలు పోతాయని అంటున్నప్పుడు దాని ప్రభావంతో జరిగే నష్టాన్ని చర్చించి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక స్థాయి వ్యవస్థను పూర్తి స్థాయిలో స్వదేశీ పునాదిమీద ఏర్పాటు చేసుకోవడం భవిష్యత్తులో అన్ని విధాల మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, ఎలాంటి ముప్పు ఏర్పడబోతుందో అన్నది ప్రధానంగా ఎఐ సమ్మిట్‌లో చర్చిస్తే మంచిది. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఆ దిశలో నిపుణులతో కమిటీ వేసి చర్చించి, ఉపద్రవానికి ముందే చర్యలకు పూనుకోవాలి. ఢిల్లీ వేదికగా అట్టహాసంగా నిర్వహిస్తున్న ఎఐ సదస్సులో ఈ మేరకు ప్రకటన రావాల్సి ఉంది. భారత్‌ను గ్లోబల్ సౌత్‌కు సాంకేతిక కేంద్రంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, ఆ దిశలో తీసుకుంటున్న చర్యలేంటన్నది చర్చకు రావాలి. అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించే సంగతి అలా ఉంచితే ప్రపంచ స్థాయికి సరితూగే లేదా దగ్గరగా ఉన్న పునాది స్థాయి వ్యవస్థ కూడా మన దగ్గర లేదు. ఈ రంగంలో ఇప్పటికే నాయకత్వం వహిస్తూ ప్రపంచానికి దిశా నిర్దేశర చేస్తున్న అమెరికా, చైనాలు పెద్ద ఎత్తున నైపుణ్యాలను, పరిశోధనలను విస్తృతం చేస్తుండగా, మనం ఏం చేయాలి, ఎలా చేయాలి అన్న దాని దగ్గరే ఉన్నాం. అనేకమంది మేధావులు మనచెంత ఉన్నారు. ఎఐ కి సంబంధించిన అనేక విషయాలను అంతర్జాతీయంగా గుర్తించిన నిపుణులు మనవాళ్లలో ఉన్నారు. ఫౌండేషన్ మోడల్ సంగతి అలా ఉంచితే, లార్జి మోడల్స్ ట్రైనింగ్‌కు అవసరమైన హైపర్ స్కేల్ డేటా సెంటర్లు కూడా అందుబాటులో లేవు. ఇవేవీ లేకుండా గ్లోబల్ లీడర్‌షిప్ గురించి, అప్పుడు వెల్లువెత్తే అవకాశాల గురించి మాట్లాడటం ఆకాశానికి నిచ్చెనలు వేయడమే అవుతుంది. సవాళ్లను గుర్తించి, అందుకు సమాధానాలను వెతుక్కునే సమయమిది. ఇంపాక్ట్ సమ్మిట్ కోసం నీతి ఆయోగ్ రూపొందించిన నివేదిక ప్రకారం ఎఐ రంగంలో మన దేశం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడానికి మరో పది నుండి ఇరవై ఏళ్లు పడుతుందని అంటున్నారు. 2047 నాటికి ఎఐ రంగంలో భారత్‌ను సూపర్ పవర్‌గా నిలపనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. 'కేవలం ఎఐ వినియోగదారునిగా కాకుండా ఎఐ సృష్టికర్తగా, ఎఐ విప్లవంలో భాగస్వామి దశ నుండి దానిని శాసించే స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దుతున్నాం' అని మోడీ అన్నారు. ఎఐ సదస్సులో ఇదే విషయం చెప్పారు. కొత్త సాంకేతికతను భారత్ ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటోంది. ప్రతిభావంతులకు స్వర్గధామంగా భారత్ ఉంది. ఏఐ కేంద్రంగా ఇండియా మారుతోంది. ఏఐ అనేది ఓ పరివర్తన శక్తి. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుంది. ఏఐ అనేది యువత, భారత్‌కు కొత్త విశ్వాసం, ఆస్తిగా ఉంది. తొలినాళ్లలో ఏఐపై అనేక సందేహాలు వచ్చాయి. కానీ ఇప్పుడు ఏఐని యువత ప్రయోజనకరంగా ఉపయోగిస్తోంది. వివిధ రంగాల సమస్యలకు ఏఐ పరిష్కారం చూపుతోందని మోదీ తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయో, ఏ కొత్త సాంకేతికత ఉనికిలోకి వస్తుందో తెలియదు! మరోవైపు ప్రపంచంలో ఎఐ అభివృద్ధి విస్ఫోటనం చెందుతోంది. శక్తివంతమైన నమూనాలకు శిక్షణ ఇచ్చే కంప్యూటింగ్ శరవేగంగా పెరుగుతోంది. ప్రత్యేకమైన చిప్‌ల తయారీ కోసం పెద్దఎత్తున పోటీ జరుగుతోంది, భారీ టెక్ సంస్థలు ఎఐలోకి పెద్ద మొత్తాలను కుమ్మరిస్తున్నాయి. 2024 నుండి అమెరికా, చైనాలు ఈ రంగంపై దృష్టి సారించి భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. మన దేశంలో ఈ రంగ అభివృద్ధి కోసం ఇప్పుడిప్పుడే పరిశోధనలు మొదలయ్యాయి. మరోవైపు ఎఐ వద్ధి పేరుతో వ్యక్తిగత గోప్యతకు ముప్పు తలెత్తే ప్రమాదం ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడనుంది. న్యాయవ్యవస్థలో కూడా ఎఐ వినియోగంపై జాగ్రత్త అవసరమని ఇటీవల సుప్రీంకోర్టు సూచించింది. ఆరోగ్య రంగంలోనూ ఇటువంటి ఆందోళనలే వ్యక్తమవుతున్నాయి. మీడియా, రాజకీయ రంగాల్లో డీప్‌ఫేక్‌ల భయాలు ఇప్పటికే ప్రారంభమైనాయి. పెద్ద టెక్ సంస్థల ఆధిపత్యం పెరిగితే డేటా, మౌలిక వసతులు వారి చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బలమైన పారదర్శక చట్టాలు, డేటా రక్షణ, నైతిక నియంత్రణ, సమగ్ర శిక్షణ విధానాలను రూపొందించాల్సి ఉంది. దేశంలో ఉన్న యువశక్తిని సమర్ధవంతంగా వినియోగిం చుకోవడంతో పాటు, డేటా సెంటర్లు, ఫౌండేషన్ మోడల్స్, చిప్ తయారీ వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఢిల్లీ ఎఐ సదస్సులో చోటుచేసుకున్న సాంకేతిక లోపాలతో పాటు, మేడ్ ఇన్ చైనా రోబోడాగ్‌ను తమ సొంత ఆవిష్కరణగా ప్రకటించుకుని నగుబాటైన గల్గోటియాస్ యూనివర్సిటీ నిర్వాకం అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలి. అన్నింటికి మించి నిరుద్యోగానికి సవాల్‌గా మారిన ఐఎని ఎలా అధిగమించాలన్న దానిపై ప్రయత్నాలు జరగాలి.

## దేవ్‌జీ లక్ష్యంగా కూంబింగ్

**- కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్**

**- ఐదురుగు మావోలు మృతి చెందినట్లు గుర్తింపు**



**రాయపూర్,ఫిబ్రవరి 19( వెలుతురు):**

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టు అగ్రనేత, ఆ పార్టీ కార్యదర్శి దేవ్ జీ లక్ష్యంగా కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. కర్రెగుట్టల్లో తలదాచుకున్న మావోయిస్టులు.. ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. వెంటనే భద్రతా బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఇరువైపులా నుంచీ హోరాహోరీగా కాల్పులు జరిగాయి. కొద్దిసేపటి తర్వాత మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు ఆగిపోయాయి. ఆ ప్రాంతంలో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు గుర్తించాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భద్రతా బలగాలు వెల్లడించాయి. మృతుల్లో అగ్రనేతలు ఉండవచ్చని భద్రతా దళాలు భావిస్తున్నాయి. మధ్యప్రదేశ్ నుంచి కర్రెగుట్టల్లోకి మావోలు ప్రవేశించారంటూ నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా బలగాలు.. ఈ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. మరోవైపు దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ గడువు మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆ లక్ష్యం దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతిచెందగా.. వేలాది మంది వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల ఎదుట లొంగిపోయారు. పలువురు మావోలను ప్రభుత్వం ఇప్పటికే అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తెలంగాణకు చెందిన 15మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. ఆ జాబితాలో రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, మావోయిస్టు కీలక నేత ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, ముప్పిడి సాంబయ్య, వార్త శేఖర్, జోడే రత్నభాయి, బడే చొక్కారావుల కోసం భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఇక ఈ రెండేళ్లలో 588 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

## వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతినేలా కథనాలు

**- సాక్షి మీడియాకు రఘురామరాజు లీగల్ నోటీసులు**



**అమరావతి,ఫిబ్రవరి 19(వెలుతురు):**

సాక్షి మీడియాకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు లీగల్ నోటీసులు జారీ చేశారు. తనకు వ్యతిరేకంగా కథనాలు రాయడంతోపాటు తన వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా కథనాలు ఉంటున్నాయంటూ నోటీసులు పంపారు. గురువారం ఇందిరా టెలివిజన్ ఎండీ వైఎస్ భారతి రెడ్డి, ఎడిటర్, బ్యూరో చీఫ్, బోర్డు డైరెక్టర్లతో సహా సాక్షి మీడియా ప్రతినిధులకు లీగల్ నోటీసులు పంపించారు. నోటీసులను న్యాయవాది ఉమేశ్ చంద్ర జారీ చేశారు. తనకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని నోటీసుల్లో రఘురామ డిమాండ్ చేశారు. లేని పక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా పరిహారంగా రూ.కోటి చెల్లించాలని, ఆ మొత్తాన్ని అమరావతి రైతులకు ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

## తిరుమల లడ్డూ కల్తీపై వైసిపి క్షమాపణలు చెప్పాలి

**- కల్తీ జరిగిందని నాటి చైర్మన్లు సైతం అంగీకరించారు**

**- మండలిని తప్పు పట్టించిన వైసిపి సభ్యులు**

**- మంత్రి అచ్చన్నాయుడు ఆగ్రహం**



**అమరావతి,ఫిబ్రవరి 19( వెలుతురు) :**

వైసిపి నేతలు క్షమాపణలు చెప్పిన తరవాతనే చర్చకు ప్రభుత్వం అంగీకరిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శాసనమండలిలో తిరుపతి లడ్డూలో కల్తీ జరుగలేదని వైసీపీ నాయకులు చెప్పింది అబద్ధమని మంత్రి ఆరోపించారు. కల్తీ నెయ్యి అంశంపై చర్చ జరపాలంటే ముందు వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందని మాజీ టీటీడీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి స్పష్టంగా చెప్పారని మంత్రి గుర్తు చేశారు. ఈ మేరకు వైసీపీపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ.. మూడు రోజుల నుంచి సంబంధం లేని విషయాలు తీసుకువచ్చి సభా సమయాన్ని వైసీపీ సభ్యులు వృధా చేస్తున్నారని మండిపడ్డారు. తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందని అన్ని నివేదికలు నిర్ధారించాయని, అందుకే కూటమి ప్రభుత్వం పాత టెండర్లను రద్దు చేసి కొత్త టెండర్లను పిలిచిందని మంత్రి వివరించారు. కొత్త టెండర్లలో కిలో నెయ్యి 650 రూపాయలకు ఇచ్చారని చెప్పారు. కిలో నెయ్యి 350 రూపాయలకు ఎక్కడ ఇచ్చారో వైసీపీ సభ్యులు చూపించాలని అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. హెరిటేజ్ డైరీ.. ఉన్నత ప్రమాణాలకు పెట్టింది పేరన్నారు మంత్రి. చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కుటుంబం సభ్యులకు అప్పగించారని తెలిపారు. ప్రభుత్వం నుంచి హెరిటేజ్‌తో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదని పాలసీ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి మీద చర్చకు అనుమతి ఇవ్వాలంటే, కల్తీ జరుగలేదని చెప్పిన వైసీపీ నాయకులు ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చీజ్ ప్యాకెట్ చూపించి నెయ్యి ప్యాకెట్ అని చెప్పడం దుర్మార్గమని మండిపడ్డారు. నెయ్యి కల్తీ కాలేదని చెబుతున్న వైసీపీ మాటలన్నీ కల్తీ మాటలే అని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు చేశారు.

## కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం కోసం రూ.139 కోట్లు

**- రూసా కింద రూ.55 కోట్లు ఇప్పటికే ఖర్చు చేశాం**

**- అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి లోకేశ్**

**అమరావతి,ఫిబ్రవరి 19( వెలుతురు):**

కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం కోసం రూ.139 కోట్ల నిధులు మంజూరు చేశామని... దాంట్లో రూసా కింద రూ.55 కోట్లు ఖర్చు చేశామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఏ కార్యక్రమం చేసినా క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ తీసుకుంటున్నామని తెలిపారు. ఏపీ అసెంబ్లీ బ్జడెట్ సమావేశాలు ఆరో రోజు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాలతో సభను మొదలుపెట్టారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు. కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయానికి సంబంధించి ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. కర్నూలు పార్లమెంట్ చుట్టు పక్కల ఎక్కువ పెట్టుబడులు వస్తున్నాయన్నారు. క్లస్టర్ యూనివర్సిటీల్లో ఫోకస్ స్జబెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. అందుకే స్పెషలైజేషన్‌లపైనా శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. బ్యాలెన్స్ పనులు వచ్చే అకాడమిక్ ఇయర్‌లో పెండింగ్ నిధులు మంజూరు చేస్తామని మంత్రి లోకేశ్ సభలో పేర్కొన్నారు.సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల వేతనాలను 50 శాతం పెంచే ఉద్దేశం ఉందా అని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు ప్రశ్నించారు. వీరంతా చాలా తక్కువ జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు.



వారి జీతభత్యాలు పెంచాలని, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పార్ధసారధి కస్తూరిబా బాలికా విద్యాలయాలపై మాట్లాడారు. కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో ఆడపిల్లలకు గొప్పగా విద్యనందిస్తున్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకని పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం 79 శాతం ఉత్తీర్ణత ఉన్న స్కూళ్లు త్వరలో 90 శాతం ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని కస్తూరిబా బాలికా విద్యాలయాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానం ఇచ్చారు. సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఎంత వేతనం చెల్లిస్తున్నారని మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఆంధప్రదేశ్‌లోనే ఎక్కువ జీతాలు ఇస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఈ పథకం కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉందని, ఈ అంశాలను కేంద్ర దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు మంత్రి లోకేశ్. త్వరలోనే వాటిని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. డీఎస్సీలో కర్నూలు జిల్లాకు అదనపు ఉపాధ్యాయులను శాంక్షన్ చేశామన్నారు. త్వరలోనే డీఎస్సీని జాబ్ క్యాలెండర్ కింద విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. గతంలో క్రైస్తవ ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయా అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అసెంబ్లీలో ప్రశ్న లేవనెత్తారు. గుంటూరులో క్రిస్టియన్ భవన్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని అడిగారు ఎమ్మెల్యే. దీనిపై మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ సమాధానం ఇస్తూ.. క్రైస్తవ ఆస్తుల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదని స్పష్టం చేశారు. జగన్ క్రిస్టియన్ కాదని అనుకుంటున్నానని... ఎందుకు ఐదేళ్ల పాటు ఆ క్రైస్తవ భవన్ పూర్తిచేయలేదని ప్రశ్నించారు. ఎందుకు ఆయన తనహయంలో నిధులు ఇవ్వలేదని అడిగారు. ఇప్పుడు కూటమి వచ్చింది కనుక త్వరలోనే పెండింగ్ పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తేస్తామని హామీ ఇచ్చారు. ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధం జరుగుతున్నందున జెరుసలేం యాత్రకు ఆస్కారం లేకుండా ఉందని మంత్రి ఎండీ ఫరూక్ పేర్కొన్నారు.

## కడియం శ్రీహరీ..నోరు అదుపులో పెట్టుకో

**కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకనంద**

**హైదరాబాద్,ఫిబ్రవరి19( వెలుతురు):**

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకనంద అన్నారు. కేసీఆర్ జాతిపిత ఎలా అవుతాడని కడియం చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కడియం శ్రీహరి తన హోదాకు మించి మాట్లాడుతున్నాడు. కడియం లాగ కేసీఆర్ ఎప్పుడూ ఆత్మగౌరవాన్ని తాకట్టు బెట్టుకొని, పదవుల కోసం పాకులాడి, బేరసారాలు చేయలేదన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, 13 సంవత్సరాలు నిరంతరం పోరాడాడని ఇదే కడియం శ్రీహరి అనలేదా అని సూటిగా ప్రశ్నించారు. ఈరోజు ఏ మొహం పెట్టుకొని ఈ వ్యాఖ్యలు చేస్తున్నాడు ఆయనకే తెలియాలన్నారు. రాజకీయ అవసరాల కోసం రంగులు మార్చిన నీ లాంటి వారు కేసీఆర్‌ను అనే అర్హతల లేదని విమర్శించారు. ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నాడో ఆయనకే స్పష్టత లేదని ఎద్దేవా చేశారు.



# టీఎన్జీవో భవన్ లో టీఎన్జీవో హైదరాబాద్ నగర శాఖ డైరీ , క్యాలెండర్ ఆవిష్కరణ



**బషీర్బాగ్ వెలుతురు 18 ఫిబ్రవరి :**
రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిన పెట్టడంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమైందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. ప్రభుత్వం అంటే ముఖ్యమంత్రి , మంత్రులు , ఎమ్మెల్యేలు మాత్రమే కాదని , ఉద్యోగులు కూడా అందులో భాగమే అని తెలిపారు. హైదరాబాద్ నాంపల్లి లోని టీఎన్జీవో భవన్ లో టీఎన్జీవో హైదరాబాద్ నగర శాఖ డైరీ , క్యాలెండర్ ను తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం , టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీష్ , కార్యదర్శి ముజీబ్ లతో కలిసి అద్దంకి దయాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారించేందుకు ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి చొరవ చూపుతున్నారని ఉద్యోగులకు హామీని ఇచ్చారు.

# ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి బీసీలకు క్షమాపణ చెప్పాలి

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 19:**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో కౌన్సిలర్ గా గెలిచిన బలహీన వర్గాలకు చెందిన ఆకుల యాదగిరి తనకు చైర్మన్ పదవి కావాలని అడిగితే టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆయన కుమారుడు మంచి రెడ్డి ప్రశాంత్ రెడ్డి ఏలనగా మాట్లాడుతూ నువ్వు బీసీవి నీకెందుకు ఇస్తాం చైర్మన్ పదవి అనడం వాళ్ళ యొక్క అగ్రకుల తత్వానికి నిదర్శనం అని వెంటనే బీసీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. జనరల్ స్థానాలు అంటే అగ్రకులాలకు ఏమైనా పేటెంట్ ఉందా అని ఈ సందర్భంగా లింగం గౌడ్ మంచిరెడ్డి కిషన్ రెడ్డిని ప్రశ్నించారు బీసీలు ఓట్లు వేయకుంటే నువ్వు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచే వాడివా బీసీల మీద నీకు ఎందుకు ఇంత అక్కస్సు బీసీల తోటే నీకు రాజకీయ భవిష్యత్తు ఉందని వెంటనే యావత్ బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో మీకు రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు

# గురుకుల విద్యార్థులకు అండగా భీమ్ ఆర్మీ

**- బీమ్ ఆర్మీ అధ్యక్షులు వడ్డేపల్లి నాగరాజు**



**నార్కట్ పల్లి వెలుతురు ఫిబ్రవరి 19:**
నల్గొండ పట్టణ కేంద్రంలో ఉన్న గంధవారి గూడెం SLBC, COE గురుకుల పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు JEE మెన్స్ పరీక్షలో ప్రతిభ చాటారు. చాడ సాహిత్య (85%), చెట్టుపల్లి సంగీ (84%), శ్రీ పెరంబుదురు కుసుమ (79%), తేజవత్ స్పందన (79%), ధారావత్ ఇందు (77%) ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు గౌరవం తెచ్చారు. తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్ గారి సూచన మేరకు భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ అధ్యక్షుడు వడ్డేపల్లి నాగరాజు మాట్లాడుతూ, డా. బీఆర్ అంబేద్కర్ ఆశయాల మేరకు పేద వర్గాలకు చెందిన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారికి నాణ్యమైన విద్య అందించడం తమ లక్ష్యమని తెలిపారు. అంబేద్కర్ గారు కలలు కన్న సమానత్వ సమాజ నిర్మాణంలో భీమ్ ఆర్మీ కీలకంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ లలిత కుమారి మాట్లాడుతూ, విద్యార్థుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని, చదువు ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన సాధనం అని విద్యార్థులకు తెలియజేస్తూ వారిని తమ సొంత పిల్లలుగా చూసుకుంటున్నామని అన్నారు. భవిష్యత్తులో ఈ పాఠశాలను జిల్లాలో ఆదర్శ పాఠశాలగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది నర్సిరెడ్డి, నీరజ, సైదులు, కృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలు

**- చిరుమర్తి యాదయ్య బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ సభ్యులు**

**నార్కట్ పల్లి వెలుతురు ఫిబ్రవరి 19:**
భారతదేశ చరిత్రలో అనగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహాయోధుడు చత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళు లు అర్పించారు. చిన్ననాటి నుంచే తన తల్లి జిజియాబాయి ప్రేరణతో ధైర్యసాహసాలు అలవరచుకుని, విలువిద్యలు నేర్చుకుని హిందూ సామ్రాజ్యాన్ని నిర్మించిన వీరుడిగా శివాజీ మహారాజ్ చరిత్రలో నిలిచారు. అన్ని మతాలను సమానంగా చూసిన శివాజీ మహారాజ్ దోపిడీ, వర్ణవ్యవస్థ, మనువాదానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడిగా గుర్తింపు పొందారు. మహారాష్ట్రలోని రాయగడలో శివాజీ సమాధిని 1874లో వెలికి తీసి జయంతి ఉత్సవాలను మహాత్మా జ్యోతిరావు పూలే ప్రారంభించినట్లు పేర్కొన్నారు. శూద్ర వర్గాల రాజుగా, అనగారిన వర్గాల ప్రతినిధిగా జ్యోతిరావు పూలే ఆయనను గుర్తించగా, ఆ ఆలోచనలను కొనసాగిస్తూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా బానిసత్వానికి, వర్ణవ్యవస్థకు, మనువాదానికి వ్యతిరేకంగా పోరాడిన మహానేత చత్రపతి శివాజీ మహారాజ్‌కు ఘన నివాళులు అర్పిద్దాం అని జిల్లా తెరాస నాయకులు చిరుమర్తి యాదయ్య పేర్కొన్నారు.

# బహుజన చక్రవర్తి ఛత్రపతి శివాజీ

**-సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి**

**-సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి**



**బషీర్ బాగ్ వెలుతురు 18 ఫిబ్రవరి :**
మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన ఛత్రపతి శివాజీ అంటే కేవలం ఒక మతం కాదని శివాజీ అంటే సామజిక విప్లవం అయన బహుజనుల చక్రవర్తి అని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ మరియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ 396వ జయంతి సందర్బంగా గురువారం నాడు రావి నారాయణ రెడ్డి కాలనీ ఫెజ్ 3లో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ మరియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి గార్లు ముఖ్య అతిధులుగా హరయ్యారు.శివాజీ చిత్రపటానికి పూల దండ వేసి నివాళ్లు అర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ.ఏ అసమాన కులవ్యవస్థలో బందీ అయిన ప్రజలను చేరదీసి ఓదార్పు కలిపించి జాతీయ భావనని కల్పించాడో ఏ బ్రాహ్మణ వర్గం ఈ దేశంలో సువిశాల భూభాగాన్ని జయించిన బహుజన చక్రవర్తిని సూద్రుడనే కారణంతో రాజు గా గుర్తించటానికి నిరాకరించి ఈసడించిందో నేడు అదే వర్గ భావాజాలం బహుజనులైన బీసీలకు కులవ్యవస్థ అమానుషాలని భరించలేక మతం మారిన తమ తోటి మూలవాసి సోదరులైన ముస్లింలపై ద్వేషం పెంచే విధంగా మరియు మతం మత్తులో తమ కళ్ళని తమ వేళ్ళతోనే పొడుచుకునే విధంగా అకారణంగా ముస్లిం వ్యతిరేక గళం విప్పే విధంగా మాయచేస్తూ ఈ దేశ అతి గొప్ప బహుజన మూలవాసి చక్రవర్తి అయినా ఛత్రపతి శివాజీ ని ముందు పెట్టడం ఈ దేశ బహుజనుల పాలిటి విషాధం అని అన్నారు. ఛత్రపతి శివాజీ ని కేవలం ఒక మతం చట్రంలో బంధించి,ఆయన విరాట్ స్వరూపాన్ని కుంచితం చేయాలని చూడటం ఆయనకు మతోన్మాదులు చేసే పెద్ద అవమానం!పట్టాభిషేకం సమయంలో కాళీ బొటన వేలుతో నుదిటిన తిలకం దిద్ది అవమానించిన బ్రాహ్మణ వర్గం ఆయనను 'శూద్రుడివి' అని కించపరిచిన అహంకారుల గర్వాన్ని అణిచి,సబ్బండ వర్గాలను ఏకం చేసి రాజ్యాధికారాన్ని సాధించిన బహుజన సార్వభౌముడు శివాజీ.తన ప్రాణరక్షణ బాధ్యతను మదారీ మెహతర్ (ముస్లిం)కు.. అత్యంత కీలకమైన గూఢచారి వ్యవస్థను దళితులకు,తన వీర సైన్యాన్ని పేద రైతు బిడ్డలకు.అప్పగించిన గొప్ప సామాజిక విప్లవకారుడు శివాజీ అన్నారు. ఆయన పోరాటం మతం మీద కాదు.అణచివేత మీద అని శివాజీ అంటే కాషాయం కాదని మతం కాదని శివాజీ అంటే సామాజిక న్యాయం,ఆత్మగౌరవం మరియు అజేయమైన ప్రజాస్వామ్య శక్తి అని కొనియాడారు.ఉన్మాదులు చరిత్ర తెలియక ఆయనను ముస్లిం మత వ్యతిరేకి అని మతాల మధ్య చిచ్చు పెట్టె కుట్రలని తిప్పి కొట్టాలని పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్,బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి,బిఒసి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్ సిపిఐ నాయకులు కాటి అరుణ,మధు,యేశాలి నర్సింహా,సైదులు ముదిరాజ్,నవనీత, పెరాల గోపి, యాదగిరి,రాఘవేంద్ర,సుధాకర్, దేవమ్మ, నిరంజన్,పాండు, వీణ,నీలా, కావేరి, మరియు తదితరులు పాల్గొన్నారు.

# జై భవాని వీర శివాజీ సేన ఆధ్వర్యంలో ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు





**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 19:**
తిమ్మాపూర్ మండల జై భవాని వీర శివాజీ సేన ఆధ్వర్యంలో గురువారం రోజున హిందూ హృదయ సామ్రాట్, భరతమాత ముద్దుబిడ్డ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిమ్మాపూర్ మండలం అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల జెండా గద్దె ప్రాంగణం వద్ద ఈ వేడుకలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శివాజీ సేన నేతలు మాట్లాడుతూ హైందవ ధర్మ స్థాపన కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసిన యోధుడు , హిందుత్వమే నినాదంగా , స్వధర్మమే ప్రధానంగా భారతజాతిలో స్వాభిమానాన్ని నింపిన వీరుడు , భవాని మాత ఆజ్ఞతో భారత జాతిని ముష్కరుల నుండి రక్షించిన ధీరుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని కొనియాడారు. చత్రపతి శివరాజ్ మహారాజ్ జయంతి సందర్భంగా హిందూ బంధువులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానంతరం తిమ్మాపూర్ మండల జై భవాని వీర శివాజీ సేన, ఫ్రీడమ్ ఫైటర్స్ స్ఫూర్తి స్థల్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా చిందం నరసయ్య, అధ్యక్షులుగా కొత్తూరి శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శిగా కన్నం సాయి కృష్ణ , ఉపాధ్యక్షులుగా కొట్టాల శ్రీనివాస్, కాదర్ల శ్రీనివాస్ , కురుక్కల స్వామి, కార్యదర్శులుగా చిందం అంజి, జంగపల్లి వినయ్, బుట్టి వెంకటేష్, ఎలుక మురళి , కోశాధికారిగా వంగల మధు , సంయుక్త కార్యదర్శులుగా వకులభరణం శ్రీధర్, దామోదరాచారి , దురిశెట్టి మురళి , నేదునూరప్రదీప్ , ప్రచార కార్యదర్శిగా గర్షకుర్తి ప్రదీప్ లతోపాటు ముఖ్య సలహాదారులుగా బొంతల కళ్యాణ్ చంద్ర , దురిశెట్టి సంపత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివాజీ సేన అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు కొత్తూరి శ్రీనివాస్, కన్నం సాయి కృష్ణలు మాట్లాడుతూ తిమ్మాపూర్ మండలంలోనే ప్రప్రదమంగా ఏర్పాటు చేసిన శివాజీ సేన లో బాధ్యతలు నిర్వర్తించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. శ్రీ వెంకటేశ్వర కాలనీలోని జెండా గద్దె వద్ద ఆకర్షణీయమైన చత్రపతి శివాజీ విగ్రహాన్ని వీలైనంత తొందరలో ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలు భావితరాలకు గుర్తుండిపోయేలా ఇక్కడి ప్రాంతంలో ఫ్రీడమ్ ఫైటర్స్ స్ఫూర్తి స్థల్ పేరిట మహనీయుల విగ్రహాలను ఇక్కడ ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర కాలనీ, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులు చిందం నరసయ్య , శివాజీ సేన బాధ్యులు కొత్తూరి శ్రీనివాస్ , కన్నం సాయి కృష్ణ , కొట్టాల శ్రీనివాస్, కాదర్ల శ్రీనివాస్ , కురుక్కల స్వామి, వంగల మధు , దామోదరాచారి , బూట్ల కర్ణాకర్, వెంకటరమణ బొంతల కళ్యాణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నూతన మహిళా సమాఖ్య భవనాలకు శంకుస్థాపన





**నార్కట్ పల్లి వెలుతురు ఫిబ్రవరి 19:**
నార్కెట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లంల, నార్కెట్‌పల్లి , నెమ్మాని, తిరుమలగిరి, తొండలవాయ్ గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న మహిళా సమాఖ్య సంఘం భవనాల నిర్మాణ పనులకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా తొండలవాయ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మహిళా సంఘాలకు సొంత భవనాలు నిర్మించడం ద్వారా వారి కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయని అన్నారు. గ్రామీణ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ గౌడ్ ఉపసర్పంచ్ సామ శిరీష ప్రవీణ్ రెడ్డి వార్డు సభ్యులు బాకరం జనార్దన్ మట్టిపల్లి శ్రీను మెడబోయిన మంగ మంద ఉమా గిరిప్రసాద్ ఎస్ కే జాన్ బీ జిల్లా మహేష్ మహిళా అధ్యక్షురాలు పర్వీన్ మరియు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య ఝబ సత్తయ్య పుల్లెంల అచ్చాలు పాశం శ్రీనివాస్ వడ్డేగొని నర్సింహ వేముల నర్సింహ గౌడ్ రాదరపు బిక్షం సామ కొండల్ రెడ్డి పుల్లెంల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# చిన్నారులకు ఆశీర్వాదం



**నార్కట్ పల్లి, వెలుతురు ఫిబ్రవరి 19:**
నార్కట్ పల్లి మండల కేంద్రంలోని చిన్న నారాయణపురం గ్రామానికి చెందిన వంగూరు రమేష్ కుమార్తె - కుమారుడు నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమానికి మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్ రెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూది రెడ్డి నరేందర్ రెడ్డి, చెరువుగట్టు మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, చిన్న నారాయణపురం మాజీ సర్పంచ్ కొత్తనరసింహ, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు జంగిలి మల్లికార్జున్, బొబ్బలి వెంకన్న, వంగూరు మహేష్, బొబ్బిలి శివ, గుండెబోయిన శివ, బొబ్బిలి శంకర్, ముత్యాల శివ, విగ్నేష్, చింటూ, అనిల్, రవి, యాదయ్య పాల్గొన్నారు.



# విజ్ఞాన్ గ్రూప్ అఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఐఏఎస్,ఐపీఎస్... ఫౌండేషన్ కార్యక్రమం ప్రారంభం

***విజయవంతం చేయాలని కోరిన చైర్మన్ డా.పగిడాల జలంధర్ రెడ్డి***

**భువనగిరి ఫిబ్రవరి 19(వెలుతురు):**
యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఈనెల 21 తేదీన శనివారం రోజున సాయి కన్వెన్షన్ హాల్లో ఐఏఎస్, ఐపీఎస్...ప్రోగ్రాం ప్రారంభం జరుగుతుందని దీనికి పలువురు ముఖ్య అతిథులుగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్,జిల్లా ఎస్పీ అక్షాంష్ యాదవ్ , అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు,జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహమ్మద్ అవెజ్ చిస్తి ,డీఈవో సత్యనారాయణ, స్వర్ణ గిరి ట్రస్ట్ చైర్మన్ రామారావు,ప్రధాన వక్తగా సుద్దాల అశోక్ తేజ, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేష్, విద్యార్థులు తల్లిదండ్రులు, అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగాచత్రపతి శివాజీ జయంతి వేడుకలు

## - విగ్ర ఆవిష్కరణలు వేడుకలో ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**గుండాల ఫిబ్రవరి 19(వెలుతురు):**
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగా గ్రామంలో గురువారం రోజున చత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొని ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించి హిందూ ధర్మాన్ని కాపాడి భారత జాతి ముద్దుబిడ్డగా జాతి గౌరవంతో పాటు పరమతస్తులను కూడా గౌరవించి పరిపాలన సాగించి నటువంటి వీర యోధుడు చత్రపతి శివాజీ అని అన్నారు1630 ఫిబ్రవరి 19 ఆయన పూణే జిల్లాలోని శివనేరి కోటలోని జన్మించి నారు అని అన్నారు. 396వ జయంతి సందర్భంగా మరిపడిగా గ్రామంలో విగ్రహావిష్కరణ చేయడం జరిగింది ఈ గ్రామంలో విగ్రహం ఆవిష్కరించుకోవడం గొప్ప శుభపరిణామం అని అన్నారు ఆయన స్ఫూర్తితో భావితరాలకు యువతకు ఒక స్ఫూర్తిదాయకంగా ఆదర్శంగా తీసుకొని ఈనాటి యువత ముందుకు సాగాలని అన్నారు భారతదేశంలో మొగలులను ఎదిరించి మరాఠీ సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప యోధుడు అని అన్నారు. ఆయన పరిపాలనాలో పరమతస్తులను గౌరవించి ఆయన సైన్యంలో అన్ని మతస్తులను కలుపుకొని పరిపాలన స్థాపించినటువంటి గొప్ప పోరాటయోధుడు అని అన్నారు. ఆయన స్ఫూర్తి ఆదర్శంగా తీసుకొని అన్ని కులాలు ఒకటే అని ఒక మంచి మనసుతో ఏ పని చేసిన అందరిని కలుపుకొని పోవాలనేదే ఒక సన్మార్గమైన ఆలోచన అని అన్నారు. ఈ ఆలోచనతో ముందుకు పోవాల్సిన అవసరం యువతకు అవసరమని అన్నారు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కూడా చత్రపతి శివాజీ సామ్రాజ్యంలో పరిపాలనను ఆదర్శంగా గుర్తించి రాజ్యాంగంలో పొందుపరిచారని గుర్తు చేశారు మరిపడిగా గ్రామంలో ఉన్న యూత్ ఐక్యతను గుర్తించి ఈ గ్రామాన్ని నియోజకవర్గంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి సరి అయిన నిధులు సమకూర్చుతానని ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూడెపు కుమార్.ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసరుపు యాదగిరి గౌడ్.



యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి . ఉప సర్పంచ్ చొప్పరి సోమయ్య విగ్రహ దాత బండారి సుభాష్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చత్రపతి శివాజీ మహారాజ్ కమిటీ అధ్యక్షులు సభ్యులు గ్రామ వార్డు సభ్యులు ఆయా గ్రామాల సర్పంచులు గ్రామ యువత మహిళలు పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది

# బీబీనగర్ ఎయిమ్స్ లో ఇన్స్టిట్యూట్ బాడీ సమావేశంలో పాల్గొన్న బోర్డు మెంబెర్ ఎంపీ చామల



**బీబీనగర్, ఫిబ్రవరి 19(వెలుతురు):**
గురువారం రోజున ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ , బీబీనగర్ 6వ ఇన్‌స్టిట్యూట్ బాడీ సమావేశంలో ఎయిమ్స్ బోర్డు మెంబెర్ భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు . ఈ సమావేశంలో గవర్నింగ్ బాడీ, స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ, స్టాండింగ్ అకడమిక్ కమిటీ, స్టాండింగ్ సెలెక్షన్ కమిటీ, స్టాండింగ్ ఎస్టేట్ కమిటీ మరియు హ్యూమన్ రిసోర్స్ సబ్ కమిటీ ఏర్పాటు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశం ఇన్‌స్టిట్యూట్ బాడీ అధ్యక్షులు చంద్రశేఖర్ మహాదేర మేశ్రం అధ్యక్షతన జరిగింది. రాజ్యసభ సభ్యులు కే లక్ష్మణ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమితా అగగర్వాల్ సభ్యులు త్రితంకర్ దేబ్ పోస్టుగ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ లో ఇంటర్నల్ మెడిసిన్ విభాగాధిపతి సంజయ్ జైన్ , అలాగే కేమ్ హాస్పిటల్ & రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ జ. వా. యజనిక్ పాల్గొన్నారు. ఈ కమిటీల ఏర్పాటు ద్వారా సంస్థ పరిపాలన బలోపేతం కావడం, ఆర్థిక పారదర్శకత పెరగడం, విద్యా ప్రమాణాలు మెరుగుపడడం, నియామక ప్రక్రియ సక్రమీకరణ మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు తెలంగాణలో అత్యున్నత వైద్య సేవలు, విద్య మరియు పరిశోధన రంగాలలో ఎయిమ్స్ బిబినగర్ మరింత పురోగమించేందుకు ఈ చర్యలు కీలకంగా నిలుస్తాయని తెలిపారు .

# ఎమ్మెల్యేను కలిసిన ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 19:**
రామన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శ్వేత ప్రియాంక, గురువారం డిసిహెచ్ఎస్ చిన్నా నాయక్ తో కలిసి మర్యాదపూర్వకంగా నకిరేకల్ ఎమ్మెల్యే, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వేముల వీరేశం ను నకిరేకల్ లోని ఆయన నివాస గృహంలో కలిశారు. పూల బొక్కెను అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఆసుపత్రి కి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మార్చ్ 2వ తేదీన అభివృద్ధి సలహా కమిటీ సమావేశం నిర్వహించి సమస్యల పై చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుందామని తెలిపారు.

# మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ గా బీసీ మహిళకు అవకాశం కల్పించినందుకు హర్షం

## - మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గారిని కలిసి కృతజ్ఞతలు తెలియజేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్



**మిర్యాలగూడ వెలుతురు ఫిబ్రవరి 19:**
ఉమ్మడి నల్గొండ జిల్లాలో మున్సిపల్ చైర్మన్ లుగా బీసీలకు 50 శాతం అవకాశం దక్కడం బీసీల సుధీర్ఘ పోరాట విజయమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు.మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ గా బీసీ మహిళకు అవకాశం కల్పించినందుకు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గారిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలో 17 మున్సిపల్ చైర్మన్ లకు గాను బీసీలకు కాంగ్రెస్ పార్టీ 50 శాతం మున్సిపల్ చైర్మన్ లుగా అవకాశం కల్పించిందని గతంలో ఎన్నడూ లేని బీసీలు పెద్ద ఎత్తున విజయం సాధించారని అన్నారు.మేము ఎవరికీ వ్యతిరేకం కాదని మాకు రావలసిన వాటా కోసం మాత్రమే మేము ఉద్యమిస్తున్నామని అన్నారు. త్వరలో జరగబోయే ఎంపీటీసీ జడ్పీటిసి ఎన్నికల్లో కూడా బీసీలకు జనరల్ స్థానాల్లో అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారిని కోరారు ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య దోనేటి శేఖర్ గుండు నరేందర్ శ్రీరాములు తదితరులు ఉన్నారు

# కోమ్మాయిగూడెం గ్రామంలో శ్రీ శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు.

- ప్రైమరీ స్కూల్లో, హైస్కూల్లో పండ్లు పంపిణీ
- అధ్యక్షుడు చీమలపాటి జగదీష్



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 19:**



కొమ్మాయిగూడెం గ్రామంలో శ్రీ శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆరే కులస్తుల సంఘం అధ్యక్షుడు చీమలపాటి జగదీష్ మాట్లాడుతూ శివాజీ యొక్క గొప్పతనాన్ని కొనియాడినాడు. శివాజీ 375 యుద్ధాలు చేసి విజయ్ దంక మోగించిన చరిత్ర చత్రపతి శివాజీ ఓటమి ఎరగని వీరుడు, మహా యోధుడు. తన జీవితాంతం ప్రజా శ్రేయస్సుకు ఎన్నో గొప్ప నిర్ణయాలు తీసుకున్నాడు. మరాఠీ స్థాపకుల్లో చత్రపతి శివాజీ అగ్ర గన్యుడు. శత్రువుల భార్య కూడా కన్న తల్లి లా చత్రపతి శివాజీ చూసుకునేవాడు. శివాజీని కీర్తించినాడు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చీమలపాటి జగదీష్ ఉపాధ్యక్షుడు కోణాల మధు కార్యదర్శి మోటే నరేష్ సహాయ కార్యదర్శి సాపిడి రామకృష్ణ గడ్డే రమేష్, కోశాధికారి మోటే నవీన్, గౌరవ అధ్యక్షులు మోటే మారయ్య మోటి రాజు. తదితరులు పాల్గొన్నారు

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా సామూహిక శ్రీమంతాలు





**గుండాల, ఫిబ్రవరి 19 (వెలుతురు):**
గుండాల మండలంలోని వడ్డెర కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో సామూహిక శ్రీమంతాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భవతుల ఆరోగ్య పరిరక్షణ, శిశువుల సక్రమ పెరుగుదల లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ దేవనబోయిన ఐలయ్య మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు వంటి సౌకర్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం ద్వారా తల్లి-శిశువుల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. గర్భధారణ సమయంలో జాగ్రత్తలు పాటించడం, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామ ఉప సర్పంచ్ ఆవుల సాయిప్రసాద్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అంగన్వాడీ సిబ్బంది సూచనలు పాటించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ షమీం, ఏఎన్ఎం స్వర్ణలత, ఆశా కార్యకర్త సుజాత, అంగన్వాడీ టీచర్ కె. సునీత తదితరులు పాల్గొని గర్భవతులకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డ్ సభ్యులు, గర్భవతులు, బాలింతలు మరియు గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బాల్య వివాహాలను అరికట్టాలి

## - అదనపు కలెక్టర్ భాస్కరరావు



**భువనగిరి ఫిబ్రవరి 19 (వెలుతురు):**
జిల్లా లో బాల్య వివాహము ను నిరోధించానికి బాల్య వివాహ విముక్తి ప్రచార రథం ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# రామన్నపేటలో ఘనంగా శివాజీ శోభాయాత్ర శంకుస్థాపన కార్యక్రమం

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 19:**
మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మల్లికార్జున బిన్నీ రైస్ మిల్ నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు పాదయాత్రగా ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో వివిధ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని జీజాబాయి వేషధారణలతో అందరినీ అబ్బురపరిచారు.ఈ ర్యాలీ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.అనంతరం శివాజీ మహారాజ్ విగ్రహ స్థాపనకు సంబంధించినటువంటి కార్యక్రమాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద భూమి పూజతో కార్యక్రమం నిర్వహించారు.తదుపరి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు కొరకై కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఈ కమిటీలో గౌరవ అధ్యక్షులుగా సర్పంచ్ గరిక సత్యనారాయణ,లీగల్ అడ్వైజర్లు గా జినుకుల ప్రభాకర్, కాంపాటి యాదగిరి,బాసిరాజు అశోక్ గౌరవ సలహాదారులుగా ప్రముఖ గ్రామ పెద్దలను ఎన్నుకోగా,అధ్యక్షుడుగా చొల్లేటి శివ కిరణ్, ఉపాధ్యక్షులుగా



బాసాని రాజు, వావిళ్ళ సంతోష్,దావనూరు అజయ్,ప్రధాన కార్యదర్శిగా ఏనూతుల సురేష్,కల్లూరి నరేష్, బట్టె సంతోష్,కార్యదర్శులుగా దావనూరు శివ,గొరిగే నరేష్,దొంత నాగరాజు,పిట్టల మహేష్, నామనంది వినయ్,గండికోట రాకేష్,కోశాధికారులుగా కైరంకొండ సంతోష్ కుమార్,అలిసేరి వంశీ, ఉప కోశాధికారులుగా సాల్వేర్ ప్రవీణ్, చెరుకు ఉపేందర్, ట్రెజరీ రికార్డర్ గా అలిసేరి కళ్యాణ్,సోషల్ మీడియా సభ్యులుగా వర్గాల నితిన్,కామిశెట్టి వికాస్,గాదె నరేష్ లను ఎన్నుకోవడం జరిగింది.

# భువనగిరి పట్టణ సీ.ఐ ని మర్యాదపూర్వకంగా కలిసిన 30వ వార్డు కౌన్సిలర్ ఎండీ. లయిక్ అహ్మద్.



**భువనగిరి ఫిబ్రవరి 19 (వెలుతురు):**
భువనగిరి పట్టణ సీ.ఐ రమేష్ సార్ గారిని 30 వ వార్డు కౌన్సిలర్ ఎండీ.లయిక్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. వారు కౌన్సిలర్ గా గెలుపొందిన తర్వాత సి.ఐ గారిని కలవడం జరిగింది.ఈ సందర్భంగా పట్టాల సి.ఐ గారు భారీ మెజార్టీతో గెలుపొందినందుకు లయిక్ గారికి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.వార్డులో సీ.సీ కెమెరాలు ఏర్పాటుకు ప్రయత్నం చేయాలని వారు తెలపడం జరిగింది.

# ఆరోగ్య లక్ష్మి పథకంను గర్భిణీలు, బాలింతలు ఉపయోగించుకోవాలి

## -మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న.

**మోత్కూర్, ఫిబ్రవరి 19, (వెలుతురు న్యూస్ ):**



మోత్కూర్ మున్సిపాలిటీ అంగన్వాడి సెంటర్ ఒకటిలో ఆరోగ్యలక్ష్మి పథకం కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో 1వ వార్డు కౌన్సిలర్ & వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గారిని కమిటీ అధ్యక్షుడిగా నియమించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ శ్రీమతి గడ్డం స్వప్న గారు హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో కమిటీ సభ్యులు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గారు, 9వ వార్డు కౌన్సిలర్ బీసు శ్రీకాంత్ గారు మరియు 11వ వార్డు కౌన్సిలర్ కరుపోతు వెంకన్న గారు పాల్గొన్నారు. ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం, ఆరోగ్య సేవలు అందేలా కమిటీ పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించబడతాయని నిర్వాహకులు తెలిపారు.

# తాజ్ పూర్ లో యాక్టివ్ కేస్ ఫైండింగ్స్ ఏసీఎఫ్ ప్రత్యేక హెల్త్ క్యాంప్

**భువనగిరి రూరల్ ఫిబ్రవరి 19(వెలుతురు):**




యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా చేపడుతున్న యాక్టివ్ కేస్ ఫైండింగ్స్ కార్యక్రమం కింద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇటీవల డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ గారు తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ లో ఈ హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా నోడల్ అధికారి డీటీసీఓ డాక్టర్ వంశీకృష్ణ హాజరై గ్రామ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. క్యాంప్‌లో భాగంగా గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్యంగా క్షయ, జ్వరాలు, రక్తపోటు, షుగర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందించడమే ఈ ఏసీఎఫ్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో ఆరోగ్య శిబిరం నిర్వహించిన వైద్య బృందానికి మరియు సహకరించిన గ్రామ పంచాయతీ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ హిందూ డిగ్రీ కళాశాలలో చత్రపతి శివాజీ చిత్రపటానికి ఘన నివాళులు




**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 19:**

చత్రపతి శివాజీ మహారాజ్ 396 జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం స్థానిక శ్రీ హిందూ డిగ్రీ కళాశాలలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పనకంటి భాస్కరరావు మాట్లాడుతూ ధర్మ పరిరక్షణలో చత్రపతి శివాజీ పాత్ర అమోఘమైనది ఆయన అన్నారు. ఆయన జీవిత కాలంలో, మొఘల్ సామ్రాజ్యం, గోల్కొండ సుల్తానేట్, బీజాపూర్ సుల్తానేట్, అలాగే యూరోపియన్ వలస శక్తులతో పొత్తులు, శత్రుత్వాలలో విజయం పొందాడన్నారు. అతని సైనిక దళాలు మరాఠా గోళాన్ని విస్తరించి, కోటలను అన్నిటినీ స్వాధీనం చేసుకున్నాయన్నారు. నావికాదళాన్ని ఏర్పాటు చేశారని, చక్కటి నిర్మాణాత్మక పరిపాలనా సంస్థలతో సమర్థ, ప్రగతిశీల పౌర పాలనను సాగించారన్నారు. ఆయన ప్రాచీన హిందూ రాజకీయ సంప్రదాయాలను, న్యాయస్థాన సమావేశాలను పునరుద్ధరించారని ఆయన తెలిపారు. కోర్టు నిర్వహణలలో పెర్షియన్ భాష కాకుండా మరాఠీ, సంస్కృతం వాడకాన్ని ప్రోత్సహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బండారు శ్రీదేవి, సతీష్ కుమార్, వెంకటరమణారెడ్డి, లింగస్వామి, సునీల్, కళ్యాణి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

**నేను, కె. ఆనంద్ గౌడ్, తండ్రి: కె. నర్సింహ గౌడ్, నివాసం: సుభాష్ నగర్ కాలనీ, కల్వకుర్తి పట్టణం. సుమారు ఒక నెల క్రితం నేను ఆర్.టి.సి. బస్సులో కల్వకుర్తి నుండి హైదరాబాద్ వెళ్తుండగా, నా సర్టిఫికేట్లు ఉన్న ఫైల్ కవర్ ఎక్కడో పడిపోయినది.**

**పోయిన సర్టిఫికేట్ల వివరాలు:**

**SSC ఒరిజినల్ మెమో:**
(నెంబర్: 083987), గవర్నమెంట్ హై స్కూల్, కల్వకుర్తి.

**ఇంటర్మీడియట్ మెమో:**
(2005-07 బ్యాచ్), గవర్నమెంట్ జూనియర్ కళాశాల, కల్వకుర్తి.



వీటిని ఎవరైనా కనుగొంటే దయచేసి క్రింది చిరునా మాకు పంపగలరు లేదా ఫోన్ నెంబర్‌కు సమాచారం అందించగలరు. ఇప్పటికే దీనిపై కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగినది.

**చిరునామా:**
**కె. ఆనంద్ గౌడ్,**
**సుభాష్ నగర్ కాలనీ, కల్వకుర్తి,**
**నాగర్‌కర్నూల్ జిల్లా.**
**ఫోన్ నెంబర్: 9000002639**

# శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న సర్పంచ్ గర్దాస్ విక్రమ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 19:ం**

అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన శివాజీ జయంతోస్తవ కార్యక్రమం లోముఖ్య అతిథి గాపాల్గొన్న సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ఉత్సవ కమిటీ సభ్యులు శివాజీ మహారాజ్ శాశ్వత విగ్రహం ఏర్పాటు చేస్తనంటే తన వంతు సహాయంగా 20116/-రూపాయలు విరాళం ఇస్తానని ప్రకటించారు. యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్10116/-రూపాయలు నాగు మహేష్ 10016/-రూపాయలు విరాళంఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ నల్ల జయసుధ స్వామి,బీజేపీ గ్రామ శాక అధ్యక్షులు రాజన్న రమేష్, ఈర్లపల్లి మల్లేశం, బాజ నరేందర్ ఉత్సవ కమిటీ సభ్యులుబీజేపీ కిసాన్ మోర్చా నాయకులు కొడారి వెంకటేష్ యాదవ్ ప్రతిసంవత్సరం శివాజీ జయంతి ఏర్పాట్లు సొంత ఖర్చులు తో చేస్తున్నారు , బోనగిరి మధు, గర్ధాస్ శ్రీకాంత్ , వెలిమినేటి నరేష్, కేస సందీప్, కేస ప్రవీణ్, పబ్బు మచ్చి, బొల్ల మచ్చి, బొల్ల నర్సింహా, బీజేపీ నాయకులు పగుడాల రామచంద్రం, నీలశ్రీరాములు,ఏర్వ సాయి,గర్ధాస్ మహేష్,మల్లం రమేష్, ఎర్రం ఇలాజి తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ పండగ ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్‌కు వినతి

## - ఎమ్మెల్యే మాణిక్ రావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నూతన కౌన్సిలర్ల చర్యలు...

**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 19:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో రంజాన్ పండగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని కోరుతూ బీఆర్ఎస్ నూతన మున్సిపల్ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాణిక్ రావు ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు. రంజాన్ నెలలో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ప్రార్థనల్లో పాల్గొంటారని, అందువల్ల పట్టణంలోని అన్ని మసీదులు, ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేకంగా పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా స్ట్రీట్ లైట్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని, దెబ్బతిన్న రహదారులను వెంటనే మరమ్మతు చేయాలని, ప్రతి రోజు త్రాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకంగా పండగ రోజు ఈద్గా వద్ద భారీ సంఖ్యలో ప్రజలు చేరుకునే నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, తాత్కాలిక



వైద్య శిబిరం మరియు త్రాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ స్వప్నప్రవీణ్ కుమార్, 5వ వార్డు కౌన్సిలర్ ప్రేమలత శంకర్ రెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్ పాండు ముదిరాజ్, 11వ వార్డు కౌన్సిలర్ గౌసుద్దీన్ గోరి, 12వ వార్డు కౌన్సిలర్ తంజీమ్, 20వ వార్డు కౌన్సిలర్ విజయ రాజు, 24వ వార్డు కౌన్సిలర్ పర్వీన్ జహాన్ యాకూబ్, 31వ వార్డు కౌన్సిలర్ జహీద్, 32వ వార్డు కౌన్సిలర్ సుజిత విశ్వేశ్వర్, 35వ వార్డు కౌన్సిలర్ పర్వీన్ బేగం అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. మైనారిటీ నాయకులు హంజా కూడా హాజరయ్యారు. పట్టణ ప్రజల సౌకర్యాల దృష్ట్యా తగిన ఏర్పాట్లు వెంటనే చేపడతామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్లు తెలిపారు.

# జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రద్దు చేయాలి

## - రాష్ట్ర ఎన్నికల కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు కౌన్సిలర్ స్రవంతి రవి కిరణ్ రాతపూర్వక ఫిర్యాదు...






**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 19:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో తీవ్రమైన అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ వార్డు నంబర్ 27 కౌన్సిలర్ స్రవంతి రవి కిరణ్ ఎన్నికను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ ఎన్నిక ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం, స్థానిక ఎమ్మెల్యే మాణిక్ రావు ఆదేశాల మేరకు ఆమె గురువారం తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ కమిషనర్ రాణి కుముదిని, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్యలను కలిసి రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు. ఎన్నికల ప్రక్రియలో జరిగిన అక్రమాలను వివరించి, తక్షణ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. స్రవంతి మాట్లాడుతూ, తెలంగాణ మున్సిపాలిటీ ఎన్నికల నిబంధనలు (2020) ప్రకారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సమయంలో కౌన్సిలర్ల పేర్లను ఖచ్చితంగా అక్షర క్రమంలో పిలవాలని స్పష్టం చేశారు. అక్షర క్రమం ప్రకారం తన పేరు మొదట రావాల్సి ఉండగా, రిటర్నింగ్ అధికారి నిబంధనలను ఉల్లంఘించి తమకు అనుకూలంగా పేర్లను పిలిచారని ఆరోపించారు. తెలంగాణ మున్సిపాలిటీ చట్టం2019లోని సెక్షన్ 14(3), రూల్ 4 నిబంధనలను రిటర్నింగ్ అధికారి ఉల్లంఘించారని, దీంతో ఎన్నికల ప్రక్రియ మొత్తం చట్టవిరుద్ధంగా మారిందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికార పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ఎన్నికల అధికారులు వ్యవహరించారని, పారదర్శకతకు విఘాతం కలిగిందని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికైన మొహమ్మద్ యూనస్ ఎన్నికను తక్షణమే చెల్లనిదిగా ప్రకటించి, పారదర్శక పద్ధతిలో మళ్లీ ఎన్నిక నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడే వరకు తన పోరాటం కొనసాగుతుందని, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరపాలని స్రవంతి విజ్ఞప్తి చేశారు.

# జహీరాబాద్‌లో బస్సు డ్రైవర్లకు వేతనాలు ఇవ్వని స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

## - సీఐటీయూ ఆధ్వర్యంలో ఏఎల్ఓకు వినతి...

## - రెండు రోజుల్లో పరిష్కారం హామీ...

**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 19:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని రావూస్ స్కూల్ యాజమాన్యం బస్సు డ్రైవర్లకు నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా వేధింపులకు గురిచేస్తోందని, వేతనాలు అడిగిన డ్రైవర్లను అక్రమంగా తొలగించిందని ఆరోపిస్తూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సెంటర్ అఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈరోజు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (ఏఎల్ఓ) కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మహిపాల్ మాట్లాడుతూ, డ్రైవర్లకు రావలసిన వేతనాలు చెల్లించకుండా కాలయాపన చేయడం, "రేపు ఇవ్వగలం" అంటూ తప్పించుకోవడం యాజమాన్యం అలవాటుగా మార్చుకుందని విమర్శించారు. వేతనాలు అడగడానికి వెళ్లిన కార్మికులను దబాయిస్తూ,



బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇది కార్మిక హక్కుల ఉల్లంఘన అని, వెంటనే బకాయి వేతనాలు చెల్లించి, అక్రమంగా తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ చట్టాల ప్రకారం కార్మికులకు సమయానికి వేతనాలు చెల్లించడం యాజమాన్యం బాధ్యత అని పేర్కొంటూ, సంబంధిత అధికారుల ద్వారా సమగ్ర విచారణ జరిపి, తప్పు చేసిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఏఎల్ఓ ప్రతినిధులతో ఫోన్‌లో సంప్రదించగా, రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. రెండు రోజులు వేచి చూసి, పరిష్కారం రాకపోతే తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి ధనరాజ్, సిఐటియు నాయకులు రవి, డ్రైవర్ రాము తదితరులు పాల్గొన్నారు..

# దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో ఎసిబి సోదాలు

## - రికార్డులు, లావాదేవీలపై అధికారుల తనిఖీలు

**మేడ్చల్,ఫిబ్రవరి19( వెలుతురు):**


మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లాలోని దుండిగల్‌లోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. పరిపాలనా రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, హాజరు రిజిస్టర్లు, పెండింగ్ దరఖాస్తుల వ్యవహారంపై విచారణ చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం మొత్తం పనితీరుపై ఆడిట్, టెక్నికల్ విభాగంతో సహా సంబంధిత విభాగాలు సహాయం తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో మున్సిపల్ కార్యాలయంలో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లపై లంచాల ఆరోపణలు వెల్లువెత్తాయి. టౌన్ ఎ÷-లానింగ్ సూపర్‌వైజర్ లంచం తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వాట్సాప్ చాట్‌లో ఈ వ్యవహారం బయటపడింది. సూపర్‌వైజర్ భర్త కంపెనీకి అనధికారికంగా నిధులు మళ్లించినట్లు గుర్తించారు. సోదాలు జరిగే సమయంలో ఒక అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, ఐదుగురు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది గైర్హాజరైనట్లు తెలిపారు. ÷ూఈం÷ూ ద్వారా పారిశుధ్య కార్మికుల హాజరు రికార్డులను తారుమారు చేసినట్లు గుర్తించారు. 49 భవనాల నిర్మాణాలకు కావాల్సిన



అనుమతి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 21 రోజుల పరిమితికి మించి 12 ఉన్నాయని ఏసీబీ అధికారులు తెలిపారు. అలాగే, 32 అనధికార నిర్మాణ కేసుల్లో 28 కేసుల్లో రెండవ నోటీసులు జారీ చేయకపోవడం, ఉ?5 అనధికార భవనాలకు ఉ?3 అనుమతిని అక్రమంగా మంజూరు చేసినట్లు గుర్తించారు. అధికారులపై వచ్చిన ఆరోపణలతో వారి ఖాతాల బ్యాంక్ స్టేట్‌మెంట్లను ఏసీబీ అధికారులు పరిశీలించనున్నారు. ఈ సోదాల్లో కార్యాలయ రికార్డులు, రిజిస్టర్లు, ÷ల్ నోట్స్, డిజిటల్ డేటా స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై అవసరమైన చర్యలకు సిఫార్సు చేస్తూ తెలంగాణ ప్రభుత్వానికి ఏసీబీ అధికారులు నివేదిక ఇవ్వనున్నారు.

# జోగిపేట బస్టాండ్‌లో భారీ చోరీ

- బస్సు ఎక్కుతున్న మహిళ బ్యాగులో బంగారం చోరీ
- ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు



**సంగారెడ్డి, ఫిబ్రవరి19( వెలుతురు):** సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టపగలే భారీ చోరీ జరిగింది. ఓ శుభకార్యానికి వెళ్తున్న వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకున్న దుండగులు.. ఆమె బ్యాగులోని 16 తులాల బంగారాన్ని అత్యంత చాకచక్యంగా అపహరించారు. అల్లాదుర్గానికి చెందిన చెగురి లక్ష్మి అనే వృద్ధురాలు.. హైదరాబాద్‌లోని తన మేనకోడలి కుమారుడి వివాహానికి హాజరయ్యేందుకు బయలుదేరింది. క్రమంలో అల్లాదుర్గం నుంచి జోగిపేట బస్టాండ్‌కు చేరుకున్న ఆమె.. అక్కడ దిగి, తన బంధువుతో కలిసి హైదరాబాద్ వెళ్లే మరో బస్సు ఎక్కేందుకు సిద్ధమైంది. అయితే బస్సు ఎక్కుతున్న సమయంలో ప్రయాణికుల రద్దీని అదునుగా చేసుకున్న గుర్తు తెలియని దుండగుడు.. ఆమె వద్ద ఉన్న బ్యాగు నుంచి 16 తులాల బంగారు ఆభరణాలను దొంగిలించి పరారయ్యాడు. ఈ భారీ చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బంగారం పోయిందని గుర్తించిన బాధితురాలు.. కన్నీరుమున్నీరుగా విలపిస్తూ జోగిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బస్టాండ్ ఆవరణ, పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అనుమానిత వ్యక్తుల కదలికల ఆధారంగా నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. బస్టాండ్‌లు, రద్దీ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా విలువైన వస్తువులు తీసుకెళ్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిందితుడిని త్వరగా గుర్తించి బంగారాన్ని స్వాధీనం చేసుకుంటామని పోలీసులు తెలిపారు.

# తిరుమల శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల, ఫిబ్రవరి19( వెలుతురు):** తిరుమలలో మళ్లీ పరిస్థితులు బాగానే ఉన్నాయని,చంద్రబాబు సీఎంగా ఉంటే తిరుమల) బాగుంటుందని నటుడు చరణ్‌రాజ్ పేర్కొన్నారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావడం సంతోషకరమన్నారు. గురువారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో చరణ్‌రాజ్ శ్రీవారిని దర్శించుకున్నారు. డ్రమ్స్ వాయిద్యకారుడు శివమణి, నిర్మాత లోహిత్, నటి రమ్య శ్రీ, తెలంగాణ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# కొత్తగా ఏడు సంస్థలకు భూ కేటాయింపులు

- మంత్రి నారాయణ వెల్లడి



**అమరావతి, ఫిబ్రవరి19( వెలుతురు):** అమరావతిలో కొత్తగా 7 సంస్థలకు భూ కేటాయింపులు చేశామని ఏపీ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. 11 సంస్థలకు గతంలో చేసిన కేటాయింపుల్లో మార్పులు చేశామని పేర్కొన్నారు. బ్యాంక్ ఉద్యోగుల నివాసాల కోసం భూ కేటాయింపులు చేశామని చెప్పుకొచ్చారు. ఏపీ మంత్రి నారాయణ నేతృత్వంలో సీఆర్డీఏ పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా భూ సమస్యల పరిశీలన, రాజధానిలో పలు సంస్థలకు భూ కేటాయింపులు, కొత్తగా వచ్చే సంస్థలకు భూ కేటాయింపులు, ప్రపంచ స్థాయి సంస్థలను అమరావతికి తీసుకురావడం తదితర అంశాలపై చర్చించారు. సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. రెయిన్ బో చిల్డ్రన్ హాస్పిటల్‌కు రెండు ఎకరాలు కేటాయించామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేశ్, గుమ్మిడి సంధ్యారాణి హాజరయ్యారు.

# ఆళ్లకు ఎసిబి కోర్టు నోటీసులు

**విజయవాడ, ఫిబ్రవరి19( వెలుతురు):** ఇన్నర్ రింగ్ రోడ్డు అక్రమాల కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి ఏసీబీ కోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో నిందితులుగా.. అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ తదితరులు ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసు మూసివేస్తున్నట్లు ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ విచారణలో భాగంగా.. కేసులో ఫిర్యాదుదారుగా ఆళ్ల రామకృష్ణారెడ్డి ఉన్నారు. ఈ కేసులో ఆయనకి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలపాలని నోటీసుల్లో ఏసీబీ కోర్టు తెలిపింది.

# విశాఖలో చిన్నారిపై లైంగిక దాడి


- ఘటనపై ఆరా తీసిన మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్

**విశాఖపట్నం, ఫిబ్రవరి19( వెలుతురు):** విశాఖపట్నంలో జరిగిన ఓ దారుణ ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్ల వయసున్న పసికందుపై జరిగిన లైంగిక దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలు నాగరిక సమాజానికి మచ్చ అని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే రాయపాటి శైలజ విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కేసు దర్యాప్తు పురోగతిని, నిందితుల వివరాలను రాయపాటి శైలజ అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఆమె ఆరా తీశారు. చిన్నారికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కేసులో నిందితులకు చట్టప్రకారం అత్యంత కఠిన శిక్షపడేలా.. మహిళా కమిషన్ పక్షాన పర్యవేక్షిస్తామని రాయపాటి శైలజ స్పష్టం చేశారు.

# ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

- స్వరాజ్య స్ఫూర్తితో మార్మోగిన జహీరాబాద్...
- భారీ శోభాయాత్రలు, సేవా కార్యక్రమాలు...

**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 19:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పురపాలక సంఘ పరిధిలో ఆర్యనగర్‌లోని శివాజీ విగ్రహం వద్ద గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకుని శివాజీ విగ్రహానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులు అర్పించారు. “జై శివాజీడ జై భవానిడ” నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ స్వరాజ్య సాధనలో చూపిన ధైర్యం, దూరదృష్టి, పరిపాలనా నైపుణ్యం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. యువత శివాజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని నైతిక విలువలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక సభలు ఏర్పాటు చేసి శివాజీ జీవిత చరిత్ర, ఆయన స్వరాజ్య స్థాపనకు చేసిన



కృషి, గెరిల్లా యుద్ధ తంత్రంపై ఉపన్యాసాలు నిర్వహించారు. విద్యార్థులు శివాజీ వేషధారణలో ఆకట్టుకుని సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. దేశభక్తి గీతాలు, నృత్యాలు, నాటికలు ప్రేక్షకులను అలరించాయి. పలు సామాజిక, యువజన సంఘాలు రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి సేవా స్ఫూర్తిని చాటాయి. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి అభిమానులు భారీగా తరలివచ్చి శోభాయాత్రలో పాల్గొన్నారు. సంప్రదాయ వాద్యాలతో, ఝూన్సీలు, బ్యానర్లు, జెండాలతో నిర్వహించిన ర్యాలీ పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్న వయసులోనే స్వరాజ్య స్థాపనకు ప్రతిజ్ఞ చేసిన శివాజీ, మొఘల్ మరియు ఆదిల్‌షాహీ సామ్రాజ్యాలను ధైర్యంగా ఎదుర్కొని స్వతంత్ర హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించిన మహానేతగా చరిత్రలో నిలిచారు. పరిమిత వనరులతో గెరిల్లా యుద్ధ తంత్రాన్ని వినియోగించి అనేక విజయాలు సాధించారు. తీరప్రాంత రక్షణ కోసం నౌకాదళాన్ని ఏర్పాటు చేసి భారత నౌకాదళ పితామహుడిగా ఖ్యాతి పొందారు. జయంతి వేడుకల సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి కార్యక్రమాలు శాంతియుతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. మొత్తంగా శివాజీ జయంతి వేడుకలు స్వరాజ్య స్ఫూర్తిని గుర్తు చేస్తూ జహీరాబాద్ పట్టణంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించాయి.

# ఉప్పాడతీర ప్రాంత అభివృద్ధి లక్ష్యం

- అన్నిశాఖల సమన్వయంతో ప్రణాళికలు
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**అమరావతి, ఫిబ్రవరి19( వెలుతురు):** ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకార సోదరుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా సమగ్ర ప్రణాళికను రూపొందించినట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ ప్రణాళికలకు రూపొందించినట్లు చెప్పారు. ‘గతేడాది అక్టోబర్ 9వ తేదీన కాకినాడ కలెక్టరేట్‌లో మత్స్యకారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు అన్వేషించాం. తీర కాలుష్య నివారణ, కోత నివారణ, మత్స్య సంపద వృద్ధి, అధునాతన పద్ధతుల్లో వేట, మార్కెటింగ్ సదుపాయాలు,



ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ, ఇలా మత్స్యకారుల జీవితాలకు భద్రత, భరోసా కల్పించేందుకు అవసరమైన ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ ప్రణాళికలో పొందుపర్చాం. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చడంతోపాటు వ్యవసాయ అభివృద్ధి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన తదితర అంశాలను కూడా పరిగణలోకి తీసుకున్నాం అని ఆయన అన్నారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, మెరైన్ ఫిషరీస్ నిపుణులు, జిల్లా అధికారుల సహకారంతో రూపొందించిన ఈ ప్రణాళికను త్వరలో పిఠాపురం పర్యటనలో ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిర్దిష్ట లక్ష్యంతో రూపొందించిన ప్రణాళిక – ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని పవన్ అన్నారు.

# హెరిటేజ్‌ను బద్నాం చేయడమే జగన్ పని

- పదేపదే అబద్ధాలు చెప్పడం జగన్‌కు అలవాటు
- జగన్‌కున్న రోగాన్ని గూగుల్ కూడా చెప్పలేకపోతోంది
- మీడియా సమావేశంలో హోంమంత్రి అనిత విమర్శలు

**అమరావతి, ఫిబ్రవరి19( వెలుతురు):** హెరిటేజ్ క్లీన్ చిట్‌లో ఉన్న సంస్థ అని, ఆ సంస్థలో ఏదో జరిగిపోతోందని ప్రజలను జగన్ తప్పుదోవ పట్టిస్తున్నారని హోం మంత్రి అనిత అన్నారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. చెప్పిన అబద్ధాన్ని పదే పదే మూడు గంటలపాటు చెప్పినందుకు జగన్‌కు గిన్నిస్ రికార్డు ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. హెరిటేజ్ సంస్థపై బురద చల్లడమే పనిగా కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోయారని అన్నారు. ఇందాపూర్ డెయిరీ నుంచి హెరిటేజ్ సంస్థ కొన్ని ఉత్పత్తులు కొనుగోలు చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. హెరిటేజ్ ఇప్పటి వరకు ఏ సంస్థకు నెయ్యి సరఫరా చేయలేదని స్పష్టం చేశారు.జగన్‌తో సహవాసం చేసే సరికి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు నెయ్యికి, చీజ్‌కు తేడా తెలియకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ‘ హెరిటేజ్‌పై జగన్ చెప్పింది అవాస్తవమని



ఆయనకూ తెలుసు. మేం నిజాలు చెప్పినా జగన్‌కు అర్థం కాదు. అందుకే ప్రజల ముందు అన్ని విషయాలు బయటపెడుతున్నాం. 3 గంటల ప్రెస్‌మీట్ పెట్టి కల్తీ జరిగిందని చెప్పిన వ్యక్తి.. బాబాయ్ హత్యపై ఎందుకు నోరెత్తలేదు. నెయ్యి కల్తీపై చర్చకు సిద్ధమని ఎందుకు చెప్పలేకపోతున్నారు. ఈ వ్యవహారంపై మాట్లాడలేకే.. సంబంధం లేని హెరిటేజ్ అంశాన్ని తీసుకొచ్చారు. వీక్షకుల దృష్టిని ఆకర్షించేందుకే జగన్ మాట్లాడుతారు తప్ప.. ఆయన దగ్గర ఏ ఆధారాలూ ఉండవని, ఆయన చెప్పేది వాస్తవం కాదని వెల్లడించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఉన్న రోగం ఏంటో గూగుల్ కూడా చెప్పలేకపోతోందని హోంమంత్రి అనిత వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వైఎస్ జగన్ ఒరిజినల్ హ్యాబిట్యుయల్ క్రిమినల్ అని అన్నారు. చెప్పిన అబద్ధాన్ని పదే పదే 3 గంటలు ప్రెస్ మీట్‌లో చెప్పినందుకు గిన్నిస్ రికార్డు కూడా ఇవ్వొచ్చంటూ ఎద్దేవా చేశారు. హెరిటేజ్ ఇప్పటి వరకు ఏ సంస్థకూ నెయ్యి సరఫరా చేయలేదు. జగన్‌తో సావాసం చేసేసరికి బొత్సకు.. నెయ్యికి, చీజ్‌కు తేడా తెలీకుండా పోయింది. హెరిటేజ్‌పై జగన్ చెప్పింది అవాస్తవాలని బొత్సకు తెలుసు. మేం నిజాలు చెప్పినా జగన్‌కు అర్థం కాదు. అందుకే ప్రజల ముందు అన్ని విషయాలూ బయటపెడుతున్నాం అన్నారు. కల్తీపై చర్చకు సిద్ధమని జగన్ ఎందుకు చెప్పలేకపోతున్నాడు. లడ్డూ కల్తీపై మాట్లాడలేకే సంబంధం లేని హెరిటేజ్ అంశాన్ని తెచ్చాడు. కల్తీ లడ్డూ పైనా.. హెరిటేజ్ నిరాధార ఆరోపణలపైనా అసెంబ్లీలో చర్చించటానికి మేం సిద్ధం. వైసీపీ తాలూకు ఛైర్మన్ కౌన్సిల్‌లో ఉండి, చర్చకు అవకాశం ఇవ్వట్లేదని జగన్ అనటం హాస్యాస్పదం. వ్యూవర్‌షిప్ అటెన్షన్ కోసం జగన్ మాట్లాడతారే తప్ప.. ఆయన దగ్గర ఏ ఆధారాలు ఉండవు. చెప్పేది వాస్తవం కాదు’ అని అన్నారు.

# అర్థం కానీ పవన్ వ్యూహం


**కాకినాడ, ఫిబ్రవరి19( వెలుతురు):** జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చి తన గ్రాఫ్ తగ్గించుకుంటున్నట్లే కనపడుతుంది. ప్రశ్నించాలని రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఆయన ప్రశ్నించడమే మానేశారని సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం జగన్ ఓటమి కోసమే పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారా? లేక ఆయన ముఖ్యమంత్రి కావడానికి వచ్చారా? అని జనసైనికులే ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ పవన్ కల్యాణ్ పై ఇంతకు ముందు ఫైర్ కనిపించడం లేదని పోస్టు చేస్తున్న వీడియోలు ఇందుకు నిదర్శనం. పార్టీ నేతల నుంచి అభిమానుల వరకూ పవన్ కల్యాణ్ వ్యూహం ఎవరికీ అర్థం కాకుండా ఉంది. మరొకవైపు జగన్ ను ఓడించాలంటే మనం సీట్లు త్యాగం చేయాల్సిందేనని ఇప్పటి నుంచే చెబుతున్న హితోక్తులు కూడా వారిని కలవరపెడుతున్నాయి.జగన్ ను ఓడించడానికి అయితే రాజకీయాల్లోకి రావడం ఎందుకన్న ప్రశ్న కాపు సామాజికవర్గం నుంచి వస్తుంది. తొలిసారి కాపు సామాజికవర్గం నుంచి ఒక వ్యక్తి ముఖ్యమంత్రి అయితే చూడాలనుకున్నామని, కానీ పవన్ కల్యాణ్ మాటలను చూస్తుంటే ఆయన ఎప్పటికీ సీఎం పదవి కోరుకోవడం లేదని అర్థమవుతుందన్న అభిప్రాయం ఎక్కువ మందిలో వినిపిస్తుంది. మరొకవైపు కాపు సామాజికవర్గం సమస్యలపై కూడా ఆయన మాట్లాడకపోవడాన్ని వారు తప్పుపడుతున్నారు. కాపు రిజ్వేషన్లు అమలు చేయించడం, కాపు కార్పొరేషన్ కు నిధులు కేటాయించి పేదలైన కాపు కుటుంబాలను ఆదుకునే పనికి కూడా పవన్ కల్యాణ్ చేపట్టడం లేదన్న విమర్శలున్నాయిఈ నేపథ్యంలో క్రమేపీ పవన్ కల్యాణ్ గ్రాఫ్ ఇటు కాపు సామాజికవర్గంలోనూ అటు పార్టీ క్యాడర్ లోనూ పోతుంది. మరొకవైపు ఆయన సినీ అభిమానులు మాత్రం చెక్కు చెదరకుండా ఉన్నారు. నియోజకవర్గాల్లో తమకు విలువ లేకుండా చేస్తున్నారని చెప్పినా పవన్ వినిపించుకోవడం లేదని, తాము తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని జనసేన ద్వితీయ శ్రేణి నేతలు కూడా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జనసేనలో చాలా మంది సైలెంట్ అయ్యారు. పవన్ కల్యాణ్ వ్యూహం తమకు అర్థమయిందని, కేవలం జగన్ ఓడించడానికి మాత్రమే రాజకీయాల్లోకి వచ్చారని, తాను ముఖ్యమంత్రి కావడానికి రాలేదన్నది స్పష్టంగా కనిపిస్తుందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. కానీ పవన్ కల్యాణ్ ను అభిమానించే వారు మాత్రం ఆయన ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశ్యంతోనే అనుభజ్ఞుడైన చంద్రబాబుకు మద్దతిస్తున్నారని, అందుకే తగ్గుతున్నారని అంటున్నారు.



# టీవీ సౌండ్ తగ్గించమన్న భర్త ను హత్య చేసిన భార్య

**గుంటూరు, ఫిబ్రవరి19( వెలుతురు):** గుంటూరు జిల్లాలో గురువారం రాత్రి దారుణం చోటుచేసుకుంది. టీవీ సౌండ్ తగ్గించమని అడిగిన భర్తను.. భార్య దారుణంగా హత్య చేసింది. గుంటూరు జిల్లాలోని మంగళగిరి టిడ్కో ఇళ్ల సముదాయంలో ఈ దారుణ ఘటన జరిగింది. టీవీ సౌండ్ తగ్గించమని భర్త మహమ్మద్.. భార్య క్రాంతిని కోరాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఘర్షణ తారస్థాయికి చేరడంతో మహమ్మద్‌ను క్రాంతి కత్తితో పొడిచి చంపేసింది. మహమ్మద్, క్రాంతి ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకోవడం గమనార్హం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

# రెండు సీట్లు.. ఇరవై మంది ఆశావహులు





**హైదరాబాద్, ఫిబ్రవరి19( వెలుతురు):**
తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. ప్రస్తుత సభ్యులు అభిషేక్ మను సింఘ్వీ , కె.ఆర్. సురేష్ రెడ్డి ల పదవీకాలం ఏప్రిల్ 9తో ముగియనుంది. వీరిలో సింఘ్వీ కాంగ్రెస్ నుంచి.. సురేష్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి ఎంపికయ్యారు. మార్చి 16న జరగనున్న ఈ ఎన్నికల్లో శాసనసభలో ఉన్న బలాబలాల ప్రకారం ఈ రెండు స్థానాలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. పార్టీల బలాబలాల విశ్లేషణను పరిశీలిస్తే, 119 స్థానాలున్న తెలంగాణ అసెంబ్లీలో ఒక రాజ్యసభ సీటు గెలవడానికి సుమారు 40 మొదటి ప్రాధాన్యతా ఓట్లు అవసరం. కాంగ్రెస్ పార్టీకి సొంతంగా 65 మంది ఎమ్మెల్యేలు ఉండటమే కాకుండా, ఇతర పార్టీల నుండి చేరిన ఎమ్మెల్యేల మద్దతుతో రెండు స్థానాలను సులువుగా గెలుచుకునే అవకాశం ఉంది. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ తన వద్ద ఉన్న సంఖ్యాబలం సరిపోకపోవడంతో ఈసారి తన స్థానాన్ని కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. బీజేపీ, మజ్లిస్ ఎవరికీ మద్దతుగా ఓట్లేసే అవకాశం లేదు. మజ్లిస్ ఒక వేళ ఓటింగ్ లో పాల్గొంటే కాంగ్రెస్‌కు సహకరిస్తుంది. అందుకే రెండు సీట్లు కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్తాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.అందుకే కాంగ్రెస్‌లో అభ్యర్తులు ఎక్కువగా పోటీ పడుతున్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి రెన్యువల్ దాదాపు ఖాయమని తెలుస్తోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ గళాన్ని వినిపించడంలో, పార్టీకి సంబంధించిన న్యాయపరమైన అంశాలను డీల్ చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఉప ఎన్నిక ద్వారా ఆయన తెలంగాణ నుంచి ఎంపికయ్యారు, ఇప్పుడు పూర్తి కాలానికి గాను ఆయనను హైకమాండ్ మళ్ళీ బరిలోకి దింపే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం.ఇక రెండో స్థానం కోసం తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. అలాగే మాజీ మంత్రి, సీనియర్ నేత టి. జీవన్ రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, మాజీ విసి సుదర్శన్ రెడ్డి, పార్టీలో సీనియర్ అయిన వి. హనుమంతరావు, ఇటీవల బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కె. కేశవరావు వంటి హేమాహేమీలు ఈ రేసులో ఉన్నారు. సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని అధిష్టానం ఎవరిని వరిస్తుందో చూడాలి.ఈ ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 26న నోటిఫికేషన్‌తో ప్రారంభమై మార్చి 16న పోలింగ్, అదే రోజు కౌంటింగ్‌తో ముగియనుంది. సింఘ్వీ అభ్యర్థిత్వం దాదాపు ఖరారు కావడంతో, మిగిలిన ఒక్క సీటు కోసం పైరవీలు ఢిల్లీ స్థాయికి చేరుకున్నాయి. పార్టీ విధేయులకే ప్రాధాన్యత ఉంటుందని అధిష్టానం సంకేతాలు ఇస్తున్న సమయంలో , ఈ రెండో బెర్త్ ఎవరికి దక్కుతుందనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

# రేవంత్ వన్ మ్యాన్ షో

**హైదరాబాద్,, ఫిబ్రవరి19( వెలుతురు):**
తెలంగాణలో ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికలు రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఒక యాసిడ్ టెస్ట్‌గా నిలిచాయి. ప్రభుత్వ వ్యతిరేకత పేరుతో జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టి.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 80 శాతానికి పైగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయడం రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహ చతురతకు నిదర్శనంగా మారింది. ముఖ్యంగా పట్టణ ఓటర్లు కూడా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం, గతంలో కేవలం గ్రామీణ పార్టీగా ఉన్న ముద్రను రేవంత్ చెరిపివేయగలిగారు. ఈ విజయంతో ఆయన హైకమాండ్ వద్ద తన పరపతిని అమాంతం పెంచుకున్నారు.ఢిల్లీ వేదికగా రేవంత్ రెడ్డి చేసిన నేనే రాజు.. నేనే మంత్రి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. అయితే, దీనిపై ఆయన తర్వాతి కాలంలో స్పష్టత ఇచ్చారు. తాను ముఖ్యమంత్రిగా ఉండటంతో పాటు, మున్సిపల్ పరిపాలన శాఖను కూడా తానే పర్యవేక్షిస్తున్నందున, ఈ ఎన్నికల గెలుపోటములకు తానే పూర్తి బాధ్యత వహిస్తాననే ఉద్దేశంతో ఆ మాట అన్నట్లు



వివరించారు. ఒక సేవకుడిగానే తాను బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని చెబుతూనే, బాధ్యతను భుజానికెత్తుకునే విషయంలో తనకున్న తెగింపును ఈ వ్యాఖ్యల ద్వారా చాటారు. కాంగ్రెస్ పార్టీలో సహజంగా ఉండే గ్రూపు రాజకీయాలు రేవంత్ రెడ్డి విషయంలో ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. పార్టీలో ఆలస్యంగా చేరినప్పటికీ, సీనియర్లను సమన్వయం చేసుకుంటూనే, తన నిర్ణయాలే ఫైనల్ అనే స్థాయికి ఆయన ఎదిగారు. గతంలో బహిరంగంగా విమర్శలు చేసిన నాయకులు కూడా ఇప్పుడు మౌనం వహించడం. రేవంత్ నాయకత్వాన్ని సమర్థించడం ఆయన సాధించిన అతిపెద్ద రాజకీయ విజయం. హైకమాండ్ పూర్తి మద్దతు ఉండటంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో రేవంత్ ఇప్పుడు ఒక్కడే మొనగాడుగా కనిపిస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి వ్యతిరేక కామెంట్లు చేస్తున్నా ఆయనను ఎవరూ పట్టించుకోవడం లేదు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నెక్స్ట్ జనరేషన్ లీడర్‌గా గుర్తింపు పొందుతున్నారు. హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అనర్గళంగా మాట్లాడుతూ జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించడమే కాకుండా, ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో పార్టీకి స్టార్ క్యాంపెయినర్‌గా మారుతున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల నమ్మకాన్ని చూరగొనడంలో ఆయన సఫలీకృతులయ్యారు. వరుసగా అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలు సాధించడంతో తెలంగాణలో రేవంత్ రెడ్డికి ఎదురులేకుండా పోయింది. అటు విపక్ష బీఆర్ఎస్ బలహీనపడటం, ఇటు బీజేపీ పట్టణ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో పుంజుకోకపోవడం రేవంత్‌కు కలిసొచ్చింది. తన సంక్షేమ పథకాలు, దూకుడుగా ఉండే రాజకీయ శైలితో రేవంత్ రెడ్డి తెలంగాణ రాజకీయ యవనికపై ఒక బలమైన ముద్ర వేశారు. ఇది రేవంత్ నాయకత్వ పరంగా పంజుకోవడానికి కలసి వచ్చింది.


# హైదరాబాద్‌లో ఎంఎస్ఎంఈ సదస్సు

**హైదరాబాద్, ఫిబ్రవరి19( వెలుతురు):**
ఇటీవల బడ్జెట్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ఈక్విడిటీ, లిక్విడిటీ, వృత్తిపరమైన మద్దతు ఇచ్చేందుకు కేంద్రం మూడు కోణాల విధానాన్ని ప్రతిపాదించింది. ప్రపంచ స్థాయిలో చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి కేంద్రం కొరియర్ ఎగుమతులపై ప్రస్తుత నిల్వపరిమితిని (10 లక్షల ను) పూర్తిగా తొలగించింది. మన దేశ తయారీ రంగంలో ఎగుమతులలో 48.58%, జిడిపిలో 31.1 శాతం, తయారీ రంగంలో 35.4 శాతం వాటా కలిగి ఉంది.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దేశవ్యాప్తంగా 32.82 కోట్ల మంది వ్యక్తులకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ రంగంలో 7.47 కోట్లకు పైగా సంస్థలు ఉన్నాయి.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దేశ ఆర్థిక రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో వీటిని మరింత బలోపేతం చేయడానికి కేంద్రం కంకణం కట్టుకుంది.మొదటి విధానంలో ఈక్విటీ మద్దతు అందించనుంది. ద్రవ్యలభ్యతను పెంచుతుంది. వృత్తిపరమైన, నిర్వాహక నైపుణ్యాన్ని అందిస్తుంది. తద్వారా ఈ పరిశ్రమల అభివృద్ధికి కేంద్రం సహకారం అందిస్తుంది.రెండవ విధానంలో భాగంగా వ్యవస్థాపకతను ప్రోత్సహిస్తుంది. ఉపాధి, జీవనోపాధి అవకాశాలను సృష్టిస్తుంది. పోటీ తత్వాన్ని పెంచుతుంది. అనేక రాష్ట్రాలకు మద్దతు ఇస్తుంది. ఇది మాత్రమే కాదు బడ్జెట్ కేటాయింపులు కూడా పెంచింది. తద్వారా ఈ పరిశ్రమల పనితీరు దీర్ఘకాలికంగా ఉండేలా కేంద్రం చర్యలు తీసుకుంది.మూడో విధానంలో భాగంగా.. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నుంచి సీపీఎస్ ఈ లు కొనుగోలు చేసే అన్నింటికీ సెటిల్మెంట్ ప్లాట్ ఫామ్ గా ట్రెడ్స్ ను తప్పనిసరి చేసింది. కార్పొరేట్ కంపెనీల కూడా విధివిధానాలు రూపొందించింది. TFe€S ప్లాట్ ఫామ్ లో ఇన్ వాయిస్ డిస్కౌంట్ కోసం సీజీటీ మద్దతు




ఉండే క్రెడిట్ గ్యారంటీ ని కేంద్రం ఇస్తుంది.ట్రెడ్స్ అనేది బహుళ వ్యాపారుల ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వాణిజ్య రాబడులకు ఫైనాన్స్ డిస్కౌంట్ సులభతరం చేస్తుంది. ఇది పూర్తిగా ఎలక్ట్రానిక్ ప్లాట్ఫారం.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్, ఏఐ ఆటోమేషన్, ఈ కామర్స్ అనే అంశాలపై జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. మార్చి 12, 13 తేదీలలో హైదరాబాదులో ని యూసఫ్ గూడ లో క్యాంపస్ లో నిర్వహిస్తారు.రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో సోషల్ మీడియా ట్రెండ్స్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా నిర్వహించే కంటెంట్ క్రియేషన్, ఆటోమేషన్ వర్క్ ఫ్లో, కస్టమర్ సైకాలజీ, బ్రాండింగ్ ప్యాకేజింగ్, ఈ కామర్స్ కంప్లయిన్స్, –ez, OW€n, TFe€S వంటి ప్రభుత్వ డిజిటల్ ప్లాట్ ఫామ్ ల వినియోగంపై నిపుణులు తమ అనుభవంతో పాటు.. లోతైన వివరాలను అందిస్తారు.ఈ కార్యక్రమంలో స్టార్టప్ లాంచ్, గో టు మార్కెట్ వ్యూహాలు, సమాచారం ఆధారిత నిర్ణయాలు వంటి అంశాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఓటఇఐ, స్టార్టప్స్, డిజిటల్ మార్కెటింగ్ నిపుణులు, ప్రభుత్వ సంస్థలు, టెక్నాలజీ సొల్యూషన్ ప్రొవైడర్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని ప్రసంగిస్తారు.ఈ సదస్సుకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి చివరి తేదీగా మార్చి 9 ని నిర్ణయించారు. ఫిబ్రవరి 28 లోపు నమోదు చేసుకునే వారికి 1200.. అనంతరం 2000 ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పరిమిత స్థాయిలో సీట్లు ఉన్న నేపథ్యంలో.. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి మాత్రమే అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

# తగ్గనున్న ఏసీ బస్సు చార్జీలు




**హైదరాబాద్,, ఫిబ్రవరి19( వెలుతురు):**
ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ తీపికబురు అందించింది. ఇప్పటికే రాష్ట్రంలో సమ్మర్ మొదలైనట్లు కనిపిస్తుంది. పగటి ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. మొన్నటివరకు చలి పులి వణికించగా.. ఇప్పుడు ఆ తీవ్రత తగ్గి భానుడి భగభగలు మొదలవుతున్నాయి. ఎండకాలం వస్తున్న క్రమంలో ఏసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ప్రజలు ఎక్కువమంది ఆసక్తి చూపిస్తారు. ఈ క్రమంలో ప్రజలకు బస్సుల్లో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగించేందుకు టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏసీ బస్సుల్లో ఛార్జీలను భారీగా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కేవలం జీహెచ్ఎంసీ పరిధిలో తిరిగే ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లో మాత్రమే ఈ తగ్గింపు అమలు కానుంది. దీంతో నగరవాసులు ఎండ వేడి, ఉక్కబోత సమస్య నుంచి బయటపడనున్నారు.నగర పరిధిలో సేవలు అందించే సిటీ ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లో అన్నింటిల్లోనూ 30 శాతం వరకు ఛార్జీలు తగ్గించనున్నారు. మార్చి 1వ తేదీ నుంచి మే నెలాఖరు వరకు ఈ తగ్గింపు అమల్లో ఉంటుంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లో ఛార్జీ ఎక్కువగా వసూలు చేస్తుండగా.. ఈ తగ్గింపుతో మెట్రో ఎక్స్‌ప్రెస్ ఛార్జీలతో సమానంగా ఏసీ బస్సుల ఛార్జీలు ఉండనున్నాయి. అయితే మహిళలకు ఎప్పటిలాగే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం అమల్లో ఉంటుంది. టికెట్ తీసుకుని ప్రయాణించేవారికి ఈ తగ్గింపుతో ఛార్జీల భారం తగ్గడంతో పాటు ఎండాకాలంలో సౌకర్యవంతమైన ప్రయాణం ఏసీ బస్సుల్లో లభించనుందని చెప్పవచ్చు. ఇక శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు సర్వీసులు అందించే పుష్పక్ ఏసీ బస్సుల్లోనే 30 శాతం టికెట్ల ఛార్జీలను తగ్గించనున్నారు. దీంతో ఎయిర్ పోర్ట్‌కు వెళ్లే ప్రయాణికులకు కూడా ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం నగర పరిధిలో అన్ని ప్రాంతాలకు ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. వీటిల్లో ఏసీ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. వీటిల్లో ప్రయాణికుల రద్దీ కూడా భారీగా ఉంటుంది. ఎండాకాలంలో ఏసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ మరింత పెరగనుంది. ఈ క్రమంలో ప్రయాణికులకు తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు టీజీఎస్ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది. కేవలం హైదరాబాద్‌లోని ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లో మాత్రమే తగ్గింపు అమల్లో ఉంటుంది. మిగతా ప్రాంతాలకు తిరిగే ఏసీ బస్సులకు ఈ తగ్గింపు వర్తించదని ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికులు ఈ సౌకర్యం ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అటు హైదరాబాద్‌లో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కేటాయించిన ఎలక్ట్రిక్ బస్సులను నగరంలో తిప్పనుంది.

# ఎంపి రఘునందన్ రావుపై తప్పుడు ఆరోపణలు

**గజ్వేల్ ఫిబ్రవరి19( వెలుతురు):**
తూప్రాన్ మున్సిపాలిటీ బిజెపి కౌన్సిలర్లను ఎంపీ రఘునందన్ రావు అమ్ముకున్నారంటూ తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని బిఆర్ఎస్ ఇంచార్జ్ ప్రతాపరెడ్డిని బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిద్దిపేట జిల్లా బిజెపి అధ్యక్షుడు బైరి శంకర్, గజ్వేల్ పట్టణం బీజేపీ అధ్యక్షుడు మనోహర్ లు మాట్లాడుతూ తూప్రాన్ మున్సిపల్ లో ముగ్గురు కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీకి అమ్మినట్లు ప్రతాపరెడ్డి చేస్తున్న ప్రచారంలో నిజంలేదని, దానికి సంబంధించి ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. ప్రతాప్ రెడ్డి గతంలో టిడిపి నుండి కాంగ్రెస్లోకి వచ్చి హరీష్ రావు, కేటీఆర్ పై విమర్శలు చేశారని, కాంగ్రెస్ నుండి బయటకు వచ్చి బిఆర్ఎస్లో చేరి కేవలం డబ్బు సంపాదనకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ప్రతాప్ రెడ్డి ఒక బ్రోకర్ లా వ్యవహరిస్తున్నారని, పార్టీ పేరు చెప్పుకొని ఫామ్ హౌస్ డబ్బులతో కాలక్షేపం



చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గజ్వేల్ కోట మైసమ్మ సాక్షిగా నీ అంతు చూస్తాం. ఇంకొకసారి ఎంపీ రఘునందన్ రావుపై నోరు పారేసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు.

# జీవన్ రెడ్డి ఔట్...

**కరీంనగర్, ఫిబ్రవరి19( వెలుతురు):**
తానిపత్తి జీవన్‌రెడ్డి.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి. మాజీ ఎమ్మెల్సీ. మూడేళ్ల క్రితం వరకు జీవన్‌రెడ్డికి పార్టీలో ప్రముఖ స్థానం ఉండేది. 2018 సమయంలో ఏకంగా పీసీసీ పదవికి పోటీ పడ్డారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌కు ఛాలెంజ్ చేసి మంత్రి పదవి వదులుకుని ఎంపీగా పోటీ చేశారు. ఇలా అధిష్టానం ఏం చెబితే అది చేస్తూ విధేయుడిగా కొనసాగారు. కానీ, మూడేళ్లుగా పరిస్థితులు మారిపోయాయి. 2023 ఎన్నికల్లో ఓడిపోయాక పార్టీ ఆయనను క్రమంగా దూరం పెడుతోంది. ఎమ్మెల్సీ పదీకాలం ముగుస్తున్న సమయంలో మరోసారి అవకాశం ఇస్తుందని భావించారు. కానీ ఆ ఛాన్స్ కూడా ఇవ్వలేదు.ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జీవన్‌రెడ్డి గెలిచి ఉంటే మంత్రి అయ్యేవారు. కానీ, ఆయన బీఆర్ఎస్ తరఫున పోటీచేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చేతిలో ఓడిపోయారు. దీంతో జీవన్‌రెడ్డి ప్రాధాన్యం పార్టీలోనూ తగ్గిపోయింది. ఒకవైపు ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లింది. ఇక ఇదే సమయంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సంజయ్‌కుమార్ ఏడాది తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ కూడా అన్ని విషయాల్లో సంజయ్‌కుమార్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో జీవన్‌రెడ్డిలో అసంతృప్తి పెరిగింది. ఒకే ఒరలో రెండు




కత్తులు ఇమడలేవని, ఒకే పార్టీలో ఇద్దరు ఇన్‌చార్జీలు ఉండలేరని జీవన్‌రెడ్డి అధిష్టానానికి సంకేతం ఇస్తూ వస్తున్నారు. గతంలో కూడా పార్టీ నిర్ణయాలపై ఆయన బహిరంగంగా విమర్శలు గుప్పించారు.ఏడాదికాలంగా జీవన్‌రెడ్డికి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వర్గానికి మధ్య అంతర్గత కుమ్ములాట జరుగుతోంది. పంచాయతీ ఎన్నికల సమయంలో పార్టీ గుర్త ఎన్నికలు కాకపోవడంతోపెద్దగా ప్రభావం చూపలేదు. కానీ, మున్సిపల్ ఎన్నికల వచ్చే సరికి ఇరు వర్గాల మధ్య కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపిక విషయంలో సమస్యలు తలెత్తాయి. సంజయ్‌వర్గం అభ్యర్థులకు పార్టీ బీఫాంలు అదించింది. దీంతో జీవన్‌రెడ్డి కతల చెందారు. దీంతో తన వర్గం అభ్యర్థులను స్వతంత్రులుగా బరిలో దించారు. ఫలితాల్లో జీవన్‌రెడ్డి వర్గం 14 మంది గెలవగా, సంజయ్ వర్గం నుంచి 20 మంది గెలిచారు. దీంతో రెండు వర్గాలు కలిస్తే కానీ, పీఠం దక్కే అవకాశం లేకుండా పోయింది. దీంతో జీవన్‌రెడ్డి పీఠం తమ వర్గానికే ఇవ్వాలని పట్టుబట్టారు. అధిష్టానంతో మాట్లాడారు. కానీ, సంజయ్ వర్గానికే పార్టీ పీఠం కట్టబెట్టింది. దీంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపం చెందారు. పార్టీలో కొనసాగాలని పించడంలేదని వ్యాఖ్యానించారు. తాజా వ్యాఖ్యల నేపథ్యం.. మంగళవారం ఢిల్లీకి వెళతానని ప్రకటించడంతో టీపీసీసీ రంగంలోకి దిగింది. జిల్లా పరిషత్ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చింది. అయినా జీవన్‌రెడ్డి మెత్తబడలేదు. మంగళవారం ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. మొదటి దశలో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించే అవకాశం ఉంది. జీవన్ రెడ్డికి జిల్లా స్థాయి బాధ్యతలు లేదా ప్రభుత్వంలో పదవి ఇచ్చి మెత్తగా చేయవచ్చు. అయితే, అధిష్ఠానం కఠినత చూపితే, ఆయన తీవ్ర నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ఇంకా బలపడకముందే ఇలాంటి కలహాలు పార్టీకి నష్టం కలిగిస్తాయి.ఈ డ్రామా పాజిటివ్‌గా ముగిస్తే, కాంగ్రెస్ తన నాయకులను ఏకం చేసుకునే అవకాశం. నెగటివ్‌గా మారితే, పార్టీ ఓటు బ్యాంక్ బలహీనపడుతుంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పరిణామం కీలకం. జీవన్ రెడ్డి వంటి స్థానిక నాయకులు పార్టీకి అవసరమని అధిష్ఠానం గుర్తుంచుకోవాలి.

# హిందూపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

## పలు కార్యక్రమాలు ప్రారంభించిన బాలయ్య

**అనంతపురం, ఫిబ్రవరి19( వెలుతురు):**
ప్రముఖ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో పర్యటించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం భూమి పూజ, శంకుస్థాపన చేశారు. తొలుత లేపాక్షి మండలం మనేంపల్లిలో రూ. 2.60 కోట్లతో ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్డుకుబాలకృష్ణ భూమి పూజ చేశారు. స్వయంగా ప్రొక్లెయిన్ ఆపరేట్ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం మండలంలోని పులమతి చెరువులో పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. ఇటీవల హంద్రీనీవా నీటితో నియోజకవర్గంలోని చెరువులను నింపిన నేపథ్యంలో ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు చెప్పారు.సేవా కార్యక్రమాలతో, తన సొంత నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ తీరిక లేకుండా గడుపుతున్నారు. అయితే తాజాగా హిందూపూర్ లో రెండు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన బాలయ్య అక్కడ పలు అభివృద్ధి పనుల కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. జనంతో మమేకమై కాలనీల్లో కలియ తిరిగారు. ఈ సందర్భంగా ఓ అభిమాని, మహిళా కార్యకర్త కోరిక మేరకు ఆమె నూతనంగా ఏర్పాటు చేసిన టీ స్టాల్‌ను ప్రారంభించారు. అనంతరం అక్కడే టీ తాగి అక్కడకు వచ్చిన వారితో సరదాగా మాట్లాడారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అవుతోంది.

# బీజేపీ-బీఆర్ఎస్ పొత్తుపై పెరుగుతున్న చర్చ




**హైదరాబాద్, ఫిబ్రవరి19( వెలుతురు):** ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత విచిత్రమైన , ఆసక్తికరమైన సమీకరణాలకు తెరలేపాయి. సిద్ధాంతపరంగా బద్ధశత్రువులుగా కనిపించే పార్టీలు క్షేత్రస్థాయిలో అధికారం కోసం చేతులు కలపడం 'అవకాశవాద రాజకీయం'గా కనిపిస్తున్నా, దీని వెనుక లోతైన వ్యూహాలు దాగి ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల కంటే స్థానిక గెలుపు గుర్రాలే కీలకం కావడంతో చాలా చోట్ల అనూహ్య పొత్తులు కనిపించాయి. బీజేపీ-కాంగ్రెస్, బీఆర్ఎస్-బీజేపీ వంటి అసంభవమైన కలయికలు కొన్ని మున్సిపాలిటీల్లో అధికార పీఠాలను కైవసం చేసుకున్నాయి. నిజామాబాద్ వంటి చోట్ల కాంగ్రెస్-మజ్లిస్ జతకట్టడం గమనార్హం. రాష్ట్ర స్థాయిలో నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నా, స్థానిక కౌన్సిలర్లు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి పార్టీల మధ్య ఉన్న గీతలను చెరిపివేశారు.బీఆర్ఎస్ నేత హరీష్ రావు వంటి వారు ఇతర పార్టీల అనైతిక పొత్తులపై విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, స్థానిక సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల్లో నాయకత్వం వ్యక్తిగత ప్రాబల్యంపై ఆధారపడి ఉంటుంది. అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల నాటికి ఈ సమీకరణాలు మారిపోయి, మళ్ళీ ఆయా పార్టీల అధిష్టానాల ఆదేశాల మేరకు రాజకీయాలు నడుస్తాయి. అయితే ఈ మున్సిపల్ ఎన్నికలు పార్టీల మధ్య ఉన్న రాజకీయ అంటరానితనం పోయిందని స్పష్టం చేశాయి. ఈ ఎన్నికల తర్వాత అత్యంత ఆసక్తికరమైన చర్చ బీజేపీ - బీఆర్ఎస్ పొత్తు గురించి మొదలైంది. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలంటే ఈ రెండు పార్టీలు కలవడం ద్వారా ఓటు బ్యాంక్ ఏకీకరణ జరుగుతుందని ఒక వర్గం అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల ఓట్ షేర్ కలిపితే అది అధికార పార్టీ కంటే ఎక్కువగా ఉండటమే ఈ చర్చకు ప్రధాన కారణం. కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి ఈ రహస్య లేదా బహిరంగ పొత్తు మున్సిపల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లే అవకాశం ఉందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో, బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్టును కలిపితే బలమైన శక్తిగా ఎదగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, ఉమ్మడి శత్రువును ఓడించడానికి రెండు పార్టీలు చేతులు కలపడం వ్యూహాత్మకంగా లాభిస్తుంది. అయితే, ఈ పొత్తు వల్ల ఇరు పార్టీల సిద్ధాంతాలకు తూట్లు పొడిచినట్లవుతుందనే భయం కూడా నాయకత్వాల్లో ఉంది. మైనారిటీ ఓట్లు కోల్పోతామనే భయం బీఆర్ఎస్‌కు ఉంటే, హిందుత్వ ఓటు బ్యాంకులో చీలిక వస్తుందేమోనన్న ఆందోళన బీజేపీలో ఉంది.రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలు పొత్తుల గురించి ఆలోచన చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే, తెలంగాణలో కాంగ్రెస్‌ను ఒంటరిగా ఢీకొట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరమని ఈ మున్సిపల్ ఫలితాలు నిరూపించాయి. రాష్ట్ర స్థాయి రాజకీయం ఎప్పుడూ అధికారం చుట్టూనే తిరుగుతుంది కాబట్టి, భవిష్యత్తులో బీజేపీ-బీఆర్ఎస్ కలిసి పనిచేయడం అనేది అసాధ్యమేమీ కాదు. అయితే అది బహిరంగ పొత్తుగా ఉంటుందా లేదా లోపాయికారి ఒప్పందంగా ఉంటుందా అనేది కాలమే నిర్ణయించాలి.

# పార్టీ నుంచి దానం సస్పెన్షన్...



**హైదరాబాద్, ఫిబ్రవరి19( వెలుతురు):** దానం నాగేందర్ పార్టీ మార్పిడి, అనర్హత వేటు అంశం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. దానంపై అనర్హతా వేటు కోసం బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. అదే సమయంలో ఆయన లోక్ సభకు పోటీ చేయడంతో బీజేపీ కూడా అనర్హతా పిటిషన్ వేసింది. దానిపై విచారణ బుధవారం జరిగింది. అయితే దానంపై సస్పెన్షన్ వేటు వేసినట్లుగా బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసిందని బిజెపి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చెబుతున్నారు. అయితే ఈ విషయంపై బీఆర్ఎస్ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సాధారణంగా ఒక పార్టీకి చెందిన ఎమ్మెల్యే మరో పార్టీలోకి వెళ్తే ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడే అవకాశం ఉంటుంది. అయితే, ఒకవేళ పార్టీయే సదరు నేతను ముందే సస్పెండ్ చేసినట్లు కోర్టుకు తెలిపితే, అప్పుడు ఆ నేత స్వతంత్ర హోదాను పొందుతాడు లేదా సాంకేతికంగా అనర్హత నుంచి తప్పించుకునే వెసులుబాటు ఉంటుంది. బిఆర్ఎస్ పార్టీ దానం నాగేందర్‌ను సస్పెండ్ చేసినట్లు అఫిడవిట్ ఇచ్చి ఉంటే, అది ఆయనను అనర్హత నుంచి కాపాడుతుంది. ఒకవైపు తమ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ చేర్చుకుంటోందని బిఆర్ఎస్ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పోరాటం చేస్తోంది. మరోవైపు, అదే పార్టీకి చెందిన కీలక నేతపై అనర్హత వేటు పడకుండా సస్పెన్షన్ అనే అస్త్రాన్ని ప్రయోగిస్తే, అది ఆ పార్టీ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తుంది. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం.. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినా లేదా విప్ ధిక్కరించినా అనర్హత వేటు పడుతుంది. కానీ, పార్టీయే సదరు సభ్యుడిని బహిష్కరిస్తే అతను సభలో స్వతంత్రుడిగా కొనసాగవచ్చు. ఒకవేళ బిఆర్ఎస్ అఫిడవిట్‌లో సస్పెన్షన్ ప్రస్తావన ఉంటే, పిటిషనర్ల వాదన కోర్టులో వీగిపోయే ప్రమాదం ఉంది. దీన్నే ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాజకీయ కుట్రగా అభివర్ణిస్తున్నారు.

ఒకవేళ బిఆర్ఎస్ కావాలనే దానంను కాపాడుతోందని ప్రజల్లోకి సంకేతాలు వెళ్తే, ఆ పార్టీ నైతిక విజయాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా ఇతర ఎమ్మెల్యేల అనర్హత విషయంలో బిఆర్ఎస్ చేస్తున్న పోరాటానికి విలువ లేకుండా పోతుంది. తమ పార్టీ నేతలను కాంగ్రెస్‌కు అప్పగించి, బయటకు మాత్రం పోరాడుతున్నట్లు నటిస్తున్నారు అనే విమర్శలను కేడర్ నుంచి ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇది పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది.ప్రస్తుతం నెలకొన్న గందరగోళంపై బిఆర్ఎస్ నాయకత్వం తక్షణమే స్పందించాల్సి ఉంది. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఏముందో బహిరంగ పరచకపోతే, రాజకీయంగా బిఆర్ఎస్ ఆత్మరక్షణలో పడక తప్పదు. బిజెపి చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలంటే చట్టపరమైన ఆధారాలతో క్లారిటీ ఇవ్వడం ఆ పార్టీకి అత్యవసరం. దానం నాగేందర్ విషయంలో జరుగుతున్న ఈ పరిణామాలు కేవలం ఒక ఎమ్మెల్యే అనర్హతకు సంబంధించినవి మాత్రమే కాదు..కీలక రాజకీయ మార్పులకు కారణం అయ్యే అంశం అవుతుందని భావిస్తున్నారు.

# రైస్ మిల్లుకు వెళ్తున్న రేషన్ బియ్యం లారీ పట్టివేత

**కోనసీమ జిలా ఫిబ్రవరి19( వెలుతురు):** రూ. 10.8 లక్షల విలువైన 30 టన్నుల బియ్యం రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న సమాచారం రావడంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ వద్ద ఎస్సై జి నరేష్ పట్టుకున్నారు. 30 టన్నుల బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారు. వాటిని పట్టుకుని ఆరా తీయగా రేషన్ బియ్యంగా వెల్లడయింది.విజయవాడ సమీపం నుంచి ఈ బియ్యాన్ని తీసుకొస్తున్నారు.ఈ బియ్యం విలువ సుమారు రూ. 10.8 లక్షలు ఉంటుంది. దీనిపై ఎస్ఐ నరేష్ బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ ఆకుల శివకృష్ణ మణికంఠ ను అరెస్టు చేశారు.కాకినాడకు చెందిన కె.చంద్రశేఖర్‌కు చెందిన లారీ గా గుర్తించారు. అయితే ఈ బియ్యం కాకినాడ వెళుతున్నట్లు వారు చెబుతున్నారు. కాని కోస్తా జిల్లాలోనే రేషన్ బియ్యం కొనుగోలు కేంద్రంగా ఉన్న ఆలమూరు మండలం మోదుకూరు రైస్ మిల్లులకు ఈ బియ్యం వస్తున్నట్లు సమాచారం.ఈ బియ్యాన్ని మండపేట మండలం వేములపల్లి గౌడౌన్ లో దిగుమతి చేసి లారీని ఆలమూరు పోలీసు స్టేషన్ కు తరలిస్తామబి మండల సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

# కాడిని వదిలేసిన రాకేష్ రెడ్డి



**నిజామాబాద్, ఫిబ్రవరి19( వెలుతురు):** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో.. బీజేపీకి పట్టుంది. కాషాయం కంచుకోటల్లో.. ఆర్మూర్ పట్టణం ఒకటని నమ్ముతారు ఆ పార్టీ పెద్దలు. అందుకు తగ్గట్టే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి 18వేల మెజార్టీతో గెలిచారు. అలాగే? లోక్‌సభ ఎన్నికల్లోనూ.. ఆర్మూర్ టౌన్‌లో ఆ పార్టీకి చెప్పుకోతగ్గ ఓట్లు పడ్డాయి. పటిష్టమైన క్యాడర్, బలమైన సంఘ్ పరివార్ నేతలు ఉండటం ఇక్కడ మనకు ప్లస్ అంటూ లెక్కలేసుకుంటూ ఉంటారు కమలం లీడర్స్. అందుకే మున్సిపల్ ఎన్నికల్లో.. ఆర్మూర్ పీఠం మనదేనని గట్టిగా నమ్మారు. బయట కూడా ఈ టౌన్ బీజేపీదే అనేలా.. టాక్ నడిచింది. కానీ? తీరా చూస్తే?. యాంటీ క్లైమాక్స్ కనిపించింది. ఫలితాలు తలకిందులై ఆ పార్టీకి ఊహించని షాక్ ఇచ్చాయి. స్థానికంగా బీజేపీ ఎమ్మెల్యే ప్రాతినిథ్యం వహిస్తున్నప్పటికీ.. కేవలం 8 వార్డులనే గెల్చుకోవడం ఏంటో అర్థంగాక పార్టీ నాయకులు తలలు పట్టుకుంటున్నారట. అసలు ఎక్కడ తేడా కొట్టిందంటూ ఎవరికి వారు ఆరా తీయడం మొదలుపెట్టారు. ఈ మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా.. 19 చోట్ల గెలిచి ఛైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కానీ? అంత హైప్ ఉన్న బీజేపీ మాత్రం సింగిల్ డిజిట్‌కే పరిమితమై కొత్త సందేహాలకు లేవనెత్తిందంటున్నారు పరిశీలకులు. ఇక్కడ బీఆర్ఎస్ ఐదు, స్వతంత్రులు ముగ్గురు గెలవగా.. ఎంఐఎం అభ్యర్థి ఒక చోట విజయం సాధించారు. గెలుపు మాదేనని ధీమాగా ఉన్న బీజేపీ కేడర్ ఫలితాల షాక్ నుచి ఇంకా కోలుకోలేకపోతోందట. దీంతో అట్టర్ ప్లాప్ షోకు.. కారణం ఎవరన్న చర్చ పార్టీలో జోరుగా జరుగుతోంది.ఆర్మూర్ ఫలితాలపై విశ్లేషణ చేస్తామని పార్టీ ఎంపీ సైతం అనడం, లోకల్ కేడర్‌కు ఎంపీ అర్వింద్ క్షమాపణ చెప్పడం లాంటి పరిణామాల్ని చూస్తుంటే?. ఇదేం యాదృచ్ఛికంగా జరిగింది కాదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయంటున్నారు కొందరు. పట్టణంలో బలమైన క్యాడర్ ఉండటం, స్థానికంగా పార్టీ ఎమ్మెల్యే ఉండటం లాంటి బలమైన కారణాలు చాలానే కనిపిస్తున్నా? గెలుపునకు బదులు సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడం వెనకున్న కథల్ని వెలికితీసే పనిలో పార్టీ పెద్దలున్నట్టు సమాచారం. ఆల్రెడీ రంగంలోకి దిగి విశ్లేషణలు మొదలుపెట్టినట్టు సమాచారం. సీనియర్ లీడర్స్ మధ్య అంతర్గత విబేధాలు, పట్టణంలో ముఖ్య నేతలు పోటీకి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది..? ఎలక్షన్ టైంలో సీనియర్స్ ఇళ్ళకే ఎందుకు పరిమితం కావాల్సి వచ్చింది లాంటి అనేక అంశాలపై చర్చ జరుగుతోందట. వాటన్నిటికీ మించి కాంగ్రెస్ మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్దిగా ప్రచారంలో ఉన్న నాయకుడు పోటీ చేసిన వార్డులో బీజేపీ తన అభ్యర్థిని ఎందుకు నిలపలేదన్నది బిగ్ క్వశ్చన్.ఈ విషయంలో తెర వెనుక ఏం జరిగిందంటూ?. అన్ని అంశాలపై పార్టీ బాధ్యులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట తీరు, వాడే భాష సైతం ఫలితాలపై ప్రభావం చూపిందనే చర్చ ఉంది. ఆయన దూకుడు తత్వం అసెంబ్లీ ఎన్నికల్లో సక్సెస్‌కు కారణం కాగా.. మున్సిపల్ ఎన్నికలకు వచ్చేసరికి అదే మైనస్ అయిందన్న మాటలు సైతం వినిపిస్తున్నాయి ఆర్మూర్‌లో. ఎమ్మెల్యే వైఖరి పార్టీని కూడా బలహీనపరుస్తోందని అంటున్నారు. సాధారణంగా?.ఎన్నిక ఏదైనా దగ్గరుండి పర్యవేక్షించే ఎంపీ అర్వింద్.. ఆర్మూర్ మున్సిపాలిటీని ఎమ్మెల్యేకే వదిలేశారట. ఆయన పర్యవేక్షణ లేకపోవడం కూడా మెరుగైన ఫలితాలు రాకపోవడానికి ఓ కారణంగా చర్చ జరుగుతోంది. అందుకే? రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతను ఎంపీనే తీసుకోవాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఆర్మూర్ ఫలితాల్లో లెక్క ఎక్కడ తప్పిందో?.అది కాకతాళీయమా లేక కావాలనే జరిగిందా? తెర వెనక సంగతులేంటో? పార్టీ పెద్దలు తేల్చాలన్న డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది ఆర్మూర్ కాషాయ దళంలో.

# పెళ్లికి అంతా రెడీ... క్యూట్ కపుల్ ఆస్తుల 100 కోట్ల పైనే..



**హైదరాబాద్, ఫిబ్రవరి19( వెలుతురు):** టాలీవుడ్ బెస్ట్ పెయిర్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల పెళ్లి ఈ నెల 26న జరగనుందని ప్రచారం సాగుతున్న సంగతి తెలిసిందే. ఓవైపు ఏర్పాట్లు జరుగుతున్నా... మరోవైపు అటు విజయ్ నుంచి ఇటు రష్మిక నుంచి ఎలాంటి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాలేదు. వీరి పెళ్లి ప్రకటన ఎప్పుడు వస్తుందా అంటూ ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. మరి ఇండస్ట్రీలో బిగ్ స్టార్స్‌గా పేరొందిన ఈ కపుల్ ఆస్తుల నికర విలువ ఓసారి చూస్తే...'నువ్విలా' మూవీతో ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చిన విజయ్ దేవరకొండ తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి చూపులు' మూవీతో స్టార్ హీరోగా మారారు. ఆ తర్వాత అర్జున్ రెడ్డి ఆయన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. గీత గోవిందంతో యూత్, ఫ్యామిలీ ఆడియన్స్ మదిలో చెరగని ముద్ర వేశారు. తన నటనతో బిగ్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నారు.విజయ్ దేవరకొండ నెట్ వర్త్ ఓసారి చూస్తే... హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఓ లగ్జరీ భవనంలో తన ఫ్యామిలీతో కలిసి నివసిస్తున్నారు. దీని విలువ రూ. 15 కోట్లు అని తెలుస్తోంది. ఆయన వద్ద ఃఓచి 5 సిరీస్, ఫోర్డ్ ముస్తాంగ్, వోల్వో చీఅ9,0 రేంజ్ రోవర్‌తో సహా ఇతర కార్లు ఉన్నాయి. ఆంగ్ల మీడియా రిపోర్ట్స్ ప్రకారం... ఆయనకు ఓ ప్రైవేట్ జెట్ కూడా ఉన్నట్లు సమాచారం. టాలీవుడ్ ఇండస్ట్రీలో అత్యధికంగా సంపాదిస్తున్న నటుల్లో విజయ్ ఒకరు. దాదాపు రూ. 70 కోట్ల నెట్ వర్త్ విజయ్ దేవరకొండ కలిగి ఉన్నట్లు వివిధ నివేదికల ద్వారా తెలుస్తోంది.విజయ్ దేవరకొండ ఒక్కో సినిమాకు దాదాపు రూ. 12 కోట్ల నుంచి రూ. 30 కోట్ల మధ్యలో రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది. సినిమాలతో పాటు యాడ్స్, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్, ఈవెంట్స్‌తో పాటు తన నిర్మాణ సంస్థ కింగ్ ఆఫ్ ది హిల్ ఎంటర్టైన్మెంట్ ద్వారా కూడా సంపాదిస్తున్నారు.

ఫ్యాషన్ పట్ల విజయ్‌కు ఎంతో ఇష్టం ఉంది. దీంతో ఆయన సొంత స్ట్రీట్ వేర్ బ్రాండ్ రౌడీ వేర్ డిజైన్ చేసుకున్నారు. హైదరాబాద్ బ్లాక్ హాక్స్ అనే ప్రొఫెషనల్ పురుషుల వాలీబాల్ జట్టుకు కూడా ఆయన కో ఓనర్. విజయ్ బ్రాండ్ ఎండార్స్‌మెంట్ కోసం దాదాపు రూ.కోటి. పెయిడ్ ఇన్ స్టా గ్రామ్ పోస్ట్ కోసం రూ. 40 లక్షలు చార్జ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. టాలీవుడ్, అటు బాలీవుడ్‌లోనూ వరుస విజయాలతో టాప్ ప్లేస్‌లో ఉన్నారు నేషనల్ క్రష్ రష్మిక. ఫోర్బ్స్ ప్రకారం, రష్మిక నెట్ వర్త్ రూ. 66 కోట్లు. బెంగుళూరులో రూ. 8 కోట్ల విలువైన లగ్జరీ హౌస్‌తో పాటు హైదరాబాద్, ముంబై, గోవా, కూర్గ్, హైదరాబాద్‌ల్లో కూడా ఆస్తులు కలిగి ఉంది. ఈఇ నివేదిక ప్రకారం ఆమె ఒక చిత్రానికి రూ. 4 కోట్ల రెమ్యునరేషన్ వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. విజయ్ లాగా ఈమె వద్ద కూడా ఆడి ఖ3, రేంజ్ రోవర్ స్పోర్ట్, టయోటా ఇన్నోవా, హ్యుందాయ్ క్రెటా, మెర్సిడెస్ బెంజ్ సి క్లాస్ లగ్జరీ కార్లను కలిగి ఉంది.ఇక ఈ నెల 26న రాజస్థాన్ ఉదయపూర్ ప్యాలెస్‌లో విజయ్, రష్మికల పెళ్లి కుటుంబ సభ్యులు, అతి కొద్దిమంది అతిథుల సమక్షంలో జరగనుందని ప్రచారం సాగుతుండగా... హైదరాబాద్ తాజ్ కృష్ణ లగ్జరీ హోటల్‌లో మార్చి 4న రిసెప్షన్ జరగనున్నట్లు తెలుస్తోంది.

# రాజేందర్, రఘునందనరావులు ఎందుకలా...



**హైదరాబాద్, ఫిబ్రవరి19( వెలుతురు):** తెలంగాణ బీజేపీ ఎంపీలు ఇద్దరు కాస్త తేడాగా వ్యవహరించారా? వాళ్ళ నిర్ణయంతో పార్టీ కేడర్ కూడా షాక్ అయిందా? ఆ మార్పు పార్టీకి తెలిసే జరిగిందా? లేక వ్యక్తిగతమా? ఎవరా ఇద్దరు లోక్‌సభ సభ్యులు? తేడా అనిపించేలా ఏం చేశారు? తెలంగాణలో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. అందులో చిత్ర విచిత్ర పరిణామాలు చోటు చేసుకున్నాయి. హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో ఎవరు ఎవరితో కలిశారు, ఏం పంచుకున్నారన్నది చివరి వరకు ఉత్కంఠగా మారి?.. సస్పెన్స్ థ్రిల్లర్‌ని మరిపించింది. ఈ విషయంలో కమలం పార్టీ వైఖరి గురించి ప్రత్యేక చర్చలు జరుగుతున్నాయి. కాషాయ దళం ఒక్కో మున్సిపాలిటీలో ఒక్కోలా వ్యవహరించి అసలు వీళ్ళు ఎటున్నారన్న సంగతి అర్థంకాకుండా చేసింది. అనైతిక పొత్తులు పెట్టుకోబోం, ఎవరితో కలవబోమంటూ?. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఉన్న కొన్ని చోట్ల ఉన్న అవకాశాన్ని వదిలేసుకుంది బీజేపీ. సరే? అది మంచి సంప్రదాయం, ఆదర్శవంతమైన రాజకీయం అనుకుంటుండగానే?మరికొన్ని చోట్ల అన్నిటినీ పక్కన పెట్టేసి అధికారం కోసం ప్రత్యర్థులతో జతకట్టి ముక్కున వేలేసుకునేలా చేసింది. ఒకచోట కాంగ్రెస్‌తో, మరొక చోట బీఆర్ఎస్‌తో చేతులు కలిపిన తీరును చూసి వీళ్ళేంటో? వీళ్ళ విధానాలేంటో? అసలేం అర్థంకావడం లేదన్న రావు రమేష్ సినిమా డైలాగ్‌ని గుర్తు చేసుకుంటున్నారు పొలిటికల్ పండిట్స్. అందరిలాగే? బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే మున్సిపాలిటీల్లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకున్నారు. ముందే అంచనాలు వేసుకుని పార్టీకి అవసరం అనుకున్న చోట నమోదు చేసుకున్నారు. అయితే? ఇద్దరు ఎంపీలు అండ్ సీనియర్ లీడర్స్ రఘునందన్ రావు, ఈటల రాజేందర్ అందుకు భిన్నంగా వ్యవహరించారు. అస్సలు ఎవరూ ఊహించని చోట వాళ్ళు ఎక్స్‌అఫిషియో ఓటర్స్‌గా నమోదు చేసుకున్నారు.ఈ విషయం బయటికి తెలిశాక ఆశ్చర్యపోతున్న చాలామంది వాళ్లు అక్కడే ఎందుకు నమోదు చేసుకోవాల్సి వచ్చింది? బ్యాక్‌గ్రౌండ్ స్టోరీ ఏంటి అంటూ చర్చించుకుంటున్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఎక్స్ అఫిషియోగా నమోదయ్యారు. ఇక ఈటల రాజేందర్ ఎల్లంపేట మున్సిపాలిటీలో చేసుకున్నారు. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే? ఇస్నాపూర్‌లో బీజేపీ ఒక్క వార్డ్ కూడా గెలుచుకోలేదు. అయినా సరే? ఎంపీ అక్కడెందుకు ఓటు నమోదు చేసుకున్నారన్నది మిలియన్ డాలర్ క్వశ్చన్. పైగా?. లోకల్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, రఘునందన్‌రావు కలిసి ఒకే కారులో రావడం చూసి అక్కడున్నవారంతా షాకయ్యారట. దీని గురించే పార్టీలో హాట్ హాట్ డిస్కషన్ నడుస్తోంది. మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకుని మళ్ళీ పాత గూటికి చేరుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆ ఎన్నికల్లో మహిపాల్‌రెడ్డి వర్గం మొత్తం బీఆర్ఎస్‌కే సపోర్ట్ చేసిందన్నది లోకల్‌గా చెబుతున్న మాట. పైగా? ఇస్నాపూర్‌లో ఛైర్మన్ సీటును బీఆర్ఎస్ గెల్చుకుంది. బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేయాలన్నది ఎంపీ సొంత నిర్ణయమా లేక ఇంకేదన్నా స్టోరీ ఉందా అన్న కన్ఫ్యూజన్‌లో ఉన్నారట బీజేపీ నాయకులు. స్థానిక రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని రఘునందన్‌రావు ఆ నిర్ణయం తీసుకున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నా?. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసి ఒకే కారులో రావడం చూస్తుంటే? అనైతిక పొత్తులు పెట్టుబోకోబోమన్న మాటలకు అర్థం ఏంటో తెలియడం లేదని మాట్లాడుకుంటున్నారు పార్టీ నాయకులు. ఇదే సమయంలో ఇస్నాపూర్‌లో బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేసి మరోచోట ఆ పార్టీ మద్దతు తీసుకున్నారా అన్న చర్చలు సైతం నడుస్తున్నాయి.పార్టీకి తెలిసే ఎంపీ ఆపని చేశారని అంటున్నా? ఎమ్మెల్యేతో కలిసి రావడాన్ని మాత్రం జీర్ణించుకోలేకపోతున్నాయట స్థానిక కాషాయ శ్రేణులు. ఇక ఈటల రాజేందర్ విషయానికి వస్తే?. ఆయన ఎల్లంపేటలో ఎందుకు ఎక్స్‌అఫిషియోగా నమోదు చేసుకోవాల్సి వచ్చింది?. తెరవెనుక జరిగిన పరిణామాలు ఏంటన్న చర్చలు జోరుగా నడుస్తున్నాయి. మంచో చెడో చేసుకున్నారు సరే?. మరి ఛైర్మన్ ఎన్నికను ఎందుకు స్కిప్ చేశారన్నది ఇంకో పెద్ద ప్రశ్న. మేడ్చల్ మల్కాజ్ గిరి పరిధిలో ఆ పార్టీ ఒక చోట బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వగా మరో చోట కాంగ్రెస్‌కు ఇచ్చింది. రెండు చోట్ల బీజేపీకి వైస్ ఛైర్మన్ పదవి దక్కింది. అటు ఎల్లంపేటలో ఎమ్మెల్యే మల్లారెడ్డికి, ఈటలకు మధ్య చర్చలు జరిగాయని, కానీ? అవి సక్సెస్ కాలేదన్న ప్రచారం ఉంది. తాను అనుకున్న విధంగా పరిణామాలు జరక్కపోవడం వల్లనే ఈటల ఓటింగ్‌కు దూరంగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. రేపు గ్రేటర్ పరిధిలో జరిగే మూడు మున్సిపల్ కార్పొరేషన్స్‌లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకునే అవకాశం ఇద్దరు ఎంపీలకు ఉన్నా? దాన్ని వదిలేసి ఇలా చిన్న పురపాలక సంస్థల్లో ఎందుకు నమోదు చేసుకున్నారన్నది చర్చనీయాంశమైంది.

# విశ్వక్‌సేన్ డైరెక్షన్‌లో కల్ట్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరోసారి మెగా ఫోన్ పట్టాడు. విశ్వక్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'కల్ట్' . 'ఫలక్‌నుమా దాస్', 'దాస్ కా దమ్కీ' వంటి సినిమాల తర్వాత ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఎంతో ఉత్కంఠభరితంగా, సాహసోపేత మైన కథాంశంతో ఉండబోతుందని తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా ద్వారా ఏకంగా 40 మంది కొత్త నటీనటులను వెండితెరకు పరిచయం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. వియత్నాంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా, నేటి కాలపు యువతను ఆకట్టుకునేలా ఒక కొత్త తరహా కథను విశ్వక్ సేన్ స్వయంగా రాసి తెరకెక్కించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర పోస్టర్లు మరియు ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. అయితే తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఫిబ్రవరి 21న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ సంభాషణలు రాస్తుండటం విశేషం. సందీప్ కాకర్ల మరియు కరాటే రాజు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్, జపనీస్ మరియు స్పానిష్ వంటి అంతర్జాతీయ భాషల్లో కూడా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు.






# కేరళ స్టోరీ-2కు 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ

మనోజ్ బాజ్‌పేయి చిత్రం 'ఘూస్‌ఖోర్ పండత్' టైటిల్‌పై సుప్రీంకోర్టు ఆంక్షలు విధించిన తరుణంలో మరో వివాదాస్పద చిత్రం 'ది కేరళ స్టోరీ 2' విడుదలకు లైన్ క్లియర్ అయింది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు 'యూ/ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. దీనివల్ల 14 ఏళ్లు పైబడిన వారు ఈ సినిమాను వీక్షించే అవకాశం లభించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నిర్ణయంపై చిత్ర నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా స్పందిస్తూ, సెన్సార్ బోర్డు తమ కథలోని నిజాయితీని నమ్మిందని, బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. మత మార్పిడి వంటి సున్నితమైన అంశాలతో రూపొందిన ఈ చిత్రంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు. ఇది రాష్ట్రాన్ని కించపరిచేలా ఉన్న 'విద్వేషపూరిత ప్రోపగాండా' అని ఆయన అభివర్ణించారు. కేరళలోని లౌకిక సంప్రదాయాన్ని దెబ్బతీసేందుకు ఇలాంటి సినిమాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే నిర్మాత విపుల్ షా మాత్రం, ఈ సినిమా యువతులకు మరియు కుటుంబాలకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినదని అందుకే సెన్సార్ బోర్డు సానుకూలంగా స్పందించిందని అభిప్రాయపడ్డారు. కామఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో ఉల్కా గుప్త, అదితి భాటియా మరియు ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాను విపుల్ షా నిర్మించాడు. ఈ చిత్రం ఫిబ్రవరి 27, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.




# హీరోగా ఎంట్రీ ఇస్తున్న రామమచరణ్ మేనేజర్ కొడుకు



టాలీవుడ్ నుంచి హీరోల వారసులే కాకుండా, వారి వెన్నంటి ఉండే సన్నిహితుల కుటుంబాల నుంచి కూడా కొత్త టాలెంట్ వస్తుంటుంది. తాజాగా రామ్ చరణ్ డేట్స్, ఇతర సినిమా వ్యవహారాలను దశాబ్ద కాలంగా చూసుకుంటున్న ఆయన మేనేజర్ ప్రవీణ్ కుమారుడు దృషిక్ హీరోగా పరిచయం కాబోతున్నాడు. దృషిక్ చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తితో లండన్‌లోని ఒక ప్రముఖ యాక్టింగ్ స్కూల్‌లో శిక్షణ పొందినట్లు తెలుస్తుంది. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఆయన ఇప్పుడు ఒక క్రేజీ ప్రాజెక్ట్ ద్వారా వెండితెరకు పరిచయం కాబోతున్నారు. బ్లాక్‌బస్టర్ హిట్ సిరీస్ అయిన 'మ్యాడ్' ఫ్రాంచైజీలో రాబోతున్న 'మ్యాడ్ 3' చిత్రంలో దృషిక్ ఒక హీరోగా ఎంపికైనట్లు తెలుస్తోంది. సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ నిర్మిస్తున్న ఈ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌లో దృషిక్‌కి అవకాశం రావడం విశేషం. రామ్ చరణ్‌కు అత్యంత సన్నిహితుడైన ప్రవీణ్ కుమారుడు కావడంతో, ఈ కుర్రాడికి మెగా ఫ్యామిలీ మద్దతు కూడా ఉండవచ్చని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నటనతో పాటు డ్యాన్స్, ఫిట్‌నెస్‌లో కూడా దృషిక్ ఇప్పటికే మంచి పట్టు సాధించినట్లు సమాచారం.

# మిరాకిల్ షూట్‌లో ఎంటర్ కానున్న హెబ్బా పటేల్

టాలీవుడ్ హాట్ బ్యూటీ హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్ 'మిరాకిల్'. 'సత్య గ్యాంగ్', 'రౌటర్ శివ' వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ నిమ్మల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమా, మూడో షెడ్యూల్‌ను ఈనెల 24 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనుంది. ఈ షెడ్యూల్‌లో హెబ్బా పటేల్ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. సైదా ఫ్యామిలీ ఎంట్టంల్గ÷న్మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రలు పోషించడం విశేషం. ఈ చిత్రం ద్వారా నాయుడు పెంద్ర విలన్‌గా పరిచయమవుతున్నారు. గ్లామర్, యాక్షన్ కలగలిసిన ఈ చిత్రంలో సీనియర్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ ఫోరెన్సిక్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. దర్శకుడు ప్రభాస్ నిమ్మల స్వయంగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందించడమే కాకుండా సంగీతాన్ని కూడా సమకూర్చడం ఈ సినిమా ప్రత్యేకత. రవి బస్రూర్ వంటి దిగ్గజాల స్ఫూర్తితో రూపొందుతున్న యాక్షన్ బ్లాక్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమని, ఝాన్సీ, విజయ్ సూర్య వంటి భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ 'మిరాకిల్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో చూడాలి.

# అత్యాచార పాత్రలో నటించడం ఈజీ కాదు

తాప్సీ పన్నూ ప్రధాన పాత్రలో బాలీవుడ్ దర్శకుడు అనుభవ సిన్హా దర్శకత్వంలో తెరకెక్కిన 'అస్సి' చిత్రంలో అత్యాచార బాధితురాలిగా నటించిన మలయాళ నటి కని కుస్రుతి తన పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఫిబ్రవరి 20న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఈ చిత్రంలో 'పరిమ' అనే వివాహిత పాత్రలో నటించబోతున్నట్లు తెలిపింది. అత్యాచారానికి గురైన ఒక మహిళ అనుభవించే మానసిక వేదనను వేరొకరు పూర్తిగా అర్థం చేసుకోవడం అనేది చాలా కష్టమైన విషయం. అలాంటి పాత్రలో తాను నటించడం చాలా సవాలుతో కూడుకున్నది. ఒక నటిగా ఆ వేదనకు






సాధ్యమైనంత దగ్గరగా వెళ్లడానికి ప్రయత్నించానని, కొన్ని క్షణాల్లో అది నిజంగా తనకే జరుగుతోందా అనేంతగా లీనమయ్యానని కని తెలిపారు. అయితే ఆ ట్రామాలోకి పూర్తిగా వెళ్లడం వల్ల వ్యక్తిగతంగా తనపై ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో కొంత దూరం పాటించానని ఆమె వివరించారు. భారతదేశంలో పెరుగుతున్న ఒక మహిళగా ఇలాంటి దాడులు లేదా వేదనల గురించి అవగాహన ఉండటం తనకు సహజమని తెలిపిన కని.. తన సన్నిహితులు కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడం వల్ల ఇది మన చుట్టూ ఉండే చేదు వాస్తవమని కని పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా భారతీయ న్యాయ వ్యవస్థలోని క్లిష్టతలను కూడా తాను అర్థం చేసుకున్నానని, కోర్టు విచారణల సమయంలో బాధితులు పాత గాయాలను మళ్లీ తలుచుకుంటూ ఎంత నరకం అనుభవిస్తారో తనకు అర్థమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో నివసించే పరిమ అనే మహిళ కిడ్నాప్‌కు గురై, సామూహిక అత్యాచారానికి గురైన తర్వాత ఆమె న్యాయం కోసం చేసే పోరాటం చుట్టూ ఈ చిత్ర కథ తిరుగుతుంది. ఈ చిత్రంలో తాప్సీ పన్నూ లాయర్‌గా నటించగా, మహమ్మద్ జీషన్ అయ్యూబ్, మనోజ్ పహ్వా, రేవతి తదితరులు కీలక పాత్రలు పోషించారు. దేశంలో రోజుకు సగటున నమోదవుతున్న 80 అత్యాచార కేసులను సూచిస్తూ ఈ చిత్రానికి 'అస్సి' (హిందీలో 80) అని పేరు పెట్టారు.

# బ్రేకప్‌తో మొదలయ్యే ప్రేమకథ



'నేటి జనరేషన్ ఎంత వేగంగా ప్రేమలో పడుతున్నారో.. అంతే వేగంగా విడిపోతున్నారు. బ్రేకప్ తర్వాత నేటి యువత ఎలా సఫర్ అవుతున్నారు? ఎలాంటి డిప్రెషన్‌కి వెళ్తున్నారు. ఆ బాధను ఎలా హ్యాండిల్ చేస్తున్నారు? అనే ప్రశ్నలకు సమాధానమే 'బూకీ'. ఇది బ్రేకప్‌తో మొదలయ్యే ప్రేమకథ' అని నిర్మాత రామాంజనేయులు జవ్వాజీ అన్నారు. ఆయన తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న టీనేజ్ లవ్‌స్టోరీ 'బూకీ'. అజయ్ దిషన్, ధనుషా జంటగా నటించారు. గణేష్‌చంద్ర దర్శకుడు. విజయ్ ఆంటోని సమర్పిస్తున్న ఈ చిత్రంలో సునీల్, మంచు లక్ష్మి కీలక పాత్రలు పోషించారు. శుక్రవారం(నేడు) సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత రామాంజనేయులు విలేకరులతో ముచ్చటించారు. 'హీరోహీరోయిన్లు అజయ్, ధనుషాలకు మంచి పేరు తెచ్చే సినిమా ఇది. డైరెక్టరే డీవోపీ కావడంతో సినిమా అద్భుతంగా వచ్చింది. విజయ్ ఆంటోని సంగీతం ఈ సినిమాకు ఎస్సెట్. ముఖ్యంగా నేపథ్య సంగీతం సూపర్బ్. క్లైమాక్స్ కంటతడి పెట్టిస్తుంది. ఇందులో విజయ్ ఆంటోని ఓ ముఖ్య పాత్రను కూడా పోషించారు. అలాగే సునీల్, మంచు లక్ష్మి పాత్రలు కూడా కొత్తగా ఉంటాయి' అని తెలిపారు రామాంజనేయులు. సత్యదేవ్ హీరోగా తాము నిర్మిస్తున్న సినిమా పూర్తయిందని, విజయ్ ఆంటోని 'వంద దేవుళ్లు' సినిమాను మేలో విడుదల చేస్తామని ఆయన తెలిపారు.

# అట్టడుగున ఆంధ్ర రాష్ట్ర పురోగతి

- వృద్ధిరేటులో దూసుకుపోతున్నట్లు ప్రకటనలు
- రాష్ట్ర ఆదాయాలు పక్కదోవ పట్టాయి
- దోచుకో..పంచుకో..తినుకో
- ఇదే చంద్రబాబు విధానం అంటూ జగన్ విమర్శలు



**అమరావతి, ఫిబ్రవరి19( వెలుతురు):**
మన రాష్ట్ర పురోగతి అట్టడుగున ఉందని..కానీ వృద్ధిరేటులో దూసుకుపోతున్నట్లు చంద్రబాబు చెప్తున్నారని మాజీ సీఎం జగన్ అన్నారు.. చంద్రబాబు ఎవరికి చెవిలో పూలు పెడుతున్నారు.. తాజాగా మీడియా సమావేశం ఏర్పాటు చేసిన ఆయన రాష్ట్ర పరిస్థితులపై మాట్లాడారు. చంద్రబాబు రాష్ట్రానికి సంబంధించిన ఆదాయాలు పక్కదోవ పట్టాయన్నారు.. దోచుకో.. పంచుకో.. తినుకో అన్నట్లుగా టీడీపీ నేతల వ్యవహారం ఉందని విమర్శించారు.. వనరులు మొత్తం దోచేస్తున్నారన్నారు.. ఆయనకు ఒక విమానం.. దాంతో ఒక హెలికాప్టర్ ఉందని.. లోకేష్, పవన్‌కు కూడా సేమ్ అలాగే ఉన్నాయన్నారు. కొలంబో వెళ్ళి మ్యాచ్ చూస్తాడు.. తర్వాత రోజు ఉదయాన్నే విజయవాడ వస్తారని విమర్శించారు. ప్రైవేట్ ఫ్లైట్‌లో కొలంబో వెళ్ళి మ్యాచ్ చూస్తారు.. టీవీలో చూస్తే మ్యాచ్ కనిపించదా?.. నేను కూడా మ్యాచ్ టీవీలోనే చూశానన్నారు. అప్పులపై మళ్ళీ మళ్ళీ గోబెల్స్ ప్రచారాలు చేస్తున్నారని.. ఎన్నిసార్లు సాక్ష్యాలు, ఆధారాలు చూపినా అదే అబద్దాలు ఆడుతున్నారన్నారు.. కుక్క తోక వంకర అన్నట్లుగా చంద్రబాబు వ్యవహారం ఉందని తీవ్రంగా విమర్శించారు.. ప్రజలకు తెలిసిపోతుంది అని బ్జడెట్ పేపర్స్ లో అప్పుల టేబుల్ ఎత్తివేశారన్నారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. ఇక్కడ దాచిపెట్టవచ్చు కానీ ఇతర నివేదికల్లో ఏమీ చేయలేరని తెలిపారు.. ఎవరి హయాంలో ఎంత అప్పు అనేది కాగ్ విడుదల చేసిన లెక్కలు చూసినా కనిపిస్తుందని క్లియర్ గా ఉంటుందని మాజీ సీఎం జగన్ అన్నారు.. 2023-24 కు రాష్ట్రానికి సంబంధించిన అప్పులు మొత్తం రూ. 2, 57, 509 కోట్లు.. చంద్రబాబు దిగితే నాటికి రూ. 3.90 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయన్నారు.. లెక్కలు ఎంత క్లియర్‌గా ఉన్నా చంద్రబాబు మాత్రం గ్లోబెల్స్ ప్రచారం ఆపరని.. తమకు రూ. 9 లక్షల కోట్లు అప్పులు మిగిల్చి వెళ్లారని ఘోరంగా అబద్దాలు ఆడుతున్నారన్నారు? ఈ ప్రభుత్వం ఈ 20 నెలల కాలంలో చేసిన అప్పులు రూ. 3.17, 448 కోట్లు అని ఆరోపించారు.. వాస్తవాలు ఆధారాలతో కనిపిస్తున్నా బడ్జెట్ డాక్యుమెంట్స్‌తో గేమ్ ఆడుతూనే ఉంటారన్నారు..

# బిసి రిజర్వేషన్లపై కీలక నిర్ణయం

- రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేషన్ కమిషన్



**అమరావతి,ఫిబ్రవరి19( వెలుతురు):**
ఆంధప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. బీసీ రిజర్వేషన్లకు ఖరారుకు సంబంధించి.. డెడికేటెడ్ కమిషన్‌ను నియమిస్తూ.. సీనియర్ ఐఏఎస్ మాజీ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ నిర్ధారించేందుకు బీసీ జనాభా లెక్క తేల్చాలని కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది. బీసీ జనాభా లెక్కలను తేల్చేందుకు.. సంబంధిత సంస్థలు, ముఖ్యమైన వ్యక్తులు, ఇతర సంఘాల నుంచి వివరాలు సేకరించాలని ప్రభుత్వం పేర్కొంది. 45 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఏపీ సర్కార్ ఉత్తర్వుల్లో ఆదేశాలు జారీ చేసింది.

# ఉదయ్ కుమార్ రెడ్డిపై చర్య తీసుకోండి

- హత్యకేసు నిందితుడిని ఎలా కొనసాగిస్తారు
- యుసిఎల్ జీఎం సుమన్ సర్కార్‌కు సునీత లేఖ



**అమరావతి,ఫిబ్రవరి19( వెలుతురు):**
వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసులో నిందితుడిగా ఉన్న ఉదయ్ కుమార్‌రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని యురేనియం కార్పొరేషన్ లిమిటెడ్ జీఎం సుమన్ సర్కార్‌కు వివేకా కుమార్తె సునీత లేఖ రాశారు. బెయిల్‌పై ఉన్న ఉదయ్ కుమార్‌ను ఇప్పుడు మళ్లీ ఎలా విధుల్లోకి తీసుకుంటారని ప్రశ్నించారు. హత్య కేసులో నిందితుడిగా ఉన్నప్పటికీ.. ఉదయ్ కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవడంలో స్థానిక యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆమె పేర్కొన్నారు. శాఖాపరమైన దర్యాప్తును వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఉదయ్ కుమార్ రెడ్డి ప్రవర్తన, సీబీఐ అధికారిపై ఆయన చేసిన ఫిర్యాదుపై కూడా విచారణ జరగాలని విజ్ఞప్తి చేశారు. దయ్ కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేయడంలో 11 నెలలు జాప్యం చేసిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని సునీత కోరారు. ఏప్రిల్ 2023 నుంచి చేసిన చెల్లింపులపై పూర్తి స్థాయి ఆడిట్ చేయాలన్నారు. ఉదయ్ కుమార్‌రెడ్డిపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను 15 రోజుల్లో తమకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు. హత్య కేసులో నిందితుడిపై చర్యలు తీసుకోవడంలో స్థానిక యంత్రాంగం విఫలమవడంపై సునీత అసంతృప్తి వ్యక్తం చేశారు. క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంలో జాప్యం, పాలనాపరమైన లోపాలపై తాను అవసరం అయితే విజిలెన్స్, న్యాయపరంగా చర్యలు తీసుకుంటానని లేఖలో సునీత హెచ్చరించారు. వైఎస్ సునీత గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 'మా తండ్రి హత్య కేసులో ఏ6 అయిన గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డి సుమారు 500 రోజులు జైల్లో ఉన్నారు. అలాంటి వ్యక్తిపై యురేనియం కార్పొరేషన్ ఎందుకు చర్యలు చేపట్టలేదు. బెయిల్‌పై ఉన్న ఉదయ్ కుమార్‌ను ఇప్పుడు మళ్లీ ఎలా విధుల్లోకి తీసుకుంటారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలో ఇలా ఎప్పుడూ జరగలేదు. 495 రోజులు జైల్లో ఉంటే యూసీఐఎల్ సంస్థలో ఎలాంటి సెలవు పెట్టాడు. ఎందుకు చర్యలు చేపట్టలేదు. ఈ విషయంపై సీఎం చంద్రబాబును కలిసి వివరిస్తాను' అని అన్నారు.

# జాతిపిత గాంధీతో కెసిఆర్‌కు పోలికా

- జాతిపిత అని చెప్పకోవడానికి సిగ్గుండాలి
- ప్రజల సమస్యలపై ఎందుకు మాట్లాడరు..
- ఎందుకు అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేస్తారు
- కెసిఆర్ జాతిపిత ప్రకటనపై మండిపడ్డ కడియం శ్రీహరి



**జనగామ,ఫిబ్రవరి19( వెలుతురు):**
తెలంగాణ రాజకీయాల్లో 'జాతిపిత' అనే పదం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. బీఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను ఆయన పార్టీ నేతలు 'తెలంగాణ జాతిపిత'గా అభివర్ణించడాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రంగా తప్పుబట్టారు. భారతదేశానికి జాతిపిత ఒక్కరేనని, ఆయన మహాత్మా గాంధీ అని.. అలాంటి మహనీయుడితో కెసిఆర్‌ను పోల్చడం గాంధీజీని అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. అసలు కెసిఆర్ కు జాతిపిత అని చెప్పుకోవడానికి సిగ్గుండాలని ఆయన అత్యంత ఘాటుగా విమర్శించారు.నిజంగానే కెసిఆర్ జాతిపిత అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఎందుకు స్పందించడం లేదని కడియం శ్రీహరి ప్రశ్నించారు. ప్రజల కోసం పోరాడాల్సిన ప్రతిపక్ష నేత, అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ఎక్కడ ఉన్నారని ఆయన నిలదీశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఎందుకు నిలదీయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం సెంటిమెంట్‌ను వాడుకుని రాజకీయాలు చేయడం తప్ప, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్యకు వచ్చి వారి కష్టాలను తీర్చే ఉద్దేశం కెసిఆర్‌కు లేదని ఎద్దేవా చేశారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం చేసిన అవినీతి, అక్రమాలతో ప్రజలు విసిగిపోయారని కడియం ఆరోపించారు. అందుకే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించి, ఓటు వేయడానికి ఇష్టపడలేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులను కూలిపోయేలా నిర్మించడమే కాకుండా, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి దివాళా తీయించారు. ఎన్నో స్కామ్‌లలో ఇరుక్కున్న నేతను జాతిపిత అని ఎలా పిలుస్తారని ఆయన నిప్పులు చెరిగారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రాలేదని కడియం దుయ్యబట్టారు. వారి అహంకారం, అహంభావం వల్లే ప్రజలు వారికి దూరమయ్యారని, ఇప్పటికైనా చౌకబారు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొన్నారని, ఇది ఎవరి సొత్తు కాదని గుర్తు చేశారు. ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి ప్రవర్తించకపోతే భవిష్యత్తులో ప్రజలు మరింత గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

# ప్రజాతీర్పును కాలరాస్తున్న కాంగ్రెస్


- పోస్టింగ్‌ల కోసం పోలీసుల తొత్తు వ్యవహారాలు
- క్యాతన్‌పల్లిలో బలమున్నా మంత్రి వివేక్ దుర్మార్గం
- వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే.. అప్పుడ చూపిస్తాం
- మీడియాతో హరీష్ రావు వ్యాఖ్య..జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ



**ఆదిలాబాద్,ఫిబ్రవరి19( వెలుతురు):**
ప్రజలిచ్చిన తీర్పును గౌరవించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ అడుగులకు మడుగులు ఒత్తుతున్న పోలీసుల అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, వదిలి పెట్టబోమని హెచ్చరించారు. ఆదిలాబాద్ జైలులో ఉన్న మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ ను గురువారం పరామర్శించారు. అనంతరం జైలు బయట హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. క్యాతనపల్లి మున్సిపల్‌లో 22 స్థానాలకు గాను 14 స్థానాలను బీఆర్ఎస్ గెలిస్తే, ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరించకుండా, ఛైర్మన్ ఎన్నిక రోజు కావాలనే పోలీసు బందోబస్తు లేకుండా చేసి, ఛైర్మన్ ఎన్నిక జరగకుండా వాయిదా పడేలా చేశారని ఆరోపించారు. అధికారులు, పోలీసుల సమక్షంలో, మంత్రి వివేక్ చూస్తుండగానే దళిత, గిరిజన, మహిళా కౌన్సిలర్లపై దౌర్జన్యంగా, అసభ్యంగా ప్రవర్తించారని విమర్శించారు. బాల్క సుమన్, కోవ లక్ష్మిలను లోపలికి పంపించకుండా కేవలం కాంగ్రెస్ మంత్రిని ఎలా పంపిస్తారని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకులపై దాడి చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులే దాడులు చేశారంటూ పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి బాల్క సుమన్‌ను అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాతన్‌పల్లి, జనగామ, ఇబ్రహీంపట్నం, ఆమనగల్ లో బీఆర్ఎస్ నాయకులను, కౌన్సిలర్లను పోలీసు బలగాలతో భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. జనగామలో ఓటింగ్ కోసం బీఆర్ఎస్ కౌన్సిలర్ చేతి పైకెత్తితే, వెనుక నుంచి కాంగ్రెస్ కౌన్సిలర్లు చేతులు పట్టి లాగి బెదిరించే ప్రయత్నం చేశారని, అందులో దళిత మహిళ చేయి పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో తమ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నా ఎన్నికను అడ్డుకునే ప్రయత్నం చేశారని, అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మెజారిటీ ఉన్నా గాని తాము అరాచకానికి పాల్పడలేదని వెల్లడించారు. బాల్క సుమన్‌ను వెంటనే విడుదల చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ నేతలే పథకం ప్రకారం దాడి చేసి బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. బలం లేని చోట కాంగ్రెస్ ఎలా గెలుస్తుందో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.మంత్రి వివేక్ వెంకటస్వామి తీరు జుగుప్సాకరంగా ఉందని హరీశ్ విమర్శించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టింగ్‌ల కోసం బీఆర్ఎస్ నేతలను వేధిస్తే ఊరుకునేది లేదని.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక తగిన మూల్యం చెల్లించుకుంటారని పోలీసులను మాజీ మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల తిరుగుబాటు మొదలైందన్నారు. 'రాహుల్ గాంధీ.. మీ రాజ్యాంగం ఏమైందో చెప్పాలి' అని డిమాండ్ చేశారు. క్యాతనపల్లి ఇన్సిడెంట్‌పై గవర్నర్ రిపోర్ట్ తెప్పించుకోవాలని హరీశ్ రావు కోరారు. 'వినాశకాలే విపరీత బుద్ధి.. పోలీసులూ తస్మాత్ జాగ్రత్త' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు వార్నింగ్ ఇచ్చారు. కాగా, జైల్లో ఉన్న బాల్కసుమన్‌ను హరీశ్ రావుతో పాటు ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, మాజీ మంత్రి రామన్న పరామర్శించారు.

# దక్షిణ మండల విద్యుత్ సంస్థలో అవినీతి

- 8మంది ఇంజనీర్లను సస్పెండ్ చేస్తే ఉత్తర్వులు
- తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం




**హైదరాబాద్,ఫిబ్రవరి19( వెలుతురు):**
దక్షిణ మండల విద్యుత్ సంస్థలో అవినీతి ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో మొత్తం 8 మంది ఇంజినీర్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విజిలెన్స్ విచారణలో అవినీతి ఆరోపణలు నిజమని తేలడంతో ఈ చర్యలు తీసుకుంది. ఈ ఘటన విద్యుత్ శాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రజలకు సేవలందించే కీలక విభాగంలో అవినీతి చోటుచేసుకోవడం ఆందోళనకరంగా మారింది. విద్యుత్ శాఖలో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలపై కొంతకాలంగా అనేక ఫిర్యాదులు అందాయి. మొత్తం 150కు పైగా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో.. విజిలెన్స్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా అధికారులు పలు ఆధారాలను సేకరించారు. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలను పరిశీలించి సంబంధిత ఇంజినీర్ల పాత్రను గుర్తించారు. ఈ విచారణలో అవినీతి జరిగినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. విజిలెన్స్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇంజినీర్లు ఫోన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపు మార్గాల ద్వారా లంచాలు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. సాధారణంగా నగదు రూపంలో జరిగే లంచాల స్థానంలో డిజిటల్ చెల్లింపులను ఉపయోగించడం గమనార్హం. సేవలు అందించేందుకు, ఫైళ్లను త్వరగా పరిష్కరించేందుకు, కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు 8 మంది అధికారులు లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డిజిటల్ చెల్లింపుల ద్వారా జరిగిన లావాదేవీలను అధికారులు సాంకేతికంగా పరిశీలించి ఆధారాలు సేకరించారు. సస్పెండ్ అయిన వారిలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు , అసిస్టెంట్ ఇంజినీర్లు, సబ్ ఇంజినీర్లు ఉన్నారు. మొత్తం 8 మంది అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. వారిపై మరింత శాఖాపరమైన విచారణ కూడా చేపట్టే అవకాశం ఉంది. అవినీతి విషయంలో తెలంగాణ సర్కార్ కఠిన వైఖరి అవలంభిస్తోంది. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ శాఖల్లో అవినీతి సహించమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కేసులో మరికొందరి పాత్ర కూడా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉంది. విద్యుత్ శాఖలో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచాలు డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. అవినీతి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు.

# నైజీరియా గనిలో విషయవాయువుల లీక్

- 37మందిని బలి తీసుకున్న ఘటన

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి19( వెలుతురు):**
నైజీరియాలోని ఓ గనిలో విషవాయువులు లీకయ్యాయి. ఆ విష వాయువులను పీల్చి 37 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నార్త్ సెంట్రల్ నైజీరియాలోని ఓ గనిలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుందని అక్కడి పోలీస్ అధికారులు వెల్లడించారు. నార్త్ సెంట్రల్ నైజీరియాలోని ఎ÷-లాటూ రాష్ట్రంలోని ఓ గనిలో ఆకస్మికంగా లెడ్ ఆక్సైడ్, సల్ఫర్, కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్‌లు లీక్ అయ్యాయి. ఈ వాయువులు మానవాళికి విషపూరితమైనవి. పైగా గనిలో వెంటిలేషన్ కూడా తక్కువగా ఉండడంతో వీటి ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఈ విష వాయువులను పీల్చి 37 మంది



ప్రాణాలు కోల్పోయారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని అధికారులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నైజీరియా సర్కారు ఈ ప్రమాద ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించింది. గనిలో విష వాయువులు లీకవుతాయనే విషయంలో అవగాహన లేకపోవడంతోనే ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందని అక్కడి మంత్రి చెప్పారు. ప్రమాదానికి కారణమైన గని సక్రమమైనదా, అక్రమమైనదా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com